

ప్రపంచానికి ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి 09, సంచిక: 158 | శుక్రవారం | 08-05-2026 | మహబూబ్‌నగర్ Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00






## సమన్వయం పెంచుకుందాం

### భారత్‌‌– వియత్నాం కమ్యూనిస్టు పార్టీల నిర్ణయం

**న్యూఢిల్లీ:** సమన్వయంతో ముందుకెళ్లాలని భారత్– వియత్నాం కమ్యూనిస్టు పార్టీలు సంకల్పించాయి. వియత్నాం అధ్యక్షుడు, కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి టు లామ్ భారత్ పర్యటనను పురస్కరించుకొని ఆ దేశ ప్రతినిధులు గురువారం న్యూఢిల్లీలోని సిపిఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌ను సందర్శించారు. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు న్యాయెన్ తాన్ నేగీ నేతృత్వ బృందానికి సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శులు రామకృష్ణ పాండా, పల్లబ్ సేన్ గుప్తా ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రెండు పార్టీల ప్రతినిధులు అనేక అంశాలను చర్చించారు. పరస్పరం సంఘీభావం తెలుపుకున్నారు. తమ స్నేహాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. రెండు పార్టీలు, రెండు దేశాల ప్రజల మధ్య సఖ్యత, సమన్వయం పెంచుకోవాలని సంకల్పించారు. దేశ, అంతర్జాతీయ, పార్టీ పరిణామాలపై సమాలోచనలు జరిపారు.

## తమిళనాడులో వేడెక్కిన రాజకీయాలు

ఎమ్మెల్యేలను రిసార్టుకు తరలించిన ఎఐడిఎంకె

- అత్యావశ్యకమైన నిర్ణయాలు తీసుకునేందుకు స్టాలిన్‌కు అధికారాన్ని కట్టబెట్టిన డిఎంకె శాసనసభాపక్షం

**చెన్నై:** తమిళనాడు రాజకీయ వేదికపై మళ్ళీ 'రిసార్టు రాజకీయాలు' వేడెక్కాయి. గత కొద్దిరోజులుగా నెలకొన్న అనిశ్చితికి తెరదించుతూ, ఎఐఎడిఎంకె త్వరలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు అన్బళగన్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎవరూ ఊహించని విధంగా ఒక 'అద్భుతం' జరగబోతోందని ఆయన వ్యాఖ్యానించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అదే విధంగా ఈనెల 10వ తేదీ వరకు తమ ఎమ్మెల్యేలు ఎవరూ కూడా రాష్ట్రాన్ని వదిలి వెళ్లవద్దని, పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉండాలని డిఎంకె అధినేత ఎంకె స్టాలిన్ కొత్తగ ఎన్నికైన శాసనసభ్యులకు సూచించారు. దీంతో రాష్ట్రంలో ద్రవిడ పార్టీలు ఒక్కటవుతున్నాయా అనే చర్చ వినిపిస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ ఏర్పాటు దిశగా పావులు కదుపుతున్న ఎఐఎడిఎంకె తమ ఎమ్మెల్యేలు చేజారిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. సీనియర్ నేతల పర్యవేక్షణలో సుమారు 27 మంది ఎమ్మెల్యేలు పుదుచ్చేరిలోని ఒక ప్రైవేట్ రిసార్టుకు చేరుకోగా,



సీవీ షణ్ముగం నేతృత్వంలో మిగతా ఎమ్మెల్యేలను మరొక రహస్య ప్రాంతానికి తరలించినట్లు సమాచారం.

**ప్రభుత్వ ఏర్పాటుపై స్టాలిన్‌కు నిర్ణయాధికారం**

తమిళనాడులో ఒక సుస్థిరమైన ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన ''అత్యావశ్యకమైన నిర్ణయాలు'' తీసుకునేందుకు వీలుగా పార్టీ అధినేత,పదవీకాలం పూర్తిచేసుకుని రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్న ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌కు సంపూర్ణ అధికారాలు ఇస్తూ తరువాయి 8లో

## టివికె విజ్ఞప్తిపై నేడు నిర్ణయం తీసుకుంటాం

- విసికె, వామపక్షాల ప్రకటన
- డిఎంకె అధినేత స్టాలిన్‌తో భేటీ

**చెన్నై:** ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సహకరించి మద్దతు ఇవ్వాలని టి.వి.కె నాయకుడు విజయ్ వామపక్షాలకు చేసిన విజ్ఞప్తుల మధ్య సి.పి.ఐ., సి.పి.ఐ(ఎం),వి.సికె పార్టీల నాయకులు గురువారం డి.ఎం.కె అధినేత, పదవీకాలం పూర్తిచేసుకుని రాజనామా చేస్తున్న ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌తో సమా



వేశమయ్యారు. సి.పి.ఐ., సి.పి.ఐ(ఎం), వి.సి.కె పార్టీలు తరువాయి 8లో

## తమిళ గవర్నర్ తీరు తీవ్ర అభ్యంతరం


### రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌పై మండిపడ్డ వివిధ పార్టీల నాయకులు
### టివికెకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతివ్వాలని డిమాండ్

**చెన్నై :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలలో ఏకైక అతిపెద్ద పార్టీగా నిలిచిన టివికె పార్టీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ అవకాశం కల్పించకపోవడంపై రాష్ట్రంలోని వివిధ పార్టీలు మండిపడ్డాయి. గవర్నర్ తీరు తీవ్ర అభ్యంతరకరమన్నాయి. టివికెకు ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని విసికె చీఫ్ థోల్ తిరుమావళవన్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిజెపి తమిళనాడు రాజకీయాల్లో జోక్యం చేసుకుని గందరగోళం సృష్టిస్తోందని ఆరోపించారు. టివికెకు ప్రజలు అతిపెద్ద పార్టీగా తీర్పు ఇచ్చారని, అందువల్ల విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాలని, తరువాయి 8లో



## విజయ్‌కి మళ్లీ తిరస్కరణ

### తగినంత మెజారిటీ మద్దతు ఇంకా నిరూపితం కాలేదని ప్రభుత్వ ఏర్పాటుకు మోకాలడ్డిన గవర్నర్



**చెన్నై :** తమిళనాడులో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు తనను ఆహ్వానించాలని కోరుతూ, టివికె వ్యవస్థాపకుడు విజయ్ మరోసారి గురువారం గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిశారు. 24 గంటల వ్యవధిలో గవర్నర్‌ను కలిసేందుకు లోక్ భవన్‌కు వెళ్లడం ఇది రెండవసారి. తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి, అసెంబ్లీ మెజారిటీ నిరూపించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే ఈ భేటీపై లోక్‌భవన్ ఒక ప్రెస్‌నోట్‌ను విడుదల చేసింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు తరువాయి 8లో

## టివికెకు అవకాశమివ్వాలి

### గవర్నర్ పాత్ర సందేహాత్మకం
### బల నిరూపణ సభలో... రాజ్‌భవన్‌లో కాదు : డి.రాజా

**న్యూఢిల్లీ/చెన్నై:** తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటు చేసే ప్రక్రియలో ఆ రాష్ట్ర గవర్నర్ పాత్ర సందేహాత్మకంగా ఉందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వ్యాఖ్యానించారు. 'తమిళగ వెట్రి కళగం (టివికె) అతిపెద్ద పార్టీగా అవతరించించింది. ఆ పార్టీకి అవకాశమివ్వాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో బలాన్నీ సభలో నిరూపించుకోవాలి తప్ప రాజ్‌భవన్ హాళ్లలో కాదు' అని డి.రాజా గురువారం ఓ ప్రకటన చేశారు. అతిపెద్ద పార్టీ నాయకుడిని ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి, అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకోవడానికి వెంటనే ఆహ్వానించడం ద్వారా గవర్నర్ తన రాజ్యాంగ బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. రాజ్యాంగ నిబంధనల అమలులో ఆలస్యం, అలసత్వం, సందేహం వంటివి రాజకీయ జోక్యం భయాలను తరువాయి 8లో

## బెంగాల్ అసెంబ్లీ రద్దు

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీని రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవి గురువారం రద్దు చేశారు. ముఖ్యమంత్రి పదవికి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ రాజీనామా చేయకపోవడంతో.. గవర్నర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. బెంగాల్‌లో శనివారం కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. శుక్రవారం బిజెపి శాసనసభాపక్షం సమావేశం కానుంది. ఈ సమావేశంలో శాసనసభాపక్ష నేతను ఎమ్మెల్యేలు ఎన్నుకోనున్నారు. అసెంబ్లీ రద్దుతో మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని గవర్నర్ రవి బర్తరఫ్ చేసినట్లు అయింది. 294 స్థానాలు ఉన్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి రెండు విడతలుగా ఎన్నికలు జరిగాయి. 4వ తేదీన ఈ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అధికారాన్ని బిజెపి ఓటర్ కట్టబెట్టాడు. దీంతో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్పష్టమైన మెజార్టీ ఓటర్ ఇచ్చారు. దీంతో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బిజెపి అగ్రనేతలు ముహూర్తం ఖరారు చేశారు. 9వ తేదీ ఉదయం10 గంటలకు ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని పశ్చిమ బెంగాల్ బిజెపి చీఫ్ సమీక్ భట్టాచార్య ప్రకటించారు.





## కరీంనగర్‌లో రణరంగం

### ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌పై బిజెపి దాడి

- హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కారు అద్దాలు ధ్వంసం
- రేపు నగరం బంద్‌కు పిలుపునిచ్చిన బిఆర్‌ఎస్
- బిజెపి దాడిని ఖండించిన సిపిఐ

**ప్రజాపక్షం/కరీంనగర్**

విమర్శలు.. ప్రతి విమర్శలు.. దాడులతో కరీంనగర్ లో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. బిజెపి, బీఆర్ ఎస్ ల మధ్య మాటల యుద్ధం కాస్త రణరంగానికి దారి తీసింది. కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ పై గురువారం బిజెపి నేతల దాడితో నగరంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ పై హుజురాబాద్ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బిజెపి శ్రేణులు మండిపడ్డారు. కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కౌశిక్ రెడ్డి ఉన్నాడనే సమాచారంతో అక్కడికి వెళ్లి ఆందోళనకు దిగారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే కారును ధ్వంసం చేసి, కార్యాలయ అద్దాలు, ఫర్నీచర్ పగలగొట్టారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. పలువురు బిజెపి నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో పలువురు బీఆర్ ఎస్ కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కౌశిక్ రెడ్డి గురువారం ఉదయం 10 గంటలకు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ మీడియా సమావేశంలో కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతలు తరువాయి 8లో

## ముగ్గురు యువకుల జలసమాధి

### సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం శివారులో ఘటన
### కుటుంబాల్లో తీవ్ర విషాదం



**ప్రజాపక్షం/గజ్వేల్ :** సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం శివారులో ముగ్గురు యువకులు జల సమాధి అయ్యారు. సరదాగా గడుపుదామని మెదక్ జిల్లా నర్సాపూర్ ప్రాంతం నుండి వచ్చిన ముగ్గురు యువకులను హల్దీ వాగు రూపంలో మృత్యువు కబళించింది. వాగులో స్నానానికి దిగి ముగ్గురు గల్లంతవ్వడం స్థానికంగా తీవ్ర కలకలం రేపగా, ఈ సంఘటనకు సంబంధించి బాధితులు, పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్ కు చెందిన ఎర్రగుళ్ల ప్రశాంత్ (27), వికాస్ (27), కొంతమి ఆనంద్ రెడ్డి (27)లు తూప్రాన్ లో తరువాయి 8లో

## సుప్రీం కోర్టులో తేల్చుకోండి

### ఎమ్మెల్సీ నియామకాల వివాదంపై హైకోర్టు స్పష్టీకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్**

గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా నియమితులైన ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మాజీ క్రికెటర్, మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌ల నియామకాలపై వివాదం ఉంటే సుప్రీం కోర్టులో తేల్చుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారం ఇప్పటికే సుప్రీం కోర్టు పరిధిలో ఉన్నందున తాము జోక్యం చేసుకోలేమని తరువాయి 12లో

## పశ్చిమాసియాలో త్వరలో యుద్ధానికి తెర

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన
- అమెరికా ప్రతిపాదనలు పరిశీలిస్తున్న ఇరాన్

**వాషింగ్టన్/దుబాయ్ :** పశ్చిమాసియాలో ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం త్వరలో ముగిసిపోతుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. యురేనియంను శుద్ధి చేయాలని, అణ్వాయుధాన్ని తయారు చేయాలని ఇరాన్‌కు ఉన్న ఆశయాన్ని నిర్మూలించాలనే తన లక్ష్యాన్ని ప్రపంచంలో చాలామంది అర్థం చేసుకున్నారని అన్నారు. యుద్ధం ముగించేందుకు అమెరికా ప్రతిపాదనలు ఇంకా తమ పరిశీలనలో ఉన్నాయని ఇరాన్ పాలకులు ప్రకటించిన నేపథ్యంలో గురువారం ట్రంప్ పైవిధంగా వ్యాఖ్యానించారు.ఇరాన్‌తో 14 అంశాల ఒప్పందానికి చాలా దగ్గరలో ఉన్నామని వైట్ హౌస్ పేర్కొన్నట్లు అమెరికా వార్తా సంస్థ 'ఆక్సియోస్' పేర్కొంది. ఐతే యుద్ధం ముగించేందుకు



అమెరికా చేసిన ప్రతిపాదనలను ''ఒక కోరికల జాబితా''గా ఇరాన్ పార్లమెంటులో సీనియర్ సభ్యుడు ఒకరు కొట్టిపారేయగా, తమ అభిప్రాయాలను కేవలం అధికారిక మధ్యవర్తిగా ఉన్న పాకిస్థాన్‌కు మాత్రమే తరువాయి 12లో

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వైరం రైతుల పాలిట శాపం?

### ధాన్యం సేకరణలో తీవ్ర జాప్యం
### కొనుగోలు కేంద్రాలలో ఎక్కడికక్కడ నిలిచిపోయిన వైనం
### పడిగాపులు కాస్తూ ఆందోళనలో రైతన్న

**ప్రజాపక్షం/హైదరాబాద్**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న రాజకీయ వైరం రాష్ట్ర రైతుల పాలిట శాపంగా మారిందా? ఇది కాస్తా రబీ సీజన్ ధాన్యం సేకరణకు అడ్డంకిగా మారిందా? కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాజకీయంగా అప్రతిష్టపాలు చేసే కుట్రలో భాగమేనా? తాజా పరిస్థితులను గమనిస్తే ఇది నిజమేనేమో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రైతుల సంక్షేమమే పరమావధిగా పనిచేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం సహకరించుకోకపోవడమే ధాన్యం కొనుగోలు జాప్యానికి కారణమని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**90 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ ప్రభుత్వం లక్ష్యం నేరవేరేనా ?**

ఈ రబీ సీజన్‌లో పౌర సరఫరాల శాఖ ద్వారా 30 లక్షల మెట్రిక్ టన్నుల సన్నాలు, 60లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యాన్ని సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను సైత ం ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 12.50 లక్షల మెట్రిక్ టన్నులు సైతం ధాన్యం కొనుగోలు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా కొనుగోలు చేసిన ధాన్యం రైస్ మిల్లులకు తరలించడమే అసలు సమస్యగా మారింది. ఇందుకు రైస్ మిల్లులకు ధాన్యంతో వెళ్లిన లారీలు సకాలంలో ఖాళీ కాకపోవడం ప్రధాన అడ్డంకిగా మారింది. దీంతో ధాన్యం లోడంటేనే రాష్ట్ర వ్యాప్తంగా లారీ ఓనర్లు హడలిపోయే పరిస్థితి నెలకొంది. కాంటా వేసిన ధాన్యం రైస్ మిల్లులకు తరలించేందుకు లారీల కొరత ఏర్పడడంతో కొనుగోలు సెంటర్లలో ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తిగా మందగించింది. ఫలితంగా రైతులు ధాన్యంతో మార్కెట్ యార్డులు, కోనుగోలు సెంటర్లలలో పడిగాపులు కాసే పరిస్థితి ఏర్పడింది. ఇది ఇలాగే కొనసాగితే అసలు ఏడాది ప్రభుత్వ లక్ష్యం నేరవేరుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది.



**రైస్‌మిల్లుల్లో పేరుకుపోయిన నిల్వలే అసలు కారణం?**

రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం లేవి బియ్యం రూపంలో ఎప్పటికప్పుడు సేకరించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులు వాటికి కేటాయించిన కోటాను మిల్లింగ్ చేసి బియ్యం రూపంలో ఎఫ్‌సిఐకి అందిస్తారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ బియ్యాన్ని ఎప్పటికప్పుడు తరలించాల్సి ఉంటుంది. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో రాజకీయమో లేక ఇతర కారణాల వల్లనో గత కొంతకాలంగా కేంద్రం పెద్దగా తరువాయి 8లో

## భూమిని రక్షించుకోవాలి

- భూసారం క్షీణిస్తే ఎన్ని మందులు వాడినా నిష్ప్రయోజనం
- అధిక ఎరువుల వినియోగంతో ఆరోగ్య సమస్యలు
- దేశ భవిష్యత్తుకు కొత్త దిశ మెగా రైతు మేళా
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హనుమకొండ**

రైతు భవిష్యత్తుకు కొత్త దిశ – మెగా రైతు మేళా అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. భూసారం క్షీణిస్తే ఎంత మందులు వాడినా ప్రయోజనం ఉండదని, భూమిని కాపాడుకోవడం అత్యంత అవసరమని అన్నారు. రసాయన ఎరువుల అధిక వినియోగంతో ఆరోగ్య సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని, పూర్వీకుల సహజ వ్యవసాయ పద్ధతులను తిరిగి ఆచరించాల్సిన అవసరం ఉందని సూచించారు.రాష్ట్రం వ్యవసాయ రంగంలో అగ్రగామిగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా ఈ నెల 5వ తేదీ నుండి 7వ తేదీ వరకు హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగింది. మూడు రోజుల రాష్ట్రస్థాయి తరువాయి 12లో

# 'ఇండి' కూటమికి పరీక్షా సమయం

గత లోక్‌సభ ఎన్నికలకు ముందు, బిజెపిని ఎదుర్కొనేందుకై రెండు డజన్ల ప్రతిపక్ష పార్టీలతో ఏర్పడిన కూటమి – ''ది ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంట్ ఇన్‌క్లూజివ్ అలయెన్స్(ఐ.ఎన్.డి.ఐ.ఎ.)'' – నాయకత్వం, కార్య క్రమం, కార్యాచరణ కోణాలనుంచి క్రియాశీలం కావలసిన ఆవశ్యకతను తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు డిమాండ్ చేస్తున్నాయి. ''ప్రతిపక్ష ఐక్యత' అనే బోలు భావననుండి 'సంఘటిత ప్రతిపక్ష రాజకీయ శక్తి'గా అది పరిణామం చెందకపోతే రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, లౌకికవ్యవస్థకు అత్యంత ప్రమాదకారిగా ఏ మితవాద మతవాద 'రాజకీయ కుటుంబాన్ని (ఆర్‌ఎస్‌ఎస్ పరివారం – దాని రాజకీయ విభాగం బిజెపి) ఈ కూటమి పరిగణిస్తున్నదో ఆ 'కుటుంబం' రాజ్యాధికారాన్ని సంపూర్ణంగా హస్తగతం చేసుకునే ప్రమాదాన్ని ప్రస్తుత పరిణామాలు సంకేతిస్తున్నాయి. 2027 లో జరిగే ఉత్తరప్రదేశ్, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్, మణిపూర్ అసెంబ్లీ ఎన్నికలు 'ఇండి' కూటమి క్రియాశీలతకు పరీక్ష కానున్నాయి. ఎన్నికలకు ఎంతో ముందునుంచి సర్వవిధాల సంసిద్ధమయ్యే బిజెపి కార్యసరళికి, 'ఇండి' కూటమి భాగస్వాముల మధ్య ఆధిక్యతకోసం పెనుగులాట, అనైక్యత, ఆషామాషీ వ్యవహార సరళికి మధ్యనున్న పెద్ద అగాధం కూటమి బలహీనతను బహిర్గతం చేస్తున్నది. ఈ కూటమికి నాయకుడెవరు? కార్యక్రమం ఏమిటి? కాంగ్రెస్ బలహీనపడినప్పటికీ అది అఖిలభారత ఉనికి, ప్రభావం ఉన్న పార్టీ. మిగతా భాగస్వామ్య పక్షాలు తమ రాష్ట్రాలకు పరిమితమైన పార్టీలు. అవి తమ రాష్ట్రాల్లో ఆధిపత్యం కోరుకుంటున్నాయి. ఉత్తరప్రదేశ్ మినహాయిస్తే హిందీ బెల్టులో బిజెపికి ప్రత్యర్థి కాంగ్రెస్ మాత్రమే. అక్కడ ఈ ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్‌కు చేయగల సహాయం లేదు. కాంగ్రెస్ నాయకత్వాన్ని అంగీకరించ టానికి కొన్ని పార్టీలు సిద్ధంగా లేవు, ఈ వైరుధ్యం కూటమి భాగస్వాములమధ్య అగడ్త అవుతున్నది. అంతేగాక 'ఇండి' కూటమి పార్లమెంటులో సమన్వయం, జాతీయ రాజకీయాలకే పరిమితమన్న భావన కూడా రాష్ట్రాల్లో ఐక్య కృషిని నిరోధిస్తున్నది. జాతీయ నాయకత్వ ఆకాంక్షాపరులైన నాయకులు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. ఇటువంటి వాస్తవాలను 'ఇండి' కూటమి నాయకులు వస్తుగతంగా పరిశీలించి ఏకత్రాటిపై పనిచేయటం ఎలాగో నిర్ధారించుకోవాలి. ప్రజల విశ్వాసం చూరగొనగలిగింది పటిష్టమైన నాయకత్వం, దాని కార్యక్రమం, కార్యాచరణ. బిజెపి పాలనను విమర్శించటమే కార్యక్రమం కాదు. రాజ్యాంగ మౌలిక విలువల కు నిబద్ధమై, ప్రజాస్వామ్యం, లౌకికత, ప్రజాహితం, రైతు, కార్మిక సంక్షేమం కోసం స్పష్టమైన ఎజండా ప్రజలముందు ఉంచాలి.

బిజెపి రాజ్యాంగ వ్యవస్థలన్నిటినీ తన చెప్పుచేతల్లోకి తీసుకుని ప్రతిపక్షాలను వేధిస్తున్నదని, ఓటర్ల జాబితాలను తారుమారు చేసి అధికారాన్ని దొంగలిస్తున్నదని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధి నెత్తినోరు కొట్టుకుంటున్నాడు. ఇంతటి తీవ్రమైన అంశంపై కూటమికి పోరాటం ఏది? ఎన్నికల కమిషన్ 'సర్' పేరుతో లక్షలకొలది ప్రతిపక్ష సానుభూతి పరుల ఓట్లు ఏరివేస్తుంటే ఒక్క మమతా బెనర్జీ తప్ప ఐక్య ప్రతిఘటన ఏది? అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశం పిలిచి మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో ముడివేసిన మోదీ దుష్ట పన్నాగాన్ని ప్రతిపక్షాలు ఐక్యంగా ఓడించాయి. అయితే బిల్లు ఓడినా, ఆమోదం పొందినా దాన్ని రాజకీయ ఆయుధంగా ఎన్నికల్లో ఉపయోగించి లబ్ది పొందే ప్రయత్నం చేసిన ప్రధాని నరేంద్రమోదీ ఎత్తుగడను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లటంలో కూటమి విఫలం కాలేదా? బిల్లును ఓడించి ప్రతిపక్షాలు మహిళా వ్యతిరేకులుగా రుజువు చేసుకున్నాయని ప్రధాని అదే పనిగా నిందిస్తుంటే 'ఇండి' కూటమి ముక్తకంఠంతో ఖండించటంలో విఫలమైంది. ఇటువంటి అంశాలు ఏవో కొన్ని పార్టీల వ్యవహారం కాదు. ప్రతిపక్ష కూటమి బలహీనతే ప్రభుత్వ పక్షానికి బలం. ఒకే దేశం ఒకే ఎన్నికలు, ఉమ్మడి పౌరస్మృతి వగైరా అనేక బిల్లులు ముమ్ముందు వస్తాయి. కాబట్టి సమష్టి రాజకీయ సంకల్పం, ఆందోళన మరింత అవసరమవుతుంది.


90వ దశకంలో వాజ్‌పేయి ప్రభుత్వానికి మద్దతు నిరాకరించిన లౌకిక ప్రాంతీయ పార్టీల్లో కొన్ని ఇవాళ అంతర్ధానం కావటమో లేక బిజెపి పంచన చేరిపోవటమే జరిగింది. ఆనాడు వాజ్‌పాయ్, వివాదస్పదమైన ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామాలయ నిర్మాణం, ఉమ్మడి పౌరస్మృతి అంశాలను తమ పాలనా ఎజండానుంచి వెనక్కి పెట్టాకగాని ప్రాంతీయ పార్టీల తోడ్పాటు లభించలేదు. అలాంటి పరిస్థితి మారిపోయి, నరేంద్రమోదీ ప్రభుత్వం తొలి రెండు అంశాలను నెరవేర్చి, మూడవ అంశాన్ని విధించే ప్రయత్నాల్లో ఉండటం (కొన్ని బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఉమ్మడి పౌరస్మృతిని ఇప్పటికే చట్టంద్వారా అమలు చేస్తున్నారు) దేశాన్ని రాజ్యాంగ లౌకిక ఆదేశం నుంచి హిందూత్వ ఎజండావైపు మరల్చే ప్రయత్నమని ప్రతిపక్ష పార్టీలన్నిటికీ తెలుసు. అయితే ఎందుకు ఐక్యంగా ప్రతిఘటించలేక పోతున్నాయి. రాజకీయ సంకల్ప లోపమే కారణం. సిపిఐ పుదుచ్చేరి కాంగ్రెస్ తీర్మానం సరిగ్గా చెప్పినట్లు, ''కేంద్రంలో బిజెపి అధికారంలోకి రావటం అన్నది అధికారం ఒక పార్టీ నుంచి మరో పార్టీ చేతిలోకి మారేటటువంటి సాధారణ ప్రక్రియ కాదు''. ఇది ఆచరణలో రుజువవుతున్నది. అందువల్ల 'ఇండి' కూటమి సమష్టి రాజకీయ సంకల్పంతో నిర్మాణాత్మకంగా, క్రియాశీలంగా పనిచేయటం ప్రారంభించాలి. అందుకు కాంగ్రెస్ చొరవ తీసుకోవాలి. కాని, కూటమి బలపడాల్సిన సమయంలో తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ డిఎంకె కూటమి నుంచి సినీహీరో విజయ్ శిబిరంలోకి జంప్ చేయటాన్ని కేంద్ర నాయకత్వం అనుమతించటం శోచనీయం. 'ఇండి' కూటమి అవకాశవాద, ఆషామాషీ కూటమి కాకుండా ఉండాలంటే అందులోని భాగస్వాముల్లో ఉన్న కాంగ్రెస్, కమ్యూనిస్టు వ్యతిరేకతను విడనాడి ఉమ్మడి కనీస కార్యక్రమంతో ప్రజాక్షేత్రంలో సమష్టిగా పనిచేయాలి. బిజెపి దక్షిణాదిని కూడా కబళించకమునుపే మిగతా దేశంలో రాజకీయంగా దాన్ని ఢీ కొనాలి. ●



## గవర్నర్లు బిజెపి ఏజెంట్లుగా మారుతున్నారు

**గవర్నర్లు బిజెపి ఏజెంట్లుగా మారుతున్నారు. ఆ పార్టీ ప్రయోజనాల కోసం రాజ్యాంగాన్ని వారు తుంగలో తొక్కు-తున్నారు. తమిళనాడు ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన టివికె అధినేత విజయ్‌ని వెంటనే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించాలి. మెజారిటీ ఉందో లేదో తేల్చాల్సింది రాజ్‌భవన్‌లో కాదని, అసెంబ్లీ వేదికగా ఆయన తన బలాన్ని నిరూపించుకునే అవకాశం ఇవ్వాలి.ఎన్నికల తర్వాత మెజారిటీ కోసం కుదుర్చుకునే పొత్తుల కంటే ఎన్నికల్లో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచిన వారికే ప్రభుత్వం ఏర్పాటు చేసే మొదటి అవకాశం ఇవ్వాలి.**

- రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబాల్



## వాయువుల ఉనికిని కనిపెట్టిన శాస్త్రవేత్త లావోయిజర్

కృషి, పట్టుదలలే ఆయుధాలుగా కలిగి, ఎవరు పరిహసించినా లెక్కచేయక, కష్టించి పనిచేసి, అంతవరకూ అసాధ్యం అన్నవారిచే ప్రయోగాలు చేయించి గాలిలోని వాయువుల గురించి తెలుపుతూ ఔరా అనేలా చేసిన ప్రముఖ రసాయన శాస్త్రవేత్త లావోయిజర్. లావోయిజర్ 1743 ఆగస్టు 26న పారిస్‌లో ఒక శ్రీమంతుల ఇంటిలో జన్మించాడు. తండ్రి వ్యాపారి, బాల్యంలోనే తల్లిని పోగొట్టుకుని మేనత్త సంరక్షణలో పెరిగి పెద్ద వాడైనాడు. తండ్రి కోరిక ప్రకారం న్యాయవాద శాస్త్రంలో పట్టభద్రుడై, న్యాయవాద వృత్తిని చేపట్టినా రసాయనశాస్త్రంపై ఎక్కువ మక్కువ కలిగి ఉండేవాడు. పారిస్ నగర దీపాలంకరణ ప్లాను పోటీలో ప్రథమ బహుమతి పొంది ఫ్రెంచి అకాడమీ ఆఫ్ సైన్సు నుండి బంగారు పతకం పొందాడు. ఇతనికి విదేశీ భాషలు రాని కారణంగా ఇతని భార్య ప్రముఖ శాస్త్రవేత్తలు, ప్రీస్లీ, కావండిష్ మొదలగు రసాయనిక శాస్త్రవేత్తల వైజ్ఞానిక వ్యాసాల ను అనువదించేది. ఇతని ఊహలకు చక్కటి భావాలను కూర్చేది. శరీరంలో నిర్విరామం గా ఆహారం దహన ప్రక్రియకు లోనై శరీరానికి ఉష్ణోగ్రతను సమకూరుస్తోందని లావోయిజర్ ప్రకటించాడు. ప్రయోగాల్లోనూ తాను ఉపయోగించే పదార్థాలను ముందుగా తూచేవాడు. ప్రయోగానంతరం మిగిలిన పదార్థాన్ని మళ్ళీ తూచేవాడు. ఆ తేడాలకు కారణం గురించి ఒక సిద్ధాంతాన్ని తయారుచేసేవాడు. అలా అతడు గాలిలోని కొన్ని వాయువులను కనుగొన్నాడు. పదార్థానికి నశింపు అనేది లేదని భౌతికరసాయనిక మార్పులవల్ల నశించినట్లు కన్పిస్తున్నదని నిరూపించాడు. గాలియందు ప్రాణవాయువు, మందవాయువులే కాక బొగ్గుపులుసు వాయువు కూడా ఒకభాగమై ఉన్నదని రుజువు చేశాడు. ప్రాణవాయువు మండిన పదార్థాలతో కలిసి ఆమ్లాలుగా తయారవుతూ వుండడం వలన దానికి ఆమ్లజని (ఆక్సిజన్) అని పేరు పెట్టాడు. మృతవాయువుకు 'ఏజోట్' అని పేరుపెట్టాడు. రాజకీయవేత్తగా ప్రభుత్వం లో ప్రవేశించాడు.1789లో ఫ్రాన్స్ బ్యాంకు అధ్యక్షుడిగా ఎన్నికైనాడు. ద్రవ్యోల్బణంపై అద్భుతమైన విషయ వివరణ చర్యల గురించి ఫ్రాన్స్ జాతీయ అసెంబ్లీలో ప్రకటించాడు. ఫ్రెంచి విప్లవం ముగిశాక కొత్త ప్రభుత్వం వచ్చింది. లావోయిజర్ అపుడు పన్నుల వసూలు అధికారి. తన విధి నిర్వహణలో అతడు నేరస్థుడని ప్రకటించి, అధికార బలంతో అతడిని దోషిగా చిత్రీకరించింది. 1794, మే 8న అతని శిరస్సును ఖండించి శిక్షించారు. 2 సంవత్సరాల తర్వాత 1796లో ఫ్రాన్స్ ప్రభుత్వం ఇతడి గౌరవార్థం రాజలాంఛనాల తో అంత్యక్రియల కార్యక్రమాన్ని ప్రకటించింది. ఇతనిని ఆధునిక రసాయన శాస్త్ర పితామహుడు అని పిలుస్తారు.

*(మే 8 లావోయిజర్ వర్ధంతి)*

# బిజెపి విజయాలకు డీలిమిటేషన్, 'సర్' ప్రధాన కారణాలు!

డాక్టర్ జ్ఞాన్ పాఠక్

**2026 ఎన్నికల ఫలితాల గణాంకాలు ఒక విషయాన్ని స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. అస్సోంలో 2023లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), పశ్చిమ బెంగాల్‌లో 2026లో జరిగిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్‌ఐఆర్ – సర్) ప్రక్రియలే ఆయా రాష్ట్రాల్లో బిజెపి సాధించిన అద్భుత విజయాలకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. బిజెపి ఓట్ల పునాది పెరుగుదల విషయానికి వస్తే, అస్సోంలో ఆ పార్టీకి అనుకూలంగా 4.6 శాతం, పశ్చిమ బెంగాల్‌లో 7.88 శాతం ఓట్ల స్వింగ్ (మార్పు) నమోదైంది. ఈ ప్రధాన అంశాలు ఇండియా కూటమికి ముఖ్యమైన పాఠాలను నేర్పుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం త్వరలోనే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను ప్రారంభించడానికి, అలాగే దేశవ్యాప్తంగా సర్ ప్రక్రియను పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నందున, ఇండియా కూటమి తక్షణమే తగిన వ్యూహాన్ని రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది.**

అస్సోంలో 2021 ఎన్నికలతో పోలిస్తే 2026లో బిజెపికి 4.6 శాతం ఎక్కువ ఓట్లు వచ్చాయి. అయితే, దాని మిత్రపక్షమైన ఎజిపి తన ఓట్ల పునాదిలో 1.44 శాతం కోల్పోగా, బిపిఆర్ కేవలం 0.34 శాతం మాత్రమే వృద్ధిని సాధించగలిగింది. బిజెపి సాధించిన ఈ విజయం కేవలం ఇండియా కూటమి ఓట్లు కోల్పోవడం వల్ల మాత్రమే సంభవించలేదు. కాంగ్రెస్ తన ఓట్ల వాటాను 0.17 శాతం పెంచుకుంది. సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) పార్టీలు వరుసగా 0.37 శాతం, 0.01 శాతం ఓట్లను కోల్పోయాయి. టిఎంసి కూడా 0.89 శాతం వృద్ధిని నమోదు చేసింది. దీనినిబట్టి చూస్తే, బిజెపి సాధించిన విజయం ప్రధానంగా ఎఐయుడిఎఫ్ పార్టీ ఓట్లు కోల్పోయిన కారణంగానే సాధ్యమైందని చెప్పవచ్చు. ఎఐయుడిఎఫ్ తన ఓట్ల వాటాను 3.83 శాతం కోల్పోయింది. అంటే బిజెపితో సమానంగా ఇండియా కూటమి కూడా రాష్ట్రంలో బలోపేతమవుతోందని అర్థం. ఇది రాబోయే 2029 లోక్‌సభ ఎన్నికల్లో ఉభయ కూటముల మధ్య మరింత హోరాహోరీ పోరుకు దారితీయవచ్చు.

అస్సోంలోని మొత్తం 126 శాసనసభ నియోజకవర్గాల్లో ఎన్‌డిఎ కూటమి 102 స్థానాలను కైవసం చేసుకుంది. 4.6 శాతం ఓట్ల మార్పు (స్వింగ్) కారణంగా, బిజెపి 2021 ఎన్నికలతో పోలిస్తే అదనంగా 22 స్థానాలను గెలుచుకుని, తన మొత్తం స్థానాల సంఖ్యను 82కు పెంచుకోగలిగింది. నియోజకవర్గాల్లో పోటీ అత్యంత హోరాహోరీగా సాగడంతోనే ఈ ఫలితం సాధ్యమైంది. 2023లో అస్సోంలో నియోజకవర్గాల పునర్విభజన ద్వారా బిజెపి ఇలాంటి పరిస్థితిని సృష్టించింది. 2026 నాటికి అస్సోంలో సర్‌ను చేపట్టలేదు.

ఎగువ, ఉత్తర అస్సోం ప్రాంతాలలో, సీట్ల సంఖ్యను 42 నుండి 43కి పెంచారు. ఆ సమయంలో బిజెపి 30 సీట్లు, ఎజిపి 6 సీట్లు గెలుచుకున్నాయి. బిజెపి అనుకూలంగా ఉండేలా నియోజకవర్గాలను అత్యంత చాకచక్యంగా పునర్విభజించారు. ఈ కారణంగానే 2021లో 36 సీట్లు గెలుచుకున్న ఎన్‌డిఎ కూటమి, ఈ సారి 41 సీట్లు సాధించగలిగింది. 2023 పునర్విభజనలో 5 నుండి 6కి పెంచిన గిరిజన, కొండ ప్రాంతాలలోని మొత్తం 6 సీట్లనూ ఎన్‌డిఎ గెలుచు-కుంది. సీట్ల సంఖ్యను 11 నుండి 15కి పెంచిన బోడోల్యాండ్‌లో ఎన్‌డిఎ14 సీట్లు, 4 నుండి 5కి పెంచిన కామరూప్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో 5 సీట్లు గెలుచు-కుంది. సీట్ల సంఖ్య తగ్గిన రెండు ప్రాంతాలు కేవలం మధ్య, దిగువ అస్సోం (ఇక్కడ సీట్లు 49 నుండి 44కి తగ్గాయి), అలాగే బరాక్ లోయ (ఇక్కడ సీట్లు 15 నుండి 13కి తగ్గాయి) మాత్రమే. ఈ రెండు ప్రాంతాలలో ఎన్‌డిఎ తన సీట్ల సంఖ్యను వరుసగా 16 నుండి 27కి, 6 నుండి 9కి పెంచుకోగలిగింది. కాబట్టి, 2027 జనాభా లెక్కల తర్వాత జరగనున్న దేశవ్యాప్త నియోజకవర్గాల పునర్విభజన సమయంలో ఇండియా కూటమి మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది.

పశ్చిమ బెంగాల్ విషయానికి వస్తే, సర్ ప్రక్రియ టిఎంసి అవకాశాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. 2021తో పోలిస్తే బిజెపి 7.88శాతం అదనపు ఓట్లను సాధించగా, టిఎంసి 7.22 శాతం ఓట్లను కోల్పోయింది. ఫలితంగా బిజెపికి 130 సీట్లు అదనంగా లభించగా, టిఎంసి 135 సీట్లను కోల్పోయింది. బిజెపి 45.85 శాతం ఓట్లను దక్కించుకోగా, టిఎంసి 40.8 శాతం ఓట్లను పొందింది.

ఈ రెండు పార్టీల మధ్య ఓట్ల వ్యత్యాసం సుమారు 5 శాతంగా ఉంది. సిపిఐ(ఎం) తన సీట్ల సంఖ్యను ఒకటికి పెంచుకోగా, కాంగ్రెస్ 2 సీట్లు అదనంగా సాధించింది. ఇది భవిష్యత్తు ఎన్నికలలో, ముఖ్యంగా 2029 లోక్‌సభ ఎన్నికలలో ఇండియా కూటమి ఐక్యతకు సంబంధించిన అవకాశాలను మెరుగుపరిచింది. ఎందుకంటే టిఎంసి, బిజెపి మధ్య ఓట్ల వ్యత్యాసం చాలా స్వల్పంగా ఉండటంతో, ఆ ఎన్నికలలో ఎన్‌డిఎ, ఇండియా కూటముల మధ్య అత్యంత హోరాహోరీ పోరు నెలకొనే అవకాశం ఉంది. బిజెపి గెలుపునకు సర్ తొలగింపులు ఎంతగానో దోహదపడ్డాయి. ఎందుకంటే ఈ ప్రక్రియ ద్వారా సుమారు 91 లక్షల పేర్లు తొలగించబడ్డాయి. ఇది దాదాపు ఓటర్లలో 12 శాతానికి సమానం. తొలగించబడిన పేర్లలో, 60 లక్షలు మరణించినవారిగా వర్గీకరించబడగా, 27 లక్షలు పెండింగ్ లో లేదా పరిశీలనలో ఉన్నాయి. వీటిలో, ఓటింగ్‌కు ముందు ట్రిబ్యునల్స్ ద్వారా కేవలం కొద్ది సంఖ్యలో మాత్రమే క్లియర్ చేయబడ్డాయి. దీంతో వారు తమ ఓటు వేయలేక పోయారు. చట్టవిరుద్ధమైన లేదా నకిలీ ఓట్లను తొలగించడం ద్వారా ఓటర్ల జాబితాను శుద్ధి చేయటానికి సర్ ఒక అవసరమైన చర్య అని బిజెపి పేర్కొంది.

*25,000కు పైగా ఓట్లు తొలగింపు జరిగిన నియోజకవర్గాలు 169 ఉన్నాయి. 2021లో ఈ సీట్లలో టిఎంసి 128 గెలుచుకోగా, బిజెపి 41 గెలుచుకుంది. 2026లో టిఎంసి కేవలం 63, బిజెపి 104 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగాయి. కాంగ్రెస్ 2 స్థానాలలో విజయం సాధించింది. 25,000 కంటే తక్కువ ఓట్లు తొలగించబడిన మిగతా 124 స్థానాలలో, 2021లో బిజెపి 36 స్థానాలు గెలుచుకోగా, ఈసారి 108 స్థానాలలో గెలుపొందింది. తార్కిక తేదాల కారణంగా తొలగించబడిన ఓట్లు అత్యధికంగా 38 నియోజక వర్గాలలో నమోదయ్యాయి. ఇక్కడ 2021లో టిఎంసి 34 స్థానాలు గెలుచుకోగా, ఈసారి కేవలం 22 స్థానాలకే పరిమితమైంది.*

**25,000కు పైగా ఓట్లు తొలగింపు జరిగిన నియోజకవర్గాలు169 ఉన్నాయి. 2021లో ఈ సీట్లలో టిఎంసి 128 గెలుచుకోగా, బిజెపి 41 గెలుచుకుంది. 2026లో టిఎంసి కేవలం 63, బిజెపి 104 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగాయి. కాంగ్రెస్ 2 స్థానాలలో విజయం సాధించింది. 25,000 కంటే తక్కువ ఓట్లు తొలగించబడిన మిగతా 124 స్థానాలలో, 2021లో బిజెపి 36 స్థానాలు గెలుచుకోగా, ఈసారి 108 స్థానాల లో గెలుపొందింది. తార్కిక తేదాల కారణంగా తొలగించబడిన ఓట్లు అత్యధికంగా 38 నియో-జకవర్గాలలో నమోదయ్యాయి. ఇక్కడ 2021లో టిఎంసి 34 స్థానాలు గెలుచుకోగా, ఈసారి కేవలం 22 స్థానాలకే పరిమితమైంది.**

187 నియోజకవర్గాలలో 5000 ఓట్లు తొలగించబడగా, వాటిలో బిజెపి 119 స్థానాలను గెలుచుకుంది. వీటిలో ఏకంగా 47 స్థానాలలో మెజారిటీ కంటే తొలగించిన ఓట్ల సంఖ్యే ఎక్కువగా ఉన్నాయి. అలాంటి 28 స్థానాలను బిజెపి గెలుచుకుంది.

ఈ డేటా చాలా ముఖ్యమైనది, ఎందుకంటే తదుపరి దశ ఎన్నికలకు ముందే దేశవ్యాప్తంగా సర్ ప్రక్రియను పూర్తి చేయాలని భారత ఎన్నికల భావిస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో కనిపించినట్లుగా, ఓటర్లను అన్యాయంగా తొలగించకుండా నిరోధించడానికి ఇండియా బ్లాక్ పార్టీలు మరింత జాగ్రత్తగా ఉండాలి.

బిజెపి ఓటర్ల పునాదిలో చోటు చేసుకుంటున్న భారీ పెరుగుదలను ఎదుర్కోవడానికి, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రచారం చేస్తున్న కథనానికి దీటుగా, ఇండియా కూటమి మరింతగా ప్రజలను ఒప్పించే రాజకీయ ప్రత్యామ్నాయ కథనాన్ని రూపొందించుకోవాల్సి ఉంటుంది. బిజెపి అనుసరించే 'హిందూత్వ' కు భిన్నంగా, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్యవాదం ప్రాధాన్యతను దేశ ప్రజలకు వారు బలంగా చాటిచెప్పాలి.

*(ఐపిఎ సర్వీస్)*

# అకాలవర్షాలు... పంట నష్టాలలో రైతాంగం!

రైతాంగం అరుగాలం శ్రమించి పండించిన పంటలు కల్లాలలోనే కళ్ళముందే అకాల వర్షాలకు కొట్టుకొని పోతుంటే.. మరో వైపు కొనుగోలు కేంద్రాలైన వ్యవసాయ మార్కెట్లో కాట కోసం తెచ్చి నిమ్ముందని ఆరాబోసిన కుప్పలు ధాన్యం, కాటా వేసి 34 రోజులైన లారీలురాక మిల్లులకు పంపకుండా ఉన్న ధాన్యం ప్రకృతిలో మార్పుతో అప్పటికప్పుడే వడగండ్లతో వాన, గాలి దుమారంతో తడిసిముద్దయి.. కొట్టుకుపోతుంటే ఆ రైతుల బాధ వర్ణనాతీతం. జరిగిన పంట నష్టం భరించే వారెవరు? తీరా ప్రతి సంవత్సరం పంట చేతికి వచ్చే తరుణంలో.. అమ్ముకునే తరుణంలో జరుగుతున్న అష్ట కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో.. ఆదుకునే నాథుడే ఎవరో.. రైతుల బాధలు వర్ణనాతీతం..

**ఎండలు..వడగాడ్పులు**

సూర్యుడి మహోగ్రరూపంతో చంద్రనిప్పులతో రాష్ట్రంలో ప్రజలు విలవిల్లాడుతున్నారు. రోళ్ళు పగిలే రోహిణి కార్తె రాకముందే మండిపోతున్న ఎండలు ఎన్నో ప్రాణాలను నిలువునా తోడేస్తున్నాయి. గత రెండు, మూడు రోజుల్లో రాష్ట్రంలో 12 జిల్లాలలో భానుడి ప్రతాపం భీకరంగా ఉంది. 45, 46 డిగ్రీల ఉష్ణోగ్రతలతో జనం అల్లాడుతున్నారు. నిప్పుల కొలిమిని తలపిస్తున్న వాతావరణంలో చాలాచోట్ల వడదెబ్బ మరణాలు నమోదవుతుయ్యాయి. పర్యావరణ మార్పులతో వడగాడ్పుల వేడిమితో అప్రమత్తంగా ఉండాలని, ప్రజారోగ్య భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని నిపుణులు తెలుపుతున్నారు.

నేషనల్ సెంటర్ ఫర్ డిసీస్ కంట్రోల్ నివేదిక ప్రకారం 2024లో దేశవ్యాప్తంగా వెలుగుచూసిన వడదెబ్బ కేసులో సగానికి పైగా తెలుగు రాష్ట్రాల్లోనే నమోదయ్యాయి. కేంద్ర లెక్కల మేరకు ఏపీతో పోలిస్తే తెలంగాణలో వడదెబ్బ మరణాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఆరుబయట ఎక్కువ వ్యవసాయ పనుల్లో సమయం గడిపేవారు.. ప్రధానంగా వృద్ధులకు ఉష్ణ ప్రకోపం ప్రాణాంతకం అవుతుంది. కాబట్టి అందరూ తగినంతగా నీరు, మజ్జిగ, నిమ్మరసం వంటివి తాగుతూ ఉండాలి. ఆహార విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. మధుమేహం, బీపి వంటి దీర్ఘ కాల వ్యాధులు ఉన్న వారు జాగ్రత్తగా మెలగాలని వైద్య నిపుణులు తెలుతున్నారు.

గత వారం, పదిరోజులుగా వడదెబ్బతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరుతున్న బాధితులు సంఖ్య పెరుగుతున్నది. వేడిగాలుల ముప్పు అంతకంతకు అధికమవుతున్న క్రమంలో వాటిని జాతీయ విపత్తుల జాబితాలో చేర్చాలని 16వ ఆర్థిక సంఘం ఇటీవల సిఫార్సు చేసింది.

**సామాన్యుల జీవితం అస్తవ్యస్తం :**

వడగాలుల నుండి రాష్ట్రంలో ప్రకృతి ప్రకోపానికి సామాన్య జనజీవనం అస్తవ్యస్తమవుతుంది. అకాలవర్షం, పిడుగుపాటు, ఈదురు గాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఆరుగాలం శ్రమించిన పంట నీటి పాలవడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమయ్యారు. రహదారులపై ఆరబోసిన ధాన్యం, వ్యవసాయ మార్కెట్లో అమ్మకానికి తీసుకువచ్చిన పంట వర్షానికి కొట్టుకుపోతుంటే.. దాన్ని కాపాడుకోవడానికి నాన అగచాట్లు పడుతున్నారు. మరో వైపు తీవ్రమైన గాలులతో కొన్ని చోట్ల భారీ వృక్షాలు నేలకొరిగి వాహనాలపై పడి ధ్వంసమయ్యాయి. ఈదురు గాలులతో పలుచోట్ల మామిడి, నిమ్మ పంట దెబ్బతింది.

**వడగాడ్పులతో నలుగురు మృతి:**

ఆదివారం రోజున తీవ్ర వడగాడుపులతో రాష్ట్రంలో నలుగురు మృతి చెందారు.

మహబూబాద్ జిల్లా కురవి మండ లం సూదనపల్లి కొనుగోలు కేంద్రంలో కాంటా వేస్తున్న సమయంలో పిడుగుపాటు కు గురై నీలం వెంకన్న అనే రైతు మృత్యువాత పడ్డాడు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో రాయపోలులో ధాన్యం కొనుగోలు కోసం నిరీక్షిస్తున్న రైతు గౌరయ్య వడగాడుపులకు గురై వడ్ల కళ్ళములోనే తుదిశ్వాస విడిచారు. కొత్తగూడెం జిల్లా దమ్ముపేటలో కొంచాడ శ్రీనివాస్ రావు(70) భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రానికి చెందిన రైతు తిప్పని సారయ్య (60), వనపర్తి జిల్లా వాసన గండ్లకు చెందిన పశువుల కాపరి బొడ్డు పెల్లి మురళి(45), మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన పురోహితుడు బండవరం ప్రకాష్(30) మృతి చెందారు.



**ఆరుగాలం శ్రమ అగ్నికి ఆహుతి :**

రాష్ట్రంలో వేరువేరు ప్రాంతాలలో అగ్ని ప్రమాదాలు జరిగి ఇటు రైతులకు అటు చిరువ్యాపారులకు తీవ్ర నష్టం కలిగించాయి. అదిలాబాద్ జిల్లా బోథ్ మండల శివారులో మొక్కజొన్న, జొన్న పంట కోత దశలో ఉంది. అక్కడ ట్రాన్స్ ఫార్మర్ వద్ద తీగలు ఒకదానికొకటి తగిలి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఒక పొలం నుంచి మరొక పొలంలోకి వ్యాపిస్తూ పదిమంది రైతులకు చెందిన దాదాపు 50 ఎకరాల్లోని పంటలు అగ్నికి ఆహుతయ్యాయి. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని పాతర్లపాడు గ్రామంలో మార్కెట్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో కాంటాలు వేసిన 500 క్వింటాళ్ల మొక్కజొన్న బస్తాల చుట్టూ మంటలు వ్యాపించి కాలిపోయాయి. సమీపంలోనే నూర్చేందుకు సిద్ధంగా ఉన్న సుమారు 300 క్వింటాళ్ల మొక్కజొన్న కంకులు సైతం దగ్ధమయ్యాయి. దీంతో మొత్తం 53 మంది రైతులకు రూ.20లక్షల మేర నష్టం వాటినట్లు రైతులు తెలిపారు. మంటలు పక్కనే ఉన్న గొర్ల షెడ్డుకూ వ్యాపించి 40 గొర్రెలు సైతం మృత్యువాత పడ్డాయి.

**విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు పేలి నష్టాలు:**

కామారెడ్డి జిల్లా కేంద్రం పాత బస్టాండ్ సమీపంలో వేకువజామున ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడుతూ పక్కనే ఉన్న దుకాణాలకు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేలోపే 23 దుకాణాలు కాలిపోయాయి. దాదాపు రూ.50 లక్షల మేరకు ఆస్తినష్టం సంభవించిందని బాధితులు తెలిపారు. సమీపంలోనే చిన్న వ్యాపారులు కర్రలతో షెడ్లు ఏర్పాటు చేసుకొని వాటిలో పండ్లు, పూలు విక్రయిస్తూ హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, పాన్ దుకాణాలు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్న 30 మంది చిన్నవ్యాపారుల షెడ్స్ కాలిపోయి రూ.20 లక్షల వరకు నష్ట పోయారు. ఎన్‌పిడిసిఎల్‌కు చెందిన ట్రాన్స్‌ఫారం దగ్ధం కావడంతో ఆ సంస్థకు రూ.15 లక్షల నష్టం వాటిల్లింది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం పరిధిలోని జంకు తండా ఇండస్ట్రియల్ ఏరియాలోని 33/11 కె.వి విద్యుత్ ఉపకేంద్రంలో ఆదివారం ఒక్కసారిగా మంటలు చెలరేగి భారీగా వ్యాపించాయి. మంటలు పక్కనే ఉన్న కోకాపేట్ కొబ్బరి పీచు తాళ్ల తయారీ పరిశ్రమలోకి సైతం వ్యాపించడంతో అందులోని ట్రాలీ వాహనం కాలిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్స్ కాలిపోవడంతో విద్యుత్ శాఖకు రూ.50 లక్షలకు పైగా నష్టం జరిగిందని అంచనా.

**భారీ అకాల వర్షం, వడగండ్లతో పంట నష్టం :**

మే 3, 4 తేదీలలో వడగళ్ల తో కూడిన భారీ వర్షంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో తీవ్రమైన పంట నష్టం జరిగింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు వేలాది బస్తాల మొక్కలు, ధాన్యం విక్రయానికి రాగా స్థలం సరిపోక ఆరు బయటనే పోశారు. మార్కెట్‌కు వరుసగా సెలవులు రావడంతో తూకం ఆలస్యమైంది. లారీలు సకాలంలో రాకపోవడంతో కాంటాలు వేసిన మొక్కల బస్తాలు మార్కెట్‌లోనే ఉండిపోయాయి. కొందరు రైతులు ధాన్యంపై టార్పాలిన్లు, కవర్లు కప్పుకోకపోవడంతో వర్షానికి తడిచి ముద్దయ్యాయి. మార్కెట్లో వర్షపునీరు భారీగా చేరడం తో ఆరు బయట ఉన్న బస్తాలు నీట మునిగాయి. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లోను మూడు రోజుల క్రితం వ్యాపారులు కొనుగోలు చేసిన మొక్కల బస్తాలు వర్షానికి తడిసిపోయాయి. జిల్లాలో పలు గ్రామాలలో మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలలో బస్తాలలో నింపి ఉన్న మొక్కలు నీటి మునిగాయి. కొన్ని గ్రామాల్లో ఆరు బయట ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోయింది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, ఏదులాపు రం, ఖమ్మం నగరం చింతకాని వైరా, కారేపల్లి, కూసుమంచి మండలాలతో పాటు పలు గ్రామాల్లో కల్లాల్లోని ధాన్యం తడిచింది. వ్యవసాయ మార్కెట్ యార్డులలో ఆరబోసి న ధాన్యం నీటిపాలైంది. ఖమ్మం సూర్యాపేట జాతీయ రహదారిపై రైతులు ఆరబోసిన వరి ధాన్యం వర్షాలకు కొట్టుకుపోయింది.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మోతె, హాలియా, తుంగతుర్తి, పాలకీడు, తిరుమలగిరి, మిర్యాలగూడ మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం, మొక్కజొన్నా తడిసి ముద్దయింది. ప్రధాన రోడ్లవెంట ఉన్న చెట్లు బలమైన గాలులకు విరిగిపడ్డాయి, ఇండ్ల పైకప్పులు రేకులు ఎగిరిపోయాయి. కోతకు సిద్ధంగా ఉన్న మామిడి తోటలో కాయలు రాలిపోయి, కల్లాల్లో ఉన్న మిర్చి కొట్టుకపోవడం, తడిసిపోవడంతో తీవ్ర నష్టం జరిగింది. విద్యుత్ స్తంభాలు కూలిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

కళ్ళలో ఒత్తులు వేసుకొని కాపాడుకుంటూ వచ్చిన పంట అంతా కళ్లముందే నీటి పాలు అవుతుంటే అయ్యో దేవుడా అంటూ బోరున వినిపిస్తున్నా పరిస్థితులు హృదయ విదారకంగా కనిపిస్తున్నాయి.

**కొనుగోలు కేంద్రాలలో అలస్యంగా కాంటాలు**

రాష్ట్రవ్యాప్తంగా యాసంగి పంటలు కొనుగోలుకు 8,575 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ నేటికీ ఇంకా అన్ని కేంద్రాలలో కొనుగోళ్లు మొదలు కాలేదు. ఇప్పటివరకు 12.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుచేసి రూ.1,129 కోట్ల నగదును 1.54 లక్షల మంది రైతుల ఖాతాలలోకి జమ చేశామని రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ప్రకటించినప్పటికీ.. అన్ని కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు స్టార్ట్ కాలేదని, రోజుల తరబడి కేంద్రాల వద్ద కాపలా ఉంటున్నామని, వడగండ్ల వర్షాలకు ధాన్యపురాశులపై కప్పుకొనుటకు టార్పాలిన్ సరఫరా చేయటం లేదని రైతులు తెలుపుతున్నారు. అయితే ఇప్పటివరకు 6,645కేంద్రాలలోనే కాంటాలు మొదలైన్నాయి. ఖరీదు చేసిన ధాన్యం బస్తాలు ఎప్పటికప్పుడు మిల్లులకు పంపటం లేదు. గన్ని బస్తాలకొరత, మిల్లర్లు, లారీల కొరత, హమాలీల ఇబ్బంది, తీవ్రమైన వడగాల్పులతో ధాన్యం కాంట వేయటానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఐకెపి కేంద్రాల నిర్వాహకులు తెలుపుతున్నారు.

ధాన్యం కేంద్రాలు గ్రామాలలోని వ్యవసాయ ఖాళీ భూములలో పెట్టటంతో..టార్పాల్స్ పరిచి వాటిపై ధాన్యం కుప్పలు పోస్తున్నారు. గత రెండు రోజులుగా సాయంత్రం వేళల్లో గాలివాన బీభత్సంతో కల్లాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం, మొక్కజొన్న తడిసిపోయాయి. కండ్ల ఎదుటే చేతి కందిన పంట తడిచిపోవడం, నీటిలో కొట్టుకుపోవడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.

ఇంత ఘోరం జరుగుతున్నా వ్యవసాయ శాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, సివిల్ సప్లై శాఖ ఏమీ పట్టనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు..

తక్షణమే అకాల వర్షాలతో చేతికి వచ్చిన పంట నష్టపోయిన రైతులకు, వడగండ్ల గాలులతో మామిడి, నిమ్మ, బత్తాయి తోటలు నష్టం పోయిన రైతులకు, పంటలు కాలిపోయిన రైతులను, వడ గాడ్పులతో చనిపోయిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**ఉజ్జిని రత్నాకర్ రావు,**
9490952646

# పేదల సొంతింటి కల సాకారం

- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేలా రెవెన్యూ సంస్కరణలు
- ఉమ్మడి నల్లగొండ, మహబూబ్ నగర్ జిల్లాల సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణలో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు అందించడమే లక్ష్యంగా 'గృహ విప్లవం' దిశగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి నల్లగొండ, మహబూబ్ నగర్ జిల్లాల ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ ఇండ్లు పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. సొంత స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 4 లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు. లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత ఉండాలని, ఏ చిన్న పొరపాటు జరిగినా ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

### రెవెన్యూ శాఖలో భారీ సంస్కరణలు

భూ యాజమానులకు తమ భూములపై స్పష్టమైన హక్కులు కల్పించేలా ప్రభుత్వం రెవెన్యూ రంగాన్ని ప్రక్షాళన చేస్తోందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా కీలక నిర్ణయాలను ప్రకటించారు. లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో ప్రజల సౌకర్యార్థం అదనంగా మరో తహశీల్దార్‌ను నియమించనున్నట్లు చెప్పారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య ఉన్న భూ వివాదాలను పరిష్కరించేందుకు రెండు శాఖలు కలిసి ఉమ్మడి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మిస్తామని, వీటిని ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సూచించారు.

### అధికారాలను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవు..

ఆర్‌డిఓలకు విస్తృత అధికారాలు కల్పించామని, వాటిని ప్రజా సమస్యల పరిష్కారానికే వినియోగించాలని మంత్రి స్పష్టం చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం అధికారాలను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ, ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను సకాలంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డితో పాటు ఉమ్మడి జిల్లాల ఎంపిలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు పాల్గొన్నారు.

# డిండి ఎత్తిపోతల పథకం వేగవంతంగా పూర్తి చేయాలి

అధికారులకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశాలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : డిండి ఎత్తిపోతల పథకం ఆఫ్‌టెక్ పాయింట్‌కు సంబంధించిన లెవల్ ఫిక్సేషన్ తక్షణమే పూర్తి చేసి ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఎఎంఆర్‌పి ఎస్‌ఎల్‌బిసి కాలువల సామర్థ్యాన్ని పెంచాలని ఆయన అధికారులకు సూచించారు. డిండి ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై గురువారం మధ్యాహ్నం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ.శ్రీధర్,జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, ఇఎన్‌సి రమేష్ బాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పోతిరెడ్డిపల్లి గ్రామంలో డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ బ్యారేజ్ పనులను ఈ నెల 15 నాటికి ఆర్థిక సంబంధిత అనుమతులు తీసుకుని వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. ఎఎంఆర్‌పి, ఎస్‌ఎల్‌బిసి ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 2400 క్యూసెక్కుల నుంచి 4000 క్యూసెక్కులకు పెంచాలని, ప్రాజెక్టు పూరైన తర్వాత ఈ సామర్థ్యాన్ని 6000 క్యూసెక్కులకు పెంచాల్సిన అవసరం ఏర్పడవచ్చాన్నారు. ఎస్‌ఎల్‌బిసి హై లెవల్ కాలువకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనుల కోసం ప్రభుత్వం రూ.443 కోట్లు మంజూరు చేసిందని, అయితే లైనింగ్ పనుల కంటే ముందుగా కాలువ విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు.డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా 228 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు మేలు జరగడంతో పాటు 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నీటి సమస్యలకు పరిష్కారం లభించనుందని ఆయన తెలిపారు. అదేవిధంగా 3.61 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందన్నారు. ఈ పథకం కింద మొత్తం 25.31 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో నాలుగు ఆన్‌లైన్ రిజర్వాయర్లు, ఐదు ఆఫ్‌లైన్ రిజర్వాయర్లు నిర్మాణం కానున్నాయని వెల్లడించారు. దిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు గేట్ల ఏర్పాటు కోసం వెంటనే టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు.పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పూర్తి చేసేందుకు సవరించిన అంచనాల తయారీ పురోగతిని కూడా ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించారు. దీనిని హై పవర్డ్ కమిటీ ముందు ఉంచాలని ఆయన అభిప్రాయపడ్డారు. తదుపరి మంత్రివర్గం సమావేశంలో దీనిని ప్రవేశపెట్టేందుకు నివేదికలు రూపొందించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.అదేవిధంగా పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ఎదుళ్ల రిజర్వాయర్ నుండి ఎత్తిపోతల స్కీం అప్రోచ్ ఛానల్ కు నీటిని ఏ స్థాయిలో తీసుకు రావాలనే అంశంపై తుదినిర్ణయం తీసుకోవాలని ఆయన చెప్పారు.

## బిఆర్ఎస్, బిజెపి పరస్పర దాడులపై సమగ్రమైన విచారణ జరిపించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/ హైదరాబాద్ : బిఆర్ఎస్ –బిజెపి పరస్పర బూతులు, దాడులపై సమగ్రమైన విచారణ జరిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వరంగల్ రైతు సభలో బిఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కెటిఆర్ కాంగ్రెస్‌ను కాంగ్రెస్ టిఆర్ఎస్‌ను విమర్శించ డం, కెటిఆర్‌ను బండి సంజయ్, బండి సంజయ్ ను కౌశిక్ రెడ్డి బూతులతో విమర్శించడం వంటి ఘటనలతో రాజకీయం పూర్తిగా కలుషితమైందని వా రు పేర్కొన్నారు. బండి సంజయ్ వర్గం కరీంనగర్ ఎంఎల్‌ఎ గంగుల కమలాకర్ కార్యాలయం ముందు ఉన్న కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేయడం అన్యాయమని, అదేవిధంగా రాజకీయ విలువలు లేకుండా బూతులు తిట్టడ్డాన్ని చాడ తీవ్రంగా ఖండించారు. బూర్జువా పార్టీలు దిగజారిన రాజకీయాలతో ఇలాంటి దాడులకు తెగబడడం భవిష్యత్తు రాజకీయాలు ప్రశ్నార్థకంగా మారనున్నాయని,ఇప్పుడే ఎన్నికలు వస్తున్నాయన్న చందంగా రాజకీయాలు వేడెక్కాయని పేర్కొన్నారు. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని సమగ్రమైన విచారణ చేపట్టాలని చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు.

## తెలంగాణ రవాణా శాఖ సంస్కరణలకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసలు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం రవాణా శాఖ చేపడుతున్న సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలపై కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసలు వ్యక్తం చేశారు. రవాణా శాఖ అమలు చేస్తున్న సాంకేతికత ఆధారిత కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా రవాణా చెక్‌పోస్టుల రద్దు, వాహన్‌సారథి వేదికల సమర్థవంతమైన అనుసంధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌లు, రోడ్డు భద్రతా తనిఖీల అమలు వంటి చర్యలను గడ్కరీ అభినందించారు. డిజిటల్ పాలన, నిరాటంక రవాణా నిర్వహణ, మెరుగైన రహదారి భద్రత లక్ష్యాలతో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ దార్శనికతకు పూర్తిగా అనుగుణంగా ఉన్నాయని ఆయన తెలిపారు. అలాగే సుస్థిర రవాణా వ్యవస్థను ప్రోత్సహించడం, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా తెలంగాణ రవాణా శాఖ నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు రోడ్డు ప్రమాదాల నివారణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అభినందించారు.

## ప్రజా సమస్యలు పక్కనపెట్టి ... ఢిల్లీ చుట్టూ కాంగ్రెస్ ప్రదక్షిణలు

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



ప్రజాపక్షం/కోదాడ: తెలంగాణలో రాజకీయ మార్పుకు ప్రజలు మళ్లి సిద్ధమవుతున్నారని, తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల తరహాలోనే తెలంగాణ ఓటర్లు కూడా ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిని కోరుకుంటున్నారని మాజీ మంత్రి, శాసనసభ మాజీ ఉపాధ్యక్షులు తన్నీరు హరీష్‌రావు అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని గునుగుంట్ల అప్పయ్య ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి భారత విస్తృతస్థాయి సమావేశంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌తో కలిసి పాల్గొన్న ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించా రు. ఎన్నికల సమయంలో భారీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి న ప్రభు త్వం ఇప్పుడు ప్రజల సమస్యలను గాలికొదిలేసిందన్నారు. రైతు, మహి ళ, యు వత, నిరుద్యోగి ఆశలు నెరవేర్చడంలో ప్రభుత్వం చేతులెత్తేసిందని మం డిపడ్డారు. కరోన వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా రైతుబంధు ఆపకుండా రైతులకు అండగా నిలిచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌దేనని హరీశ్‌రా వు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లను నిరంతరాయంగా కొనసాగించి రైతును కాపాడిన ప్రభుత్వం బిర్ఎస్సేనని గుర్తు చేశారు. రైతు సంక్షేమాన్ని కేవలం మా టల్లో కాకుండా చేతలో చూపించిన నాయకుడు కెసిఆర్ అని కొనియాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని, రాష్ట్ర సమస్యలను పక్కనపెట్టి ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేయడమే పనిగా పెట్టుకుందని ఎద్దేవా చేశారు. అభివృద్ధి, సంక్షేమం కంటే ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కార్యకర్తలే ప్రధాన బలమని, ప్రతి ప్రజాప్రతినిధి గ్రామస్థాయిలో పార్టీ నిమరింత బలపరిచేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకరావాలంటే కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎర్రోళ్ల సంతోష్, మాజీ ఎమ్మెల్యేలు కుసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నోముల భగత్, చిరుమర్తి లింగయ్య, టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్యయాదవ్, రాకేష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎస్‌కె నయీం, తొగరు రమేష్, చింత కవితారెడ్డి, శెట్టి సురేష్‌నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనకు వ్యతిరేకంగా.. రాష్ట్ర వ్యాప్తంగా బిసి సంఘాల భారీ నిరసన

- రేపు అమరణ నిరాహార దీక్ష చేపట్టనున్న వి.హనుమంతరావు
- బిసిల 10 ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన తర్వాతే ప్రధాని తెలంగాణకు రావాలి
- ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తరహాలో బిసిల హక్కులకై పోరాటం: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ప్రజాపక్షం/హైదరాబాద్: బిసిలు సంధిస్తున్న 10 ప్రశ్నలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం చెప్పిన తర్వాతే రాష్ట్రంలో అడుగు పెట్టాలని బిసి అఖిల పక్షం నేతలు డిమాండ్ చేశారు. లేకపోతే ప్రధాని తమ నిరసనను చవి చూడాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. తను బిసినని చెప్పుకునే ప్రధాని నరేంద్ర మోదీ తన 11 ఏళ్ల పాలనలో బిసిలకు చేసింది ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణలో బిసి కులగణన చేపడతామని చెప్పిన ప్రధాని, తీరా ఇప్పుడు మోసం చేస్తున్నారని ఆరోపించారు. బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన గురువారం అఖిల పక్ష బిసి నేతల సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముందుగా బిసిల 10 ప్రశ్నలకు సమాధానం చెప్పిన తర్వాతనే తెలంగాణలో అడుగు పెట్టాలని, లేదంటే 10వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నల్లజెండాలతో నిరసన ర్యాలీలతో పాటు, హైదరాబాద్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నిరసన తెలుపుతామని వెల్లడించారు.ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ తెలంగాణ అంటేనే ఉద్యమాల పురిటిగడ్డ అని గుర్తుంచుకోవాలన్నారు. ప్రత్యేక తెలంగాణ పోరాటం తరహాలో బిసిల హక్కుల ఉద్యమాన్ని కొనసాగించాలన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లుతో పాటు ఏ ఒక్క అంశంపై కూడా బిజెపికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. మహిళా బిల్లులో కూడా బిసిలకు అవకాశం లేకుండా చేయాలని బిజెపి ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసి అని చెప్పుకునే మోదీ బిసిల పట్ల చిత్తశుద్ధి లేదని, ముఖ్యంగా దేశ వ్యాప్తంగా 60 శాతంగా ఉన్న బిసిలపై బిజెపి అక్కసు వెళ్లగక్కుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన సందర్భంగా జనగణనలో బిసి కులగణన చేపట్టకపోవడంపై రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సిపిఐ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు.ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంతరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం శ్రీకాంత్ చారి బలిదానం చేసుకొని చరిత్రలో నిలిచిపోయారని, తాను కూడా బిసి కుల గణన కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి 75 ఏళ్ల వయసులో ఆరోగ్యం బాగా లేకున్నా ఆమరణ నిరాహారదీక్ష చేపడుతున్నానని వెల్లడించారు. షాద్‌నగర్ ఎంఎల్‌ఎ కె.శంకరయ్య, శాసనమండలి ప్రతిపక్ష నాయకులు మధుసూధనచారి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌లు మాట్లాడుతూ బిసి అఖిలపక్షం చేపట్టనున్న ప్రతి ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. అంతకు ముందు ఈ నెల 9న వి.హనుమంతరావు చేపట్టబోయే ఆమరణ నిరాహార దీక్షకు బిసి సంఘాల పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్, విక్రమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## లక్షల ఖాళీలు ఉన్నప్పుడు నియామకాలెందుకు చేపట్టరు?

- ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ,
- నేడు ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో రైల్ నిలయం ముట్టడి




ప్రజాపక్షం/హైదరాబాద్ : అసలే ఉద్యోగాలు లేక నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ,కొత్త ఉద్యోగాలు సృష్టించాల్సిన కేంద్ర ప్రభుత్వం ఉన్న ఉద్యోగాల్లో కోత విధించడాన్ని ఎఐవైఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందని రాష్ట్ర అధ్యక్షులు వలిఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర అన్నారు. రైల్వేలో ఉద్యోగాల కోత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడంతో పాటు ఖాళీగా ఉన్న మూడు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, పెండింగ్ లో ఉన్న ఆర్‌ఆర్‌బి పరీక్ష ఫలితాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హైదరాబాద్ లోని రైల్ నిలయం ముట్టడి నిరసన ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు ప్రకటించారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ పిలుపులో భాగంగా ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం పోస్ట్‌కార్డు ఉద్యమం నిర్వహించారు. ఈసిఐఎల్ లోని పలు కోచింగ్‌సెంటర్ల అభ్యర్థులు , నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశ ప్రధాని, రైల్వే మంత్రికి వేలాది పోస్టుకార్డులు పంపారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ ఇప్పటికే లక్షల సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయకుండా, మరోవైపు ఉద్యోగాలను తగ్గించడం యువత భవిష్యత్తుపై నేరుగా దాడి అని విమర్శించారు. లక్షల ఖాళీలు ఉన్నప్పుడు నియామకాలు ఎందుకు చేపట్టడం లేదని, ఆర్‌ఆర్‌బి, పరీక్షల ఫలితాలు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి, ఉద్యోగాలను పెంచాల్సింది పోయి ఎందుకు తగ్గిస్తున్నారు? ఇది సంస్కరణనా? లేక ఉద్యోగాల నిర్మూలననా? దీనిపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. యువజన వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మే డ్చల్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి సల్మాన్ బేగ్, టి. సత్య ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, ప్రదీప్,అజీమ్, కిరణ్, భరత్, నదీమ్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

## రైతుల రుణమాఫీ అమలుపై వివరాలు ఇవ్వాలి

హరీశ్‌రావు పిల్‌పై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గంలోని రైతులకు పంట రుణమాఫీ పథకం పూర్తిస్థాయిలో అమలు కాలేదంటూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. రుణమాఫీ అమలు స్థితిగతులపై సమగ్ర వివరాలు సమర్పించాలని ఆదేశించిన ధర్మాసనం విచారణను జూన్ 8కి వాయిదా వేసింది. ఈ పిల్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జిఎం మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది జె. రామచందర్‌రావు వాదనలు వినిపించారు. సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, చిన్నకోదూరు, నంగునూరు, నర్సనరావుపేట మండలాల పరిధిలోని అనేక మంది రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల పంట రుణమాఫీ మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయలేదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ చర్యలు చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా ఉన్నాయని, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని అధికరణాలు 14, 21 కింద రైతులకు లభించే హక్కులకు భంగం కలిగే పరిస్థితి ఏర్పడిందని వాదించారు. ప్రభుత్వం ప్రకటించిన గడువులోపే రైతుల ఖాతాల్లో రుణమాఫీ మొత్తాన్ని జమ చేయాలని ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు. రాష్ట్రంలో రైతులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రుణభారంతో పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. సుమారు 285 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని కోర్టుకు వివరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించినప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కాలేదన్నారు. 2024–25 బడ్జెట్ ప్రసంగంలో 25 లక్షల మంది రైతులకు నాలుగు విడతల్లో రూ.31 వేల కోట్లు విడుదల చేసి రుణమాఫీ అమలు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని, కానీ ఇప్పటివరకు రూ.20 వేల కోట్లు మాత్రమే విడుదలయ్యాయని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. వాదనలు విన్న ధర్మాసనం.. రుణమాఫీ అమలుపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.




## జర్నలిజం ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: జర్నలిజం అంటేనే ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంలాంటిదని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్, 'ప్రపంచ పత్రికాస్వేచ్ఛ దినోత్సవ' కార్యక్రమం సందర్భంగా 'భారత్ ప్రెస్ ఫ్రీడమ్‌అవార్డు 2026'ను తెలంగాణ రాష్ట్రం నుంచి సీనియర్ పాత్రికేయులుగా, రాజకీయ విశ్లేషకులుగా ప్రశంసలు అందుకున్న తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డికి నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయంలో గురువారం తెలంగాణ మేధావుల ఫోరం అధ్యక్షు డు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ ప్రదానంచేశారు. ఈ సందర్భంగా ఆయన శ్రీనివాస్‌రెడ్డిని శాలువా, పూలమాల, పుష్పగుచ్చం, జ్ఞాపిక, ప్రశంస పత్రంతో సన్మానించారు. ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజెయు ) అధ్యక్షులుగా పని చేసి ఎన్నో ప్రశంసలు అందుకున్నారని పలువురు గుర్తు చేశారు. అనంతరం కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఒక సంఘటన వెనకాల ఉన్న వాస్తవాలను ప్రజలకు తెలియజేసే క్రమంలో, కుంభకోణాలను వెలికితీసే ప్రయత్నంలో ఎంతో మంది జర్నలిస్టులు తమ ప్రాణాలను పణంగా పెట్టారని గుర్తు చేశారు. పత్రికాస్వేచ్ఛను ఏ దేశం కూడా వదులుకోలేని అమూల్యమైన హక్కు అని అన్నారు. డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను, జర్నలిస్టుల ప్రాముఖ్యతను అందరూ గుర్తించాలన్నారు. తమ ప్రాణాలకు తెగించి, వాస్తవాలను నిర్భయంగా సమాజం ముందు పెడుతున్న పాత్రికేయులందరికీ లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పన్ డైరెక్టర్ లయన్. ప్రేమ్ చంద్ మునోట్ జైన్ 'ప్రపంచ పత్రికా స్వేచ్ఛ' దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. టిసిసి కార్యదర్శి కె రవీందర్, హైకోర్టు న్యాయవాది పి.రామ్ కిషోర్,టిఐఎఫ్ కో–ఆర్డినేటర్స్ జి. వేణుగోపాల్, బిచ్చుకారి సూర్య ఆరెకటిక, టి.భూపాల్ రెడ్డి,శంకర్ సింగ్,తదితర జర్నలిస్టులు కె శ్రీనివాస్ రెడ్డిని సన్మానించారు.

## ఎసిబికి చిక్కిన అటవీ అధికారులు



ప్రజాపక్షం/భద్రాచలం : రూ.3.5 లక్షల లంచం తీసుకుంటూ గురువారం ఇద్దరు అటవీ అధికారులు ఎసిబికి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. వివరాల ప్రకారం, భద్రాచలం అటవీశాఖ లో విధులు నిర్వహిస్తున్న ఎఫ్‌డిఒ సుజాత, చర్ల ఇన్‌చార్జ్ డిఆర్‌ఒగా పనిచేస్తున్న కృష్ణయ్య చర్ల మండలం పూసుగుప్ప ప్రాంతంలో రహదారి నిర్మాణ పనుల సందర్భంగా కొన్ని చెట్లను తొలగించిన ఘటనపై కేసు నమోదు చేయకుండా ఉండేందుకు రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో బాధితుడు నుంచి తొలి విడతగా రూ.3.5 లక్షలు స్వీకరిస్తున్న సమయంలో ఎసిబి డిఎస్‌పి వై రమేష్ ఆధ్వర్యంలో బృందం దాడులు నిర్వహించి ఇద్దరినీ భద్రాచలంలో రెడ్ హ్యాండెట్‌గా అదుపులోనికి తీసుకుంది. దీంతో ఒక్క సారిగా భద్రాచలం అటవీ శాఖలో జరుగుతున్న అవినీతి వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.


**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : ఆల్విన్ కాలనీ సర్కిల్-51**

Lr.No. 01/CMC/ALC-51/EE/2026-27, తేది: 06.05.2026

NIT No. 01/CMC/ALC-51/EE/2026-27, తేది: 06.05.2026, పని పేరు: సిసి రోడ్ & బిటి రోడ్, అంచనా విలువ : రూ.70.00 లక్షలు, బిడ్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం : 07.05.2026 మ.03:00గం.లకు, 14.05.2026 ఉ.11.30గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: శ్రీ గోవర్ధన్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిఎంసి, ఆల్విన్ కాలనీ సర్కిల్-51, సెల్ నెం. 9154299633. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆల్విన్ కాలనీ సర్కిల్-51, సిఎంసి.

DIPR R.O. No. : 2086-PP/CL/ADVT/2026-27, Date: 07-05-2026

తెలంగాణ ప్రభుత్వం

**ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, TGMSIDC డివిజన్, మహబూబ్‌నగర్, టి.జి. మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ప్రాంగణంలో, మహబూబ్‌నగర్.**
మెయిల్ ఐడి: eetgmsidcmbnr@gmail.com

Short Tender Notice No. 01/EE/TGMSIDC/Divn/MBNR/e-Proc.tenders/2026-27/, తేది: 05.05.2026

1. "వనపర్తి జిల్లా, వనపర్తిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (MCH బ్లాక్)కు రోడ్డు పక్కన ఉన్న కాలువపై ప్రీకాస్ట్ స్లాబ్‌లను ఏర్పాటు చేయడం", 2. "వనపర్తి జిల్లాలో వనపర్తిలోగల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (MCH బ్లాక్) వద్ద కొత్త వంటగది షెడ్డును నిర్మాణం" పనుల కోసం www.tender.telangana.gov.in/platform ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనవి.

గమనిక: ఈ టెండర్‌కు సంబంధించిన నియమ నిబంధనల పూర్తి వివరాలు మరియు అర్హత ప్రమాణాలను పైన పేర్కొన్న వెబ్‌సైట్ http://www.tender.telangana.gov.in/ లో పొందవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

DIPR R.O. No. : 2062-PP/CL/ADVT/2026-27, Date: 07-05-2026

**కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం, వరంగల్.**

Tender Notice No. D/780/2026 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్ తేది: 7.05.2026

కింది పనికి టెండర్లు ఆహ్వానించడమైనవి:-

| | |
|---|---|
| పని పేరు | వరంగల్ జిల్లా, వరంగల్ నందలి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం యొక్క ప్రకృతి దృశ్య అభివృద్ధి మరియు సుందరీకరణ. అంచనా వ్యయం: రూ. 88.00 లక్షలు. |
| E.M.D | టెండరు సమయానికి అంచనా వ్యయంలో 1%. |
| బిడ్ సమర్పణకు ప్రారంభ తేది & సమయం | 08.05.2026 ఉ.10.00గం.లకు. |
| బిడ్ సమర్పణకు ఆఖరి తేది & సమయం & టెక్నికల్ బిడ్ ప్రారంభం | 12.05.2026 మ.3.00గం.లకు. |
| ఫైనాన్సియల్ బిడ్ ప్రారంభం | 12.05.2026 సా.6.00గం.లకు |

మరిన్ని వివరాలకు www.tender.eprocurement.gov.in సైట్‌లో చూడవచ్చు.

సం/- వైస్ చైర్మన్. KUDA, వరంగల్.

DIPR R.O. No. : 2107-PP/CL/ADVT/2026-27, Date: 07-05-2026

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
శుక్రవారం
08-05-2026
www.prajapaksham.in
నల్లగొండ, సూర్యాపేట
భువనగిరి యాదాద్రి





## భూ భారతి రెవిన్యూ సదస్సులో దరఖాస్తులకు ప్రాధాన్యత

**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్** : భూ భారతి రెవిన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులు, సాదా బైనామా, ధాన్యం కొనుగోలు, ప్రభుత్వ భూములు పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి మండల తహసీల్దార్‌లను ఆదేశించారు. గురువారం రోజున తన ఛాంబర్ లో మండల తహసీల్దార్ లతో భూ భారతి, రెవిన్యూ సదస్సు లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధించిన అన్ని దరఖాస్తులను క్లియర్ చేయాలని అన్నారు. భూ భారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, కొను గోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాల న్నారు. ధాన్యం బస్తాలను లారీల ద్వారా సకాలంలో మిల్లులకు తరలించాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలనీ తెలిపారు.సాదా బైనమా దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, రెవిన్యూ డివిజనల్ అధికారులు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, మండల తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

## యాదాద్రి దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించాలి

లేదంటే జూన్ 1 నుండి కొండపై మేమే వ్యాపారాలు చేసుకుంటాం

ఇఒకు యాదాద్రి పరిరక్షణ కమిటీ వినతి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి వారి కొండపైన ఉన్న దుకాణాలకు తక్షణమే బహిరంగ వేలం నిర్వహించాలని యాదాద్రి పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం కమిటీ సభ్యులు ఆలయ ఈవో కి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పరిరక్షణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా కొత్త టెండర్లు నిర్వహించకుండా కొందరు వ్యక్తులు రాజకీయ పలుకుబడితో వర్తక సంఘంగా ఏర్పడి, పాత రేట్లకే దుకాణాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా రెన్యువల్ కాకుండా అడ్డుకుంటూ దేవస్థాన ఆదాయానికి గండి కొడుతున్నారని మండిపడ్డారు. దీనివల్ల అటు భక్తులు దోపిడీకి గురవుతున్నారని, ఇటు స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దక్కకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త టెండర్లు లేకపోవడం వల్ల స్థానిక యువత తక్కువ జీతాలకు దూర ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకోవాల్సి వస్తోంది. మే 31వ తేదీ లోపు ఈ షాపులకు బహిరంగ వేలం నిర్వహించకుంటే, జూన్ 1 నుండి స్థానిక నిరుద్యోగులందరం కొండపైకి వెళ్లి కొబ్బరికాయలు, పూలు, పండ్లు, వస్త్రాలు అమ్ముకుంటాం' అని కమిటీ సభ్యులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యాదాద్రి పరిరక్షణ కమిటీ సభ్యులు సుడుగు జీవన్ రెడ్డి, కాటబత్తిని ఆంజనేయులు, దేవపూజ అశోక్, గుండు నరసింహ, మిరియాల కృష్ణ, సతీష్ బట్టు, వంగపల్లి అరుణ్, బండి అనిల్, మందోజు నరేష్, కర్రె ప్రవీణ్, గుండు కుమార్, ఆరె కుమార్, కొనే ప్రశాంత్, గోపగాని ప్రసాద్, కర్రె శ్యామ్ పాల్గొన్నారు.

## షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు



**ప్రజాపక్షం/మునుగోడు** : రైతులు పండించిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురిజ రామచంద్రం డిమాండ్ చేశారు.మేడే ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కొంపల్లి గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ఐకేపీ సెంటర్‌కు తీసుకొచ్చి అమ్ముకుందామంటే అక్కడ ఐకేపీ నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులు పండించిన ధాన్యానికి వివిధ రకాల కొర్రీలు పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలకు నిత్యం ఉపయోగపడే గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను అదుపు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, మండల కార్యవర్గ సభ్యుడు బి.లాలు, చల్మెడ సర్పంచ్ బండమీది యాదయ్య,శాఖ కార్యదర్శి ఒక్కంటి వెంకటేశ్వరరావు, వార్డు సభ్యుడు జీడిమడ్ల మల్లేష్,మోగుదాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## చికాగో అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలు

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** చికాగో అమరవీరుల స్పూర్తితో కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా తెచ్చిన కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్‌లపై పోరాటాలు చేద్దామని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు అన్నారు. మేడే వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం హుజూర్‌నగర్ మండలంలోని అమరవరం సిపిఐ గ్రామశాఖ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యకర్తలు, నాయకులు ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాము లు ఆవిష్కరించి మాట్లాడారు. అనేక సంవత్సరాల పోరాట ఫలితంగా వచ్చినటువంటి వ్యవసాయ కార్మిక చట్టాలను తుంగలో తొక్కి జిరామ్‌జీ పేరు మీద నూతన విధానాన్ని తీసుకరావడం సరైంది కాదన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎర్రజెండా నిరుపేద ప్రజలకు, బడుగు, బలహీన వర్గాలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కోప్పోజు సూర్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రె స్ ప్రభుత్వం ఇచ్చినటువంటి ఆరు గ్యారెంటీలలో కౌలు రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని, కౌలు రైతులకు గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు యల్లావుల రమేష్, కందుల వెంకటేశ్వర్లు, పాడిపపాటి సైదిరెడ్డి, రుణపంగు సాంసన్, ఉపేందర్, రామిరెడ్డి, బూరు వెంకన్న పాల్గొన్నారు.



# 22ఎ నిషేధిత జాబితా నుంచి 20 వేల ఇళ్ల తొలగింపు!

మంత్రి పొంగులేటిని కోరిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

సానుకూలంగా స్పందించిన మంత్రి అధికారులకు కీలక ఆదేశాలు

యాదగిరిగుట్ట, ఆలేరు ప్రాంత వాసులకు తీరనున్న భూ చిక్కులు



**ప్రజాపక్షం/యాదాద్రి** : యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు, యాదగిరిగుట్ట ప్రాంతాల్లో ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న 22ఎ నిషేధిత భూముల సమస్య పరిష్కారానికి మోక్షం లభించనుంది. ఈ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన సుమారు 20 వేల ఇళ్లు, ఇళ్ల స్థలాలను నిషేధిత జాబితా నుండి తొలగించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కోరారు. గురువారం హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ జిల్లా రెవెన్యూ, గృహనిర్మాణ అంశాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే ఈ అంశాన్ని ప్రధానంగా లేవనెత్తారు. గత అసెంబ్లీ సమావేశాల్లోనూ తాను ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేస్తూ, వేలాది కుటుంబాలు తమ సొంత స్థలాలపై హక్కులు లేక ఇబ్బంది పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే విన్నపంపై మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, దీనిపై సమగ్ర నివేదికతో చర్యలు తీసుకోవాలని సీసీఎల్‌ఏ అధికారులను, జిల్లా కలెక్టర్ను అక్కడికక్కడే ఆదేశించారు. దీంతో దశాబ్దాలుగా రిజిస్ట్రేషన్లు కాక ఆందోళన చెందుతున్న వేలాది కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. తుర్కపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో అటవీ భూములుగా నమోదైన ఇళ్ల స్థలాలను ఆ జాబితా నుండి తొలగించి, కొత్త నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కొత్త భవనం మంజూరు చేయాలని, అలాగే తుర్కపల్లి మండలానికి అదనంగా మరో 50 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కోరగా మంత్రి హామీ ఇచ్చారు. కొనుగోలు చేసిన ధాన్యం రవాణాలో జాప్యం లేకుండా అందుబాటులో ఉన్న వాహనాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా అధికారులను ఆదేశించినట్లు ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి జాప్యం జరగకుండా, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. పెరిగిన రేషన్ కార్డుల సంఖ్యకు అనుగుణంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో కొత్త రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలని చేసిన విజ్ఞప్తికి మంత్రి ఉత్తం సానుకూలంగా స్పందించినట్లు అయిలయ్య తెలిపారు.

## కార్పొరేట్ కళాశాలల ఎంపికకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : సూర్యాపేట జిల్లాలోని గుర్తింపు పొందిన ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాల నుంచి 2026/27 సంవత్సరమునకు గాను ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, డిసెబుల్ట్ విద్యార్థిని విద్యార్థులకు ఇంటర్ విద్యతోపాటు ఎంసెట్, ఐఐటి/జెఈఈ, ఏఐఈఈఈలలో శిక్షణ అందించుటకు కార్పోరేట్ కళాశాలల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారిని కె. దయానంద రాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల జూనియర్ కళాశాలల యాజమాన్యాలు తెలంగాణఇపాస్ వెబ్‌సైట్ ద్వారా తేది.11.05.2026 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అట్టి దరఖాస్తు ప్రతితోపాటు కళాశాల డాక్యుమెంట్ వివరములతో జతచేసి రూమ్ నం. ఎఫ్3, మొదటి అంతస్తు, ఐడిఓసి, సూర్యాపేటలో అందించాలని కోరారు. ఈనెల 18లోపు ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

# హైడ్రాను ప్రజలంతా కోరుకుంటున్నారు

హైడ్రా కమిషనర్ రంగనాధ్

మిగతా రాష్ట్రాల వారు ఇలాంటి వ్యవస్థ ఉండాలనుకుంటున్నారు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజలందరు హైడ్రాను కోరుకుంటున్నారని హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాధ్ తెలిపారు. నగర ప్రజలే కాకుండా ఇతర పట్టణాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన వారు కూడా హైడ్రా లాంటి వ్యవస్థలను ప్రతి రాష్ట్రంలో ఉండాలని కోరుకుంటున్నారని అన్నారు. మిర్యాలగూడలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా అక్కడ విలేకరులు హైడ్రా కమిషనర్‌ను కలిసి హైడ్రా కార్యక్ర మాలపై ఆరాతీశారు. చాలామంది హైడ్రాను విస్తరించాలని కోరుతున్నారని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం మా పరిధి ఓఆర్ఆర్ వరకే ఉంటుందన్నారు. ప్రజల నుంచి హైడ్రాకు మంచి స్పందన, పాజిటివిటి వస్తుందని అన్నారు. ఇతర జిల్లాల నుంచి ప్రజలు కూడా హైడ్రా కావాలని కోరుతున్నారని అన్నారు. మహారాష్ట్రకు చెందిన ఓ ప్రజాప్రతినిధి హైడ్రా లాంటి సంస్థ ముంబైలో కూడా అవసరమని ఒక ఆర్టికల్ రాశారని అన్నారు. ముందుగా నిర్మాణాత్మక అభివృద్ధి వైపు వెళ్తామని అన్నారు. దాదాపు 25 చెరువులను అభివృద్ధి చేస్తామని, అలాగే 5 ఎకరాలు, పది ఎకరాల చిన్న చెరువులను సీఎస్ఆర్ ద్వారా అభివృద్ధి చేస్తామని, చెరువుల పునరుద్దరణ ఒక ఎత్తయితే వాటి ఆక్రమణలను తొలగించడం పెద్ద టాస్క్ అన్నారు. ఏడాదిన్నరేండ్లలో 2100 ఎకరాల భూమిని కాపాడడం సాధారణ విషయం కాదని కర్ణాటక బృందం చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. చెరువులు పునరుద్దరణ ఎలా చెపడుతున్నారో తెలుసుకోవడానికి తాము బెంగుళూరుకు వెళ్తే... ఆక్రమణలను తొలగించి చెరువులను అభివృద్ధి చేయడం ఎలానో ఇక్కడికి వచ్చి కర్ణాటక మున్సిపల్ బృందాలు తెలుసుకునే పనిలో పడ్డాయని చెప్పారు. ఇటీవల చెన్నై నుంచి కూడా అధికారుల బృందం చెరువుల అభి వృద్ధిని, హైడ్రా పనితీరును అధ్యయనం చేసిందన్నారు. చెరువులు పునరు జ్జీవ కార్యక్రమాల్లో ఇల్లు కోల్పోయిన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు.



## మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఎసిబి దాడులు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడల పట్టణంలోని మున్సిపాలిటి కార్యాలయంపై గురువారం ఏసీబీ అధికారులు అకస్మాత్తుగా తనిఖీలు చేపట్టారు. ఏసీబీ డీఎస్పీ జగదీశ్చంద్ర నేతృత్వంలో ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్ఐలతో కలిసి ఉదయం ఒక్కసారిగా కార్యాలయంలోకి వచ్చి సిబ్బంది నుంచి సెల్ ఫోన్‌లు, ఫైల్స్ తీసుకోని మున్సిపల్ కార్యాలయ గేటుకు తాళాలు వేసి రికార్డులను పరిశీలిస్తున్నారు. ఏసీబీ అధికారుల రాకతో మిర్యాలగూడ మున్సిపాలిటి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో పలు అవినీతి అక్రమాలు జరుగుతున్నాయనే సమాచారం అందడంతోపాటు పలు పనులు చేయకుండానే నిధులు డ్రా చేసినట్లుగా ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు సోదాలు చేపడుతున్నట్లు సమాచారం. ఈ సోదాలు అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశం ఉందని సమాచారం.

## పట్టణ సుందరీకరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత



భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/భువనగిరి** : భువనగిరి పట్టణ సుందరీకరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భువనగిరి పట్టణ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం కోఆప్షన్ సభ్యుల ఎన్నిక కార్యక్రమానికి భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భువనగిరి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే దిశగా అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే భువనగిరిలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించిన మౌలిక సదుపాయాల పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తవుతాయని తెలిపారు. అనంతరం అతి త్వరలోనే గృహప్రవేశ కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని పేర్కొన్న ఆయన, మూసీ నదిపై రూ.50 కోట్ల వ్యయంతో బ్రిడ్జి మంజూరైందన్నారు. అలాగే జూలూరు, అనాజీపురం, శివారెడ్డిగూడెం ప్రాంతాలకు సంబంధించిన బ్రిడ్జిల నిర్మాణ పనులు కూడా ప్రజాపాలనలో భాగంగా చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలు అభివృద్ధి అంశాలపై చర్చించి కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్, వైస్ ఛైర్పర్సన్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి అమ్మినా, సేవించినా కఠిన చర్యలు

డిఎస్‌పి వి. ప్రసన్న కుమార్



**ప్రజాపక్షం/సూర్యాపేట** : జిల్లాలో గంజాయి సేవించినా, అమ్మినా కఠినమైన చర్యలు ఉంటాయని ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని డిఎస్‌పి వి. ప్రసన్న కుమార్ అన్నారు. గురువారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ముగ్గురు గంజాయి నేరస్తుల వివరాలను వెల్లడించారు. మండలంలోని కుసుమవారిగూడెం గ్రామ శివారులోని ఇందిరమ్మ కాలనీ మూడో విడత సమీపంలో సూర్యాపేట రూరల్ ఎస్ఐ బాలు నాయక్ సిబ్బంది బుధవారం ఉదయం వాహనాలు తనిఖీలు చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వెళ్తూ వారిని చూసి తడబడుతూ అనుమానాస్పదంగా కనిపించారన్నారు. వారిని పోలీసులు పట్టుకొని విచారించగా దేశగాని గణేష్, పశుల రాంచరణ్, పోతురాజు బన్నీ సీలేరు అనే గ్రామానికి వెళ్లి అక్కడ గంజాయిని కిలో రెండు వేల చొప్పున కొనుక్కోని వచ్చి కొంత అమ్మి కొంత తాగాలాని నిర్ణయించుకున్నారని తెలిపారు. 10 గ్రాముల ఒక్కొక్క ప్యాకెట్ రూ.వెయ్యి చొప్పున సూర్యాపేట పట్టణంలోకి వెళ్లి కొత్తబస్టాండ్ చుట్టుపక్కన సమీపంలో అమ్ముటకు నిర్ణయించుకున్నట్లు నిందితులు తెలిపినట్లు వివరించారు. కానీ ఎవరు కొనకపోవడంతో మోటార్ సైకిల్‌పై ముగ్గురు కలిసి కుసుమవారిగూడెం వస్తుండగా వారి వద్ద 1 కేజీ 160 గ్రాముల గంజాయి, ఒక మోటార్ సైకిల్ పట్టుబడి చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో రూరల్ ఎస్ఐ బాలు నాయక్, ఎఎస్ఐ వెంకన్న, రైటర్లు ఎండి అజ్గర్ అలీ, వీరస్వామి, సిబ్బంది ప్రతాప్ పాల్గొన్నారు.

## డివైడర్లను తొలగించకుంటే ప్రత్యక్ష కార్యాచరణ..

డివైడర్ల తొలగింపునకు అఖిలపక్ష ఏకగ్రీవ తీర్మాణం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వాణిజ్యపరంగా ఎంతో అభివృద్ధి చెందిన మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్డుపై ప్రజలకు అసౌకర్యంగా నిర్మించిన డివైడర్లను తొలగించకుంటే ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకుంటామని, అందుకు తానే ముందుంటానని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి హెచ్చరించారు. గురువారం వైష్ణవి హోటల్‌లో సాగర్ రోడ్డుపై నిర్మించిన డివైడర్లను తొలగించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అభివృద్ధిని అడ్డుకోవడం లేదని ఆ పేరుతో ప్రజలకు అసౌకర్యంగా ఉన్న వాటిని తొలగించాలని కోరుతున్నామన్నారు. మిర్యాలగూడకు నిత్యం లక్షలాది మంది వ్యాపార పనుల నిమిత్తం ప్రజలు వస్తుంటారు. ఆ నేపథ్యంలో రోడ్డు దాటడానికి అడ్డంగా ఇటీవల నిర్మించిన డివైడర్లు ఆటకంగా మారాయని అన్నారు. పట్టణం నుంచి జాతీయ రహదారి వెళ్లడం సాకుతో డివైడర్లను ఏర్పాటు చేశామనం సమంజసం కాదని అన్నారు. సమస్య తీవ్రంగా ఉన్నందున ప్రజాప్రతినిధులు ఎంపీ, ఎమ్మెల్యే చొరవ తీసుకోని పరిష్కారం చేయాలన్నారు. ముఖ్యంగా ఫర్టిలైజర్ బజార్‌కు వెళ్లే మార్గంలో, నందిపాడు రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, సాయిబాబా దేవాలయంకు వెళ్లే రోడ్డు, పోలీస్ స్టేషన్‌కు వెళ్లే రోడ్డుకు అడ్డంగా ఉన్న డివైడర్లను తొలగించాలని లేనట్లయితే తామే డివైడర్లను తొలగిస్తామన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, మల్లేశం, నూకల వేణుగోపాల్ రెడ్డి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, పాండు, ఇలియాస్ ఖాన్, శ్యామ్, ముప్పా రామారావు, డాక్టర్ రాజు, మల్సూర్, వస్కుల మట్టయ్య, ఫరూక్, జగదీశ్చంద్ర పాల్గొన్నారు.

## స్వీయగణనను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : స్వీయ గణనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. స్వీయ గణన చేసుకునేందుకు ఇంకా కేవలం 3 రోజులు మాత్రమే గడువు ఉందని, జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత, మహిళా సంఘాలు, ఐటి రంగ నిపుణులు, అన్ని వర్గాల వారు స్వీయ గణనలో పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. జనగణన సంబంధించి స్వీయ గణన మే 10 వరకు అవకాశం ఉందని, మొదటి దశలో భాగంగా నిర్వహించే గృహ లెక్కింపు, గృహ పరిస్థితుల లెక్కింపు కోసం ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సౌకర్యం ప్రస్తుతం అందుబాటులో ఉందన్నారు. జిల్లా ప్రజలు తమ ఇంటి, కుటుంబ వివరాలను ప్రభుత్వ అధికారిక వెబ్‌పోర్టల్ ద్వారా స్వయంగా నమోదు చేసుకోవచ్చని, మొబైల్ ఫోన్, కంప్యూటర్ లేదా ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న ఏ పరికరం ద్వారానైనా ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చని తెలిపారు.

## టైక్వాండో రంగు బెల్ట్ ప్రమోషన్ పరీక్ష విజయవంతం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పరీక్షలో పాల్గొన్న ప్రతి విద్యార్థిని అధికారులు అభినందిస్తూ, క్రమశిక్షణతో సాధన కొనసాగించి మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని 12వ బెటాలియన్ కమాండెంట్ కె. వీరయ్య ఆకాంక్షించారు. స్థానిక 12వ బెటాలియన్‌లో సోమవారం నిర్వహించిన టైక్వాండో రంగు బెల్ట్ ప్రమోషన్ పరీక్ష విజయవంతంగా జరిగింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయని అన్నారు. కష్టపడి సాధన చేస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు ఉన్నాయ ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ కె.నాగేశ్వర్ రావు, ఎన్.వెంకన్న, కె. మహేందర్, వి. సేవాలాల్, ఓసీ హెచ్‌క్యూ వి. చి. కోటయ్య, ఆర్ఎస్ఐ కె. వినోద్, ఆర్ఎస్ఐ (జేఏ) టి.బుచ్చిరాములు పాల్గొన్నారు. పరీక్షకు జాతీయ రిఫరీ, బ్లాక్ బెల్ట్ 4వ డాన్ మాస్టర్ ఎం.డి. యూనుస్ కమాల్ ముఖ్య పరీక్షాధికారిగా వ్యవహరించారు. కోచ్‌గా ఎం. శుశాంత్ సేవలందించగా, ఎం.డి. నసీరుద్దీన్, రణధీర్,లోకేష్ పరీక్షాధికారులుగా బాధ్యతలు నిర్వహించారు.



## కుటుంబ కలహాలతో భార్యను కత్తితో పొడిచి హత్య చేసిన భర్త



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణ ప్రధాన రహదారిపై బస్టాండ్ ఎదుట ప్రజలందరూ చూస్తుండగానే భార్యను భర్త కత్తితో పోడిచి హత్య చేసిన దారుణ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిలుకూరు మండలం బాబునగర్‌కు చెందిన పాయిలి మణిదీప్ తన భార్య శిరిష (24) తో కొంతకాలంగా కుటుంబ కలహాల కారణంగా విభేదాలు కొనసాగుతున్నాయి. బుధవారం కోదాడ బస్టాండ్ సమీపంలో భార్యభర్తల మధ్య మరోసారి వాగ్వివాదం చోటు చేసుకోగా, అవేశానికి గురైన మణిదీప్ శిరిషను బయటకు లాగి కత్తితో దాడిచేశాడు. తీవ్రంగా గాయపడిన శిరిషను స్థానికులు వెంటనే కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. మృతురాలు శిరీష స్వస్థలం ఖమ్మం జిల్లా నెలకొండపల్లి మండలం ప్రేమించి ఆరు సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్న ఈ దంపతులకు సిద్దువర్మ అనే నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హత్య జరిగిన ప్రదేశాన్ని గురువారం జిల్లా ఎస్‌పి కె.నర్సింహా పరిశీలించి ప్రత్యక్ష సాక్షులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిందితుడిపై పూర్తి స్థాయి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను అదేశించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ క్షణికావేశానికి లోనై నేరాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయన వెంట కోదాడ డిఎస్‌పి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ సిఐ శివశంకర్‌లు ఉన్నారు.



## చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరణ

ప్రజాపక్షం/వెల్దండ : మండల కేంద్రంలోని పిఏసిఎస్ సింగిల్ విండో కార్యాలయంలో గురువారం నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కొన్ని నెలల క్రితం పిఏసిఎస్ సింగిల్ విండో డైరెక్టర్ల పదవీ కాలం ముగియడంతో కమిటీని రద్దు చేసిన విషయం తెలసిందే అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కో.ఆపరేటివ్ అధికారి రాఘునందర్ రావు పాత కమిటీని పునరుద్ధరించారు. ఈ సందర్భంగా పిఏసిఎస్, చైర్మన్‌గా జూపల్లి భాస్కర్ రావు వైస్ చైర్మన్‌గా రాజేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లుగా శేఖర్ ముదిరాజ్, రాఘవేందర్ రెడ్డి, సంతోష్, నిరంజన్, నాగులు నాయక్, గండయ్య, ఎల్లమ్మ తదితరులు బాధ్యతలు చేపట్టారు. కమిటీ సభ్యులు రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## అంబులెన్స్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాపక్షం/మక్తల్ : జిల్లా 108 అంబులెన్స్ ఉచిత సేవలు వినియోగించుకోవాలి డియం , హో డాక్టర్ జయ చంద్రమోహన్ నారాయణపేట్ జిల్లా, ధన్వాడ, మరికల్ మక్తల్ మండల కేంద్రాల్లోని 108 అంబులెన్స్‌లను, ఏంఆర్ఐ సంస్థ అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా అంబులెన్స్ లను చెక్ చేయడం, అంబులెన్స్‌లో పరికరాలు, మందులు, సిబ్బంది అత్యవసర సమయాలలో రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. గర్భిణీ స్త్రీలు, రోడ్డు ప్రమాద బాధితులు, వడదెబ్బ కేసులు, ఏ ఇతర వైద్య సహాయం అవసరం ఉన్న తక్షణమే స్పందించి, వారికి ప్రథమ చికిత్స చేస్తూ, దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాలని, జిల్లా కోఆర్డినేటర్ సునీల్ కుమార్ ధన్వాడ 108 అంబులెన్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

## పిఏసిఎస్ కమిటీ బాధ్యతల స్వీకరణ

ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నెలల క్రితం పిఏసిఎస్ సింగల్ విండో డైరెక్టర్ ల వ్యవస్థ పదవి కాలం గడుపు ముగిసినందున ఆదేశాల మేరకు జిల్లా కోఆపరేటర్ అధికారి రాఘునందన్ రావు పాత కమిటీని పునరుద్ధరణ చేశారు. గురువారం పెద్దకొత్తపల్లి సింగల్ విండో కార్యాలయంలో పిఏసిఎస్ చైర్మన్ గా బి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ గా మెరుగు రాజు , సింగిల్ విండె సొసైటీ అధికారులు సాల్వాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ సీఈవో ఎండి సిరాజ్, డి కృష్ణ కుమార్, ఎండి హసీనా బేగం, రాము పాల్గొన్నారు.

## పద్మయ్య కుటుంబాన్ని పరామర్శించిన కార్పొరేషన్ సభ్యులు

ప్రజాపక్షం/వంగూర్ : మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బత్తుల పద్మయ్య గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు సమాచారం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీయన్ రెడ్డి రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్ చారగొండ వెంకటేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి పద్మయ్య కుమారుడు బాలకృష్ణతో మాట్లాడారు. పరిమర్శించిన వారిలో కల్వకుర్తి మార్కెట్ వ్యవసాయ కమిషన్ వైస్ చైర్మన్ పండిత్ రావు. గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సతీష్ రెడ్డి, వెంకట్ నారాయణ, గ్రామస్తులు ఉన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులకు సన్మానం

ప్రజాపక్షం/జడ్చర్ల : మహబూబ్ నగర్ జిల్లా కోర్టు సముదాయంలో గల బార్ అసోసియేషన్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌రావు, ప్రధాన కార్యదర్శి నరసింహరెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసిన సామాజికవేత్త పోలేపల్లి రఘునందన చారి, శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానం చేశారు. పోలేపల్లి రఘునందన చారి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆనంద్ రావు నేతృత్వంలో అడుగు ఆనంద్ రావు నేతృత్వంలో అడుగు బలహీన వర్గాల ప్రజలకు, దోపిడీ, పీడనకు గురవుతున్న అభాగ్యులకు న్యాయం చేస్తారని ఆశిస్తున్నాము, ఆయన పేదల పక్షపాతి అని, సామాజిక న్యాయ స్ఫూర్తి కివైపు నిలబడ్డ సీనియర్ న్యాయవాది అని సుదీర్ఘ కాలంగా ప్రజాసేవే లక్ష్యంగా న్యాయం వైపు, ధర్మం వైపు నిలబడిన గొప్ప మానవతావాది అని ఆయన సేవలను కొనియాడారు.

## వాల్మీకి బోయలకు అండగా ప్రభుత్వం

వాల్మీకి సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్న నాయుడు

ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : రాష్ట్రంలోని వాల్మీకి బోయలకు సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచిందని కాంగ్రెస్ నాయకుడు, వాల్మీకి సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్న నాయుడు అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో వాల్మీకి బోయ సహకార కార్పొరేషన్ ఏర్పాటు చేసి, చైర్మన్‌గా గట్టు తిమ్మప్ప, వైస్ చైర్మన్‌గా బోయ నగేష్‌లను నియమించి ప్రభుత్వం వాల్మీకి బోయలపై ఉన్న చిత్తశుద్ధి చాటుతుందని దేవన్న నాయుడు హర్షం వ్యక్తం చేస్తూ సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి అదే స్ఫూర్తితో వాల్మీకి బోయలను కూడా తిరిగి ఎస్టీ జాబితాలో పునరుద్ధరించాలని ఆయన కోరారు. వాల్మీకి బోయ సామాజిక వర్గానికి ఆర్థిక సామాజిక అభివృద్ధికి సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందని దేవన్న నాయుడు ఆశాభవం వ్యక్తం చేశారు.

## పెంటకుప్పలతో ఇబ్బందులు

ఎమ్మార్వో, ఎంపిడిఒలకు గ్రామస్థుల వినతి

ప్రజాపక్షం/వీపనగండ్ల: వీపనగండ్ల మండలంలోని పుల్గర్ చర్ల గ్రామంలో రోడ్డు పక్కన పెంటకుప్పల కారణంగా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని ప్రధాన రహదారులు, కాలనీల మధ్య ప్రాంతాలు, స్మశాన వాటికలను సైతం కొందరు వ్యక్తులు పెంట నిల్వ కేంద్రాలుగా మార్చేస్తున్నారని ఆరోపిస్తూ గురువారం ఎమ్మెర్వో, ఎంపిడిఒలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్టీఐ మండల అధ్యక్షుడు మల్లెపూల గోపాల కృష్ణ, 9వ వార్డు సభ్యుడు కలమూరు మల్లేష్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన రహదారులపై పెద్ద ఎత్తున పెంట నిల్వ చేయడం వల్ల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. శ్మశానవాటికలను కూడా ఆక్రమించి పెంట కుప్పలు ఏర్పాటు చేయడం దారుణమని విమర్శించారు. గ్రామంలో ఎక్కడ చూసినా పెంట కుప్పలే కనిపిస్తున్నాయని, వాటి నుంచి వ్యాపిస్తున్న దుర్వాసనలతో పాటు ఈగలు, దోమలు అధికమైన ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని తెలిపారు. పెంట కుప్పల కారణంగా గ్రామంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సస్య పై పల్లుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారన్నారు. అక్రమంగా రహదారులు, శ్మశానవాటికలను ఆక్రమించి పెంట నిల్వ చేస్తున్న వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# జడ్చర్లను రెవెన్యూ డివిజన్ కేంద్రం చేయాలి

రెవెన్యూ మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి వినతి



ప్రజాపక్షం/జడ్చర్ల : జడ్చర్లను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా చేయాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. అదేవిధంగా రాజాపూర్, ఊర్కొండ మండలాలలో తహసీల్దార్ కార్యాలయాలకు భవనాలు నిర్మించాలని, జడ్చర్లలో సబ్ రిజిస్టర్ కార్యాలయానికి కూడా భవనాన్ని నిర్మించాలని, దీంతో పాటుగా కావేరమ్మ పేటలో మహిళా సంఘాలు పెట్రోల్ పంపు నిర్వహించుకోవాలని 2000 గజాల స్థలాన్ని కేటాయించాలని కూడా కోరారు.
హైదరాబాదులో గురువారం జరిగిన సమావేశంలో అనిరుధ్‌రెడ్డి ఈ మేరకు వినతి పత్రాలను రెడెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డికి సమర్పించారు. జడ్చర్ల ప్రజలు చిరకాలంగా రెవెన్యూ డివిజన్ కేంద్రంగా కావాలని కోరుతున్నారని, ఇదివరకే పలుమార్లు ప్రభుత్వానికి ముఖ్యమంత్రికి వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని, రెవెన్యూ డివిజన్ కేంద్రంగా చేయడానికి జడ్చర్లకు అన్ని అర్హతలు ఉన్నాయని ఈ సందర్భంగా అనిరుద్ రెడ్డి పేర్కొన్నారు. జడ్చర్ల కేంద్రంలో సబ్ రిజిస్టర్ కార్యాలయానికి భవనాన్ని నిర్మించాలని కూడా కోరారు.
ఊర్కొండ, రాజాపూర్ మండలాల్లో తహసిల్దార్ కార్యాలయాలకు భవనాలను నిర్మించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీంతో పాటుగా జడ్చర్ల పట్టణంలోని కావేరమ్మ పేటలో సర్వే నెంబర్ 434లో గత 2000 గజాల స్థలాన్ని స్వయం సహాయక మహిళా సంఘాలకు కేటాయించాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు. అనిరుద్ రెడ్డి చేసిన విజ్ఞప్తి పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ విషయంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశిస్తానని హామీ ఇచ్చారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

ప్రజాపక్షం/చిన్నంబావి : రైతులు ఆరుగలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జరపాలని బెక్కం, వెలగొండ గ్రామ సర్పంచ్లు కోరారు. గురువారం నాడు మండలంలోని బేక్కం, వెల్లగొండ గ్రామాల్లో మహిళా సమైక్య, ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోనకుండా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యత ప్రమాదాలు ఉన్న వడ్లను తక్షణమే కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గన్ని సంచులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడడంతో పాటు, లారీల కొరత లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అలాగే డేటా ఎంట్రీ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించి రైతులకు ఆలస్యం కాకుండా చూడాలని ఆదేశించారు. వరి కొనుగోలు కేంద్రం నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా కచ్చితమైన విధానాలను పాటిస్తూ రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కమలబాయ్, శరత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందడి చిదంబు రెడ్డి, కురుమూర్తి, రామస్వామి, ఉమేష్ నాయుడు, రాజు రెడ్డి, ఈ ఐకేపి సిబ్బంది బాలకృష్ణ, మహిళా సంఘం అధ్యక్షురాలు, ప్రశాంతి, గ్రామ ఉప సర్పంచ్, రజిత మాజీ, పిటిసి మహాదేవ్ గౌడ్, ఐకేపీ సమైక్య గ్రామ కమిటీ సభ్యులు, హమాలీ నాయకులు, గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

## జనాభా లెక్కల స్వీయ గణనకు సహకరించండి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ : జనాభా గణన 2027 కు సంబంధించి మొదట ఇండ్ల గణన చేపడుతున్న నేపథ్యంలో ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వీయ గణనకు అవకాశం కల్పించినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వీయ గణనలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్యుమరేటర్ల అవసరం లేకుండానే ప్రజలే తమ వివరాలను సొంతంగా సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేసుకునే సౌకర్యం అందుబాటులో ఉన్నందున ఈ అవకాశాన్ని వినియోగించుకుని సులభంగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. ఇందుకుగాను మొదట https//se.census.gov.in లింకును ఓపెన్ చేసి సెల్ఫ్ ఎన్యుమరేషన్ (హెచ్ఎల్ఓ) లాగిన్ వద్ద తెలంగాణ ఎంపిక చేసి, క్యాప్స ఎంటర్ చేసి వేరిపై ప్రొసీడ్ క్లిక్ చేయాలన్నారు. వెల్కమ్ పేజీలో కుటుంబ పెద్దపేరు, మొబైల్ నెంబర్ నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నెంబర్ ఉపయోగించాలని వచ్చిన ఓటిపి ఎంటర్ చేసి వెరిఫై , ప్రోసిడ్ క్లిక్ చేయాలన్నారు. తరువాత వాళ్లకు నచ్చిన భాషను ఎంచుకోవచ్చన్నారు. వారి జిల్లా, పట్టణం, గ్రామం, పిన్‌కోడ్ వివరాలు నమోదు చేయాలని సూచించారు. తర్వాత తమ మొబైల్‌లో లోకేషన్ ఆన్ చేసి, వారి ఇంటి వద్ద రెడ్ మార్క్ సెట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇళ్ల వివరాలకు సంబందించిన 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి, ప్రివ్యూ ద్వారా చెక్ చేసి సబ్మిట్ చేయాలన్నారు. అనంతరం హెచ్‌తో ప్రారంభమయ్యే 11 అంకెల ఎస్ఈఐడి వస్తుందని చెప్పారు. దాన్ని స్క్రీన్‌షాట్ లేదా నోట్ చేసుకుని భద్రపరచాలన్నారు.

## 'పి.ఎం.కుసుమ్, పి.ఎం సూర్యఘర్'తో సౌర విద్యుత్ ఉత్పత్తి

'ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక' రైతు వారోత్సవంలో భాగంగా మిడ్జిల్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖల అవగాహన సమావేశం నిర్వహణ





ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం మిడ్జిల్ మండలం రైతు వేదికలో విద్యుత్, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్.పి.డి.సి.ఎల్. ఎస్.ఇ భీమా నాయక్ మాట్లాడుతూ పి.ఎం. కుసుమ్ ఏ పథకంలో భాగంగా రాష్ట్రంలో వ్యవసాయ, బంజర భూముల్లో సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేసి, ఈ సౌర విద్యుత్ ప్లేట్‌ల ద్వారా విద్యుత్‌ను రైతులు ఉత్పత్తి చేసి విక్రయించుకోవచ్చని తెలిపారు. పి.ఎం. కుసుమ్ ఏ పథకంలో 33/11 కిలో వాట్ సబ్ స్టేషన్ రైతు అమర్చుకున్న పాయింట్ కి 5 కిలోమీటర్ల దూరంలో ఉండాలని, అదేవిధంగా 0.5 నుంచి 2.0 మెగా వాట్ సౌర విద్యుత్ ప్లాంట్ 25 సంవత్సరాల లీజుగా కూడా ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. దీని ద్వారా బొగ్గు డీజిల్, కాలుష్యం తగ్గి పర్యావరణ సమతుల్యతకు దోహదం చేస్తుందని అన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద రైతులకు ఇంటి పై కప్పు మీద సోలార్ విద్యుత్ ప్లేట్ అమర్చి విద్యుత్‌ను జనరేట్ చేసి ఒక యూనిట్‌కి రూ.3.14పైసలు చొప్పున తెలంగాణ విద్యుత్ శాఖ వారికి అమ్ముకోవచ్చు. ఈ పథకం ద్వారా రైతు నేరుగా పిఎం సూర్యఘర్ యోజన వెబ్సైట్ ద్వారా అప్లై చేసుకుని విద్యుత్ శాఖ వారిని సంప్రదించాలని తెలిపారు. దీనికి గాను ప్రభుత్వం 80% వరకు సబ్సిడీ వస్తుంది. ఎస్సీ, ఎస్టీ వారికి 100% సబ్సిడీ ఇవ్వబడుతుంది. ఈ పథకం ద్వారా గృహజ్యోతి లబ్ధిదారులు వారి ఇంటి వినియోగం కోసం కరెంటును ఉపయోగించుకొని మిగతా విద్యుత్తును తెలంగాణ విద్యుత్ శాఖ వారికి అమ్ముకోవడం ద్వారా ఆదాయం లభిస్తుందని ఆయన వివరించారు. మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేష్ మాట్లాడుతూ మే 4 నుండి 9 వరకు రైతు వారోత్సవం నిర్వహిస్తున్నట్లు, ఇందులో భాగంగానే రైతు వేదిక నందు విద్యుత్ శాఖ తరపున ఈ సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. రైతుల ఈ విషయాలు అవగాహన చేసుకుని దరఖాస్తు చేసుకోవటానికి విద్యుత్ శాఖను సంప్రదించాలని వారికి వివరించారు. అదేవిధంగా ఈ సమావేశంలో విద్యుత్ శాఖ డి.ఇ పండరి, మండల విద్యుత్ శాఖ ఎ.ఇ. మండల వ్యవసాయ అధికారి సిద్ధార్థ, ఎంపిడిఓ గీతాంజలి, మిడ్జిల్ సర్పంచ్ శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బంగారి, బైరంపల్లి సర్పంచ్ గోపాల్, చిల్వేర్ సర్పంచ్, పెద్ద గుండ్ల తాండ సర్పంచ్ శంకర్ నాయక్, దోనూరు సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, లింగ తాండ గ్రామ సర్పంచ్ మనిశంకర్, కొత్తపల్లి గ్రామ సర్పంచ్ డోలు మంగమ్మ శ్రీనివాసులు, మసిగుండ్ల గ్రామం సర్పంచ్ శ్రీశైలం యాదవ్, వేముల గ్రామ సర్పంచ్ ఆంజనేయులు తదితర రైతులు పాల్గొన్నారు.

## యశోదమ్మకు టియుడబ్ల్యుజె (ఐజెయు) ఘన నివాళి



ప్రజాపక్షం/వనపర్తి : తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ కార్యదర్శి మధుగౌడ్ తల్లి యశోదమ్మ ఇటీవల మరణించారు. వనపర్తి మండలం కడుకుంట్ల సొంత గ్రామంలో ఏర్పాటు చేసిన యశోదమ్మ దశదిన కార్యక్రమానికి తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజెయు) రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, రాష్ట్ర కార్యదర్శి రామ్ నారాయణలు పాల్గొని నివాళులర్పించారు.

అనంతరం కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పిస్తూ, మధుగౌడ్ కుటుంబానికి యూనియన్ ఎల్లవేళలా అండగా ఉంటుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డి.మాధవరావు, కార్యదర్శి బి.రాజు, జాతీయ కౌన్సిల్ సభ్యులు మల్యాల బాలస్వామి, కొంతం ప్రశాంత, రాష్ట్ర అవుట్‌సైడ్ కోకన్వీనర్ శ్రీనివాసరావు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు గడ్డబిది బాల్‌రాజ్, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్, కార్యదర్శి సురేష్, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి, మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు కాటన్ నాగరాజుగౌడ్, కార్యదర్శి సతీష్‌రెడ్డి, యూనియన్ జిల్లా నాయకులు కొల్లాపూర్ రాజు, శ్రీధర్, మన్యం, నాగేంద్ర చారి తిరుపతయ్య, సాగర్, నటరాజ్, కృష్ణయ్య, పెబ్బేరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బాలవర్ధన్, నాయకులు రాజేంద్రప్రసాద్, రమేష్, ప్రకాష్, తైలం అరుణ్ కుమార్, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి సిల్మార్తి ఆంజనేయులు, ఎస్విరమేష్, చిన్నంబాయి భాను ప్రకాష్, అశోక్, శ్రీరంగాపురం వేణు, నరేష్, తదితరులు నివాళులార్పించారు.

## మత్స్యకారుల సంక్షేమం, మత్స్య అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన

ప్రజాపక్షం/నారాయణపేట : నారాయణపేట జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో మత్స్యకారుల సంక్షేమం, మత్స్య అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించుటకు ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించబడుతున్నదని జిల్లా మత్స్యశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈనెల 8 ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు సింగారం చౌరస్తాలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లో నిర్వహించబడుతుందని, మత్స్య సహకార సంఘాల ప్రతినిధులు, మత్స్యకారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా కోరారు.

## రూ.8వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మే 10న జనాగ్రహ సభకు ముఖ్యఅతిథిగా రానున్న ప్రధాని నరేంద్ర మోదీ

బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యుడు అమర్‌దీక్షిత్, మండల అధ్యక్షుడు నల్లె నర్సప్ప

ప్రజాపక్షం/కృష్ణ : హైదరాబాదులోని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మే 10న నిర్వహించే జనాగ్రహ సభను విజయవంతం చేయాలని జాతీయ కౌన్సిల్ సభ్యుడు అమరదీక్షిత్, మండల బిజెపి అధ్యక్షుడు నల్లె నర్సప్ప కృష్ణ మండల పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాగ్రహ సభకు ముఖ్యఅతిథిగా వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రంలో దాదాపు 8వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనుల శంకుస్థాపన చేయనున్నారని ఆయన తెలిపారు. మహబూబ్‌నగ్ పార్లమెంట్ లోనే దాదాపుగా 300 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేయనున్నారని, ముఖ్యంగా కృష్ణ మండలంలోని గుడేబల్లూర్ నుండి మహబూబ్‌నగర్ వరకు నాలుగు లైన్ల జాతీయ రహదారి పనుల ప్రారంభోత్సవం, కృష్ణ మీదుగా వెళ్లే వాడి నుండి గుంతకల్లు వరకు వెళ్లే నాలుగు రైల్వే లైన్ల అభివృద్ధి పనుల శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల మాజీ అధ్యక్షుడు జెగ్గిలి ఉసెనప్ప, మండల ఉపాధ్యక్షుడు డికె.కిష్టప్ప, మల్లారెడ్డి గౌడ ప్రధాన కార్యదర్శులు నారాయణ లాల్, డి.రాఘవేంద్ర, సీనియర్ నాయకులు నవీన్ బాట్, శంకరయ్య శెట్టి, మండల నాయకులు సలూ గౌడ్, మల్లేష్, అలిగేరి శివాజీ, నక్క తాయప్ప, గౌరి శంకర్ పాల్గొన్నారు.

# మహిళలకు వరంగా... ఆర్టీసీ సిబ్బందికి అగ్నిపరీక్ష 'మహాలక్ష్మి'

ఆర్టీసీ కార్మికులపై పనిభారం సవాల్ గద్వాల డిపోలో గడియారం దాటుతున్న డ్యూటీలు





ప్రజాపక్షం/గద్వాల : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళల పాలిట వరంగా మారినప్పటికీ, క్షేత్రస్థాయిలో దీనిని అమలు చేస్తున్న ఆర్టీసీ సిబ్బందికి మాత్రం అగ్నిపరీక్షగా మారింది. గద్వాల జిల్లా కేంద్రం నుంచి నలుమూలలకు వెళ్లే బస్సుల్లో ప్రయాణికుల రద్దీ అంచనాలకు మించి పెరుగుతుండటంతో, వ్యవస్థ మొత్తం ఒత్తిడికి గురవుతోంది. పెరిగిన రద్దీకి తగ్గట్టుగా బస్సులు లేకపోవడం, ఉన్న సిబ్బందిపైన పనిభారం మోపడం ఇప్పుడు పెను వివాదానికి దారితీస్తోంది.

**సామర్థ్యం 50 ప్రయాణికులు 100 :**
బస్సుల్లో నరకప్రాయం గద్వాల ఆర్టీసి డిపోలో ప్రస్తుతం 103 బస్సులు ఉండగా, అందులో 56 ఆర్టీసీ సొంతవి, 47 అద్దె బస్సులు, ఈ కొద్దిపాటి వాహనాలతోనే వేలాది మంది ప్రయాణికులను చేరవేయాల్సి వస్తోంది. నాడు నేడు గతంలో పల్లె వెలుగు బస్సుల్లో 10 నుండి 20 మంది మాత్రమే నిలబడి ప్రయాణించేవారు. కానీ ఇప్పుడు ఒక్కో బస్సులో 80 నుంచి 100 మంది ప్రయాణికులు

**తిప్పలు :** బస్సుల కొరత వల్ల వృద్ధులు, గర్భిణులు, పసిపిల్లలతో ఉన్న తల్లులు బస్సు ఎక్కేందుకు యుద్ధం చేయాల్సి వస్తోంది. సీట్ల కోసం ప్రయాణికుల మధ్య గొడవలు నిత్యకృత్యమయ్యాయి. డ్రైవర్లు, కండక్టర్ల కడగండ్లు (కేఎంపీఎల్) వేధింపులు సిబ్బంది ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య పని గంటలు. గతంలో 8 గంటల షిఫ్ట్ ఉండేది. కానీ ఇప్పుడు అది అపరిమితంగా మారుతోంది.

**సుదూర ప్రయాణాలు :**
హైదరాబాద్, తిరుపతి, శ్రీశైలం కర్నూలు వంటి ప్రాంతాలకు వెళ్లే డ్రైవర్లు సుమారు 350 నుండి 400 కిలోమీటర్లు బస్సు నడపాల్సి వస్తోంది. అలసట వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. టార్గెట్ల ఒత్తిడి బస్సు నిండా జనం ఉన్నప్పుడు డీజిల్ యావరేజ్ రావడం అసాధ్యం. అయినప్పటికీ, డీజిల్ తక్కువ వచ్చిందని డ్రైవర్లను అధికారులు కౌన్సిలింగ్‌కు పిలిచి వేధిస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు.

**జీరో టికెట్ కష్టాలు :**
ఉచిత ప్రయాణం కదా అని కండక్టర్లకు పని తగ్గిందని అనుకుంటే పొరపాటే. ప్రతి ఒక్క మహిళా ప్రయాణికురాలికి జీరో టికెట్ ఇవ్వాలి. రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు టికెట్లు జారీ చేయడం అలస్యమైతే, అధికారులు తనిఖీల్లో క్యాష్ అండ్ టికెట్ తేడాలు వస్తున్నాయని మెమోలు ఇస్తున్నారు. యూనియన్లు లేక ఎవరికి చెప్పుకోవాలో తెలియని స్థితి ప్రస్తుతం. ఆర్టీసీలో కార్మిక యూనియన్లు క్రియాశీలకంగా లేకపోవడం సిబ్బందికి పెద్ద మైనర్‌గా మారింది. మున్ముందు కార్యాచరణ : ఇప్పటికే జిల్లాకు మరిన్ని కొత్త బస్సులకు కేటాయించాలని నివేదికలు పంపినట్లు తెలిపారు. అలాగే కార్మికుల సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్టీసీని బ్రతికించుకోవాలనే లక్ష్యం బాగున్నా, అది కార్మికుల ఆరోగ్యం, భద్రతను పణంగా పెట్టి సాగకూడదు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కొత్త బస్సు సర్వీసులను పెంచడంతో పాటు, డ్రైవర్లు, కండక్టర్లు పనివేళలను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## సిఎంగారూ... ఫీజు బకాయిలు చెల్లించండి

బిసి జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్

ప్రజాపక్షం/నారాయణపేట్ : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ ఓట్ల కోసం బిసిల వెంటపడ్డ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని మోసం చేశారని, ఫీజ్ బకాయిలు కూడా సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల బిసి విద్యార్థులు విద్యకు దూరం అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. మడివాలా కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు 10 లక్షల నగదు ఇవ్వాలి, పక్కా ఇల్లు కట్టించాలి, 3 ఎకరాల భూమి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. నెలకు 25వేల పెన్షన్ ఇవ్వాలని, బేడా బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సల్ల వెంకటేష్ మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకోవాలని, గురుకుల పాఠశాలలకు సొంత ఇండ్లకు కట్టించాలని కోరారు. సంచార కులాల ప్రజలకు స్థిర నివాసం కల్పించి, ఉపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మడివాల కృష్ణ, చల్ల వెంకటయ్య మహేష్, సునీల్ యాదవ్ పాల్గొన్నారు.

## పెరిగిన గ్యాస్ ధరలతో భారం

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి :** గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై భారం మోపుతున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.ప్రభులింగం అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెంచుతున్న గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా సిపిఐ శంకర్‌పల్లి మండల సమితి నాయకులు సుదీర్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రభులింగం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు లాభాలు కట్టపెట్టడం కోసమే ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపుతోందని తీవ్రంగా విమర్శించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు బుచ్చయ్య. రాజు. మల్లేష్, బాబు. పి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమాలు జరగకుండా చర్యలు

### సిఐ నందీశ్వర్‌రెడ్డి, రైతులతో ప్రత్యేక సమావేశం



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని మొండి గౌరెల్లి గ్రామంలో అక్రమాలు జరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని యాచారం సిఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం గ్రామంలోని రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్బంగా సిఐ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు పంతాలకు పోకుండా అర్హులైన రైతులందరికి న్యాయం జరిగే విధంగా సర్వే నిర్వహించాలన్నారు. రైతులు తమకు ఉన్న భూమి పేపర్లు చూపించి అధికారులు పేపర్స్ ఇవ్వాలన్నారు. గ్రామంలో కొంతమంది దొంగ పట్టాలు తీసుకున్నారన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అర్ఐ రామకృష్ణ, గ్రామ సర్పంచ్ కోలన్ రమాదేవి మాల్లారెడ్డి, ఉప సర్పంచ్ బడే కుమార్, ఎస్ఐ మధుకుమార్, జిపిఒ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలేవీ?




**ప్రజాపక్షం/యాచారం :** ధాన్యం కొనుగోలు కేంద్రంలో కనీస సౌకర్యాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని సిపిఐఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య విమర్శించారు. గురువారం చింతపట్ల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పార్టీ బృందం సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిపిఐయం మండల కార్యదర్శి ఎ.నర్సింహ్మా, జిల్లా కార్యవర్గ సభ్యులు పి. అంజయ్య, ఆలంపల్లి జంగయ్య, చందునాయక్ , బాలరాజు. తావునాయక్, పి.వెంకటయ్య, ఉడుతల జంగయ్య, కావలి జగన్, కంబాలపల్లి జంగయ్య. వి.భూషణ్, సత్యం, గిరికాంత్, భాస్కర్, గణేశ్, బాషయ్య, యాదగిరి, అంజయ్య, ఐలయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్ ఆఫీస్‌లో షార్ట్ సర్క్యూట్




**ప్రజాపక్షం/కొత్తూరు :** మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ రావడంతో మంటలు ఏర్పడ్డాయి. గురువారం సాయంత్రం కొత్తూరు పాత మున్సిపల్ కార్యాలయంలోని కమీషనర్ ఛాంబర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అప్పటికే కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులు ఓటర్ల జాబితాతోపాటు మ్యాపింగ్ చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. మంటలతోపాటు దట్టమైన పొగలు కమ్ముకోవడంతో భయాందోళనకు గురైన ఉద్యోగులు ఉరుకులు పరుగులు పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న కొత్తూరు సిఐ నర్సయ్య తమ సిబ్బందితో హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దాంతో ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు సకాలంలో రావడంతోనే ప్రమాదం తప్పిందని ఉద్యోగులు పేర్కొన్నారు. విద్యుత్ అధికారులు సైతం సకాలంలో స్పందించి విద్యుత్ సరఫరాను ఎక్కడికక్కడే నిలిపివేశారు.

## అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని వెల్‌జర్ల సర్పంచ్ రాత్లవత్ బాబునాయక్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని వెల్‌జర్ల గ్రామంలో ఇందిరమ్మ పథకం ద్వారా నిర్మించుకున్న మంగళి గౌతమికి నూతన వస్త్రాలు అంధించి ఇందిరమ్మ ఇంటిని లబ్దిదారులతో కలిసి సర్పంచ్ ఆర్.బాబునాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆర్.బాబునాయక్ మాట్లాడుతూ పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదయ్య, ఇందిరమ్మ కమిటి సభ్యులు జాంగారి రవి, కటికెల మంగమ్మ, తిరుపతి యాదవ్, పాత్లావత్ సుజాత, రఘునాయక్, ఉప సర్పంచ్ దొడల వెంకటేష్ యాదవ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గడువులోగా నిర్దేశించిన లక్ష్యాల పూర్తి

### మల్కాజిగిరి కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై కమిషనర్ వినయ్ కృష్ణా డ్డి సమీక్ష నిర్వహించారు. పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ వంటి కీలక విభాగాల పనితీరును పరిశీలిస్తూ ప్రజలకు క్షేత్రస్థాయిలో మార్పు కనిపించేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

### ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులపై సమీక్ష

ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల వల్ల ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి ) కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. తార్నాకలోని ప్రధాన కార్యాలయంలో గురువారం వివిధ శాఖలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్మాణ పనుల వేగం పెంచాలని, ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటు, ట్రాఫిక్ మళ్లింపుల వద్ద స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్మాణ సంస్థ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల అమలులో అన్ని శాఖల మధ్య సమన్వయం సమర్థవంతంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ట్రాఫిక్, జలమండలి, విద్యుత్, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పార్కుల్లో కంపోస్ట్ గుంతల ఏర్పాటు

### పర్యావరణ పరిరక్షణకు జిహెచ్‌ఎంసి చర్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** '99 రోజుల పిపిపిపి' ప్రణాళికలో భాగంగా కావడిగూడ, మెట్టుగడ్డ సర్కిళ్లలోని ఇందిరా పార్క్, కొండారెడ్డి కాలనీ పార్కుల్లో కంపోస్ట్ గుంతలను ప్రారంభించారు. తడి వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మార్చడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని అధికారులు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. వ్యర్థాల భారాన్ని తగ్గించి, నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మంగతాయారు, యుబిడి అధికారులు, పారిశుద్ధ్యసిబ్బంది పాల్గొన్నారు.



## మొదటి దశలోనే చెత్తను వేరుచేయాలి

### సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతిరోజు ఒక వార్డు కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన బాచుపల్లి వార్డులోని హిల్కౌంటీ ప్రాంతంలో క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. డెప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సహా ఇతర అధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశమై పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, పౌర సదుపాయాలపై సమీక్షించారు. స్థానికులు గోకరాజు రంగరాజు రోడ్డులో ఆక్రమణలు, శ్మశానవాటిక నిర్వహణ, ట్రాన్స్‌ఫర్ స్టేషన్ సమస్యలు, దోమల బెడద వంటి అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఇళ్ల వద్దే చెత్త వర్గీకరణ, ఎస్‌టిపి పనితీరు, వ్యర్థాల ప్రాసెసింగ్ విధానాలను పరిశీలించారు. కొత్త ఎస్‌డబ్ల్యూఎం మార్గదర్శకాలు2026 ప్రకారం మూలం వద్దే చెత్త వర్గీకరణ తప్పనిసరి అని కమిషనర్ స్పష్టం చేశారు. భారీగా వ్యర్థాలను ఉత్పత్తి చేసే సంస్థల నుంచి వారాంతపు చెత్త సేకరణ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ప్రజలు లేవనెత్తిన సమస్యలను సమన్వయంతో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జనగణన 2027 స్వయం నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని కమిషనర్ సృజన కోరారు.

## 'హైడ్రా'పై పెరుగుతున్న ఆదరణ

### అధ్యయనం చేస్తున్న ముంబై, చెన్నై అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లో చెరువుల పునరుద్ధరణ, ఆక్రమణల తొలగింపునకు హైడ్రా చేస్తున్న కృషికి దేశవ్యాప్తంగా ప్రశంసలు దక్కుతున్నాయని కమిషనర్ ఏ.వి.రంగనాథ్ తెలిపారు. నల్లగొండలో మీడియా ప్రతినిధులతో జరిగిన ఇష్టాగోష్టిలో ఆయన మాట్లాడుతూ కేవలం ఏడాదిన్నర కాలంలోనే 2100 ఎకరాల భూమిని కాపాడటాన్ని కర్ణాటక, చెన్నై బృందాలు ఆశ్చర్యంతో అధ్యయనం చేస్తున్నాయని చెప్పారు. హైడ్రా పరిధి ప్రస్తుతం ఓఆర్ఆర్ వరకే ఉన్నప్పటికీ, ఇతర జిల్లాల నుండి కూడా ఇటువంటి వ్యవస్థ కావాలని డిమాండ్ వస్తోందన్నారు. ప్రజల సానుకూల స్పందన తమ బాధ్యతను మరింత పెంచిందని ఆయన వివరించారు.

## పారిశుద్ధ్య కార్మికులకు చేయూత అభినందనీయం



జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎండలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు చేయూత అందించడం అభినందనీయమని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అన్నారు. నగర పారిశుద్ధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కమిషనర్ కర్ణన్ యూసుఫ్‌గూడ సర్కిల్‌లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా జైప్రకాష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు ఏర్పాటు చేసిన అల్పాహార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తీవ్రమైన ఎండల్లో పనిచేస్తున్న కార్మికులకు అండగా నిలుస్తున్న అసోసియేషన్ సభ్యుల సామాజిక స్పృహను కమిషనర్ ప్రశంసించారు. అనంతరం, స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బిఎం) కింద జరుగుతున్న జనాభా గణనలో నివాసితులందరూ పాల్గొని, తమ అభిప్రాయాలను నమోదు చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎ.సురేష్, డిఇ వి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రైతును ఆర్థికాభివృద్ధి చేయాలన్నదే లక్ష్యం

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రైతులను ఆర్థికాభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగానే అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్‌జర్ల రైతు వేదికలో వ్యవసాయ క్షేత్రాలు, సౌర విద్యుత్‌పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నదాతలు పండించిన పంటలకు పూర్తి స్థాయిలో గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు సబ్సిడిపై ఎరువులు, విత్తనాలు అంధించడం జరుగుతుందని వివరించారు. సబ్సిడిపై యంత్రాలు, పనిముట్లు సైతం ఇస్తున్నామని, అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సౌర విద్యుత్‌పై అన్నదాతలు అవగాహన పెంచుకోవాలని, ప్రతి పంపుసెట్ వద్ద సోలార్ విత్యుత్‌కు సంబంధించిన పరికరాలను అమర్చుకోవాలని సూచించారు. సౌర విద్యుత్‌కు సంబంధించిన పరికరాలను ప్రతి రైతు ఏర్పాటు చేసుకునే విధంగా కృషి చేస్తే బిల్లులు చెల్లించాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిఇ శ్యాంసుందర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ఎడిఏ రమాదేవి, వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్, వెల్‌జర్ల సర్పంచ్ బాబునాయక్, కొండన్నగూడ సర్పంచ్ అనురాధ, రాయికల్ సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్, మెళ్లగూడ సర్పంచ్ మంగ రవినాయక్, వెంకన్నగూడ సర్పంచ్ శకుంతల ఆనంద్, బుచ్చిగూడ సర్పంచ్ జ్యోతిర్మయి అంజి, రాస్మల్లగూడ సర్పంచ్ శివరాములు, ఉప సర్పంచ్ లింగారెడ్డిగూడ అశోక్, దొడల వెంకటేష్ యాదవ్, నర్సింహులుతోపాటు వ్యవసాయ, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



## క్షేత్రస్థాయి నుంచి పార్టీ మరింత పటిష్టం




డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టం చేయాలని టియుఎఫ్ఐడిసి చైర్మన్, డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ల తో కలిసి జిల్లా బిఎల్ఎ, మండల్ కమిటీల నియామకంలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బిఎల్ఎ, మండల కమిటీల నియామకాలపై ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ల సూచనలు అనుసరిస్తూ క్షేత్రస్థాయి నుండి పార్టీని మరింత పటిష్టం చేసేందుకు ప్రతి కార్యకర్తను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జి భీమ్ భరత్, శేర్లింగంపల్లి ఇంచార్జి జగదీష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ కార్మికుడికి లెబర్ కార్డు

**ప్రజాపక్షం/యాచారం :** గ్రామంలో పని చేసుకుంటు జీవనం సాగిస్తున్న ప్రతి కార్మికుడు లెబర్ కార్డులను తప్పని సరిగ్గా తీసుకోవాలని గడ్డమల్లాయగూడా గ్రామసర్పంచ్ అచ్చన మంగ జంగయ్య అన్నారు. గురువారం గ్రామంలో గ్రామ సర్పంచ్ తన డబ్బులతో 204 మంది కార్మికులకు 5 సంవత్సరాల వరకు బీమా చేయించారు. భవన నిర్మాణ కార్మికులకు బీమా చేయించడం సంతోషంగా ఉందన్నారు. గ్రామంలో ఎవరైన లేబర్ కార్డు ఇన్సూరెన్సూ చేయించుకోవాలంటే తనను సంప్రదించాలన్నారు. అర్హులైన పేదలందరికీ ఇన్సూరెన్సూ చేయించే భాద్యత తనదని తెలిపారు. గ్రామస్తులందరు సహకరించాలన్నారు. గ్రామసర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి తోడ్పాటునిస్తూ అపదలో ఉన్న వారికి అండగా ఉంటానని తెలిపారు. గ్రామాభివృద్ధికి పార్టీలకు అతీతంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏడో వార్డు సభ్యుడు బోడ్డు శ్రీశైలం, పదో వార్డు సభ్యుడు దండు శ్రీశైలంతో పాటు గ్రామస్తులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## నూతన సాంకేతిక నైపుణ్యాలతో వ్యవసాయం : ఉష



**ప్రజాపక్షం/షాబాద్:** నూతన సాంకేతిక నైపుణ్యంతో వ్యవసాయం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉష అన్నారు. గురువారం షాబాద్ మండల వ్యవసాయ కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రైతు వారోత్సవాలను నిర్వహించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, సర్దార్‌నగర్ మార్కెట్ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ కంపెనీలకు చెందిన వ్యవసాయ పరికరాల పని తీరు, సౌర విద్యుత్ కేంద్రాలు, యాంత్రీకరణ, డ్రోన్స్ ప్రదర్శన, పీఎం కుసుమ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం మెట్ట వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు కృష్ణ, వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర, విద్యుత్ అధికారి కోటేశ్వర్‌రావు, సర్పంచ్‌లు, నాయకులు మల్లారెడ్డి, నరసింహ్మారెడ్డి, నరేందర్‌రెడ్డి, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు శివతేజ, రాజేశ్వరి, గీత, గాయత్రి, మౌనిక, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

## స్వీయ నమోదు ప్రక్రియలో బాధ్యతగా పాల్గొనాలి

### అదనపు కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జన గణన 2027లో భాగంగా ప్రారంభమయ్యే మొదటి దశ ఇండ్ల జాబితా, ఇండ్ల గణన, స్వీయ నమోదు ప్రక్రియలో జిల్లా ప్రజలు, అధికారులు బాధ్యతగా పాల్గొనాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) కిరణ్మయి కొప్పిశెట్టి అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఇండ్ల గణన, స్వీయ గణన ద్వారా తమ వివరాలను పోర్టల్‌లో అదనపు కలెక్టర్ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యావంతులు, ప్రజలందరూ ఇండ్ల గణన స్వీయ నమోదు చేసుకోవాలని సూచించారు. ఇండ్ల గణన స్వీయ నమోదు కోసం మే 10వ తేదీ వరకు పోర్టల్ అందుబాటులో ఉంటుందన్నారు. https://se.census.gov.in పోర్టల్ ద్వారా ఎవరికి వారు ఇండ్ల గణన స్వీయ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. భారత ప్రభుత్వం జన గణన 2027 ప్రక్రియను రెండు దశలలో చేపడుతోందని తెలిపారు. మొదటి దశలో మే 11 నుండి జూన్ 9వ తేదీ వరకు ఇండ్ల గణన చేస్తారని వివరించారు. రెండవ దశలో 2027 ఫిబ్రవరి 9వ తేదీ నుండి 28 వ తేదీ వరకు జనాభా గణన, కులగణన ఉంటుందన్నారు. ఇందులో భాగంగానే ఏప్రిల్ 26 నుండి ఇండ్ల గణన స్వీయ గణన (సెల్ఫ్ ఏనుమేరేషన్) ప్రారంభం అయినదన్నారు. ఇండ్ల గణన కోసం మీ ఇంటి వద్దకు వచ్చే నమోదు అధికారికి అన్ని వివరాలు తెలియజేయాలని సూచించారు. జన గణన వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. స్వయంగా వివరాలను నమోదు చేసుకునే సెల్ఫ్ ఎన్యుమరేషన్ పోర్టల్ అనేది రాష్ట్రంలో ఇండ్ల గణన ప్రారంభం కావడానికి సరిగ్గా 15 రోజులు ముందు నుంచి ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్వీయ గణనలో భాగంగా పౌరులు సెన్సస్ పోర్టల్‌లో ఉన్న 33 ప్రశ్నలకు వివరాలను స్వయంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. స్వీయ గణన గురించి యువత, విద్యార్థులు అందరికీ అవగాహన కలిగించాలలన్నారు. ఈ డేటా ఆధారంగానే ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు. మొదటిసారిగా ఈ ప్రక్రియ డిజిటల్ రూపంలో జరుగుతోందన్నారు. ఉదయం 6 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు ఎప్పుడైనా వివరాలను నమోదు చేయవచ్చని తెలిపారు. స్వయంగా నమోదు చేయడం వల్ల తప్పులు జరగడానికి ఆస్కారం ఉండదని, సమయం ఆదా అవుతుందని చెప్పారు. నమోదు అనంతరం ఐడి జనరేట్ అవుతుందని, దానిని స్క్రీన్‌షాట్ తీసుకుని భద్రపరచుకోవాలని సూచించారు. ఎన్యూమరేటర్ వచ్చినప్పుడు ఆ ఐడిని చూపిస్తే జనాభా గణన ప్రక్రియ సులభంగా వేగవంతమవుతుందని తెలిపారు.

# ప్రజా తీర్పును స్వీకరిస్తాం


**• కేరళలో విజయం సాధించిన యుడిఎఫ్‌కు అభినందనలు • ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందడానికి, గతంలో కంటే మరింత బలంగా పుంజుకుంటాం : పినరయ్ విజయన్**



**తిరువనంతపురం :** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ ఓటమి చెందడంపై మాజీ ముఖ్యమంత్రి, సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు పినరయి విజయన్ స్పందించారు. ప్రజల తీర్పును తాను స్వీకరిస్తున్నానని, యుడిఎఫ్ విజయం సాధించినందుకు వారికి అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం అనంతరం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రజల తీర్పు ముగింపు కాదని, ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందడానికి, గతంలో కంటే మరింత బలంగా పుంజుకోవడానికి ఇదొక ఆరంభం మాత్రమేనని విజయన్ పేర్కొన్నారు. ఎల్‌డిఎఫ్ ఓటమి అనూహ్యమని, అది తమకు పూర్తి ఆశ్చర్యాన్ని కలిగించిందని ఆ సీనియర్ మార్క్సిస్ట్ నాయకుడు తెలిపారు. ఎల్‌డిఎఫ్ మరింత స్పష్టతతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతుందని, ప్రజలతో తన సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటుందని చెప్పారు. కేరళ భవిష్యత్తు కోసం, ప్రజల సంక్షేమం కోసం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం కోసం సాగించే పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. తాము ఆశించినట్లుగా వరుసగా మూడోసారి విజయం దక్కకపోయినప్పటికీ, ప్రజల్లో గణనీయమైన వర్గం ఎల్‌డిఎఫ్‌కు మద్దతు పలకడం తమకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇస్తోందని ఆయన చెప్పారు. ఇకపై ఎల్‌డిఎఫ్ ఒక బాధ్యతాయుతమైనప్రతిపక్షంగా వ్యవహరిస్తుందని; వామపక్ష ప్రభుత్వం ప్రారంభించిన తీవ్ర పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత, సామాజిక భద్రత వంటి వివిధ సంక్షేమ పథకాలను అమలు చేసేలా కొత్త ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తుందని ఆయన తెలిపారు. నూతన కేరళ నిర్మాణానికి ఎల్‌డిఎఫ్ ముందుకు తెచ్చిన 'జ్ఞాన ఆర్థిక వ్యవస్థ', యువతకు ఉపాధి, సామాజిక న్యాయం, ప్రజారోగ్యం, విద్య వంటి ఆశయాలను, ఒక బలమైన ప్రతిపక్ష పాత్ర ద్వారా సాకారం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఏ మంచి చర్యకైనా ఎల్‌డిఎఫ్ మద్దతు ఇస్తుందని, అయితే ప్రజలకు వ్యతిరేకంగా తీసుకునే ఏ నిర్ణయాన్నైనా మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి మూడు స్థానాలను గెలుచుకోవడాన్ని విజయన్ తీవ్రమైన పరిణామంగా అభివర్ణించారు. లౌకికవాదాన్ని పరిరక్షించాలని కోరుకునే వారికి ఇది ఆందోళన కలిగించే విషయమన్నారు. 'ఏ రూపంలోనూ మతతత్వంతో రాజీపడకుండా, విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా మా పోరాటాన్ని మేము కొనసాగిస్తాము' అని ఆయన దృఢంగా ప్రకటించారు. ఎన్నికల సమయంలో విస్తృతంగా తప్పుడు ప్రచారం జరిగిందని, ఇందులో కొన్ని మీడియా సంస్థల పాత్రపై తీవ్రంగా సమీక్షించాల్సిన అవసరం ఉందని కూడా విజయన్ ఆరోపించారు. అర్ధసత్యాలు, అతిశయోక్తులు, అవాస్తవ ప్రచారాలను ప్రసారం చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని, అయినప్పటికీ ఎల్‌డిఎఫ్ ఈ అనుభవాల నుండి పాఠాలు నేర్చుకుని ముందుకు సాగుతుందని విజయన్ తెలిపారు. ఎన్నికల ఫలితాలపై బహిరంగంగా, ప్రజాస్వామ్యబద్ధంగా సమీక్ష నిర్వహించాలని ఎల్‌డిఎఫ్ సంకల్పించిందని, ఈ క్రమంలో తమ సహచరులందరి అభిప్రాయాలతో పాటు, సామాన్య ప్రజల నుండి వ్యక్తమైన ఆందోళనలు, అభిప్రాయాలు, విమర్శలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని విజయన్ పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతివ్వండి

**వామపక్షాలకు టివికె విజ్ఞప్తి**




**చెన్నై:** తమిళనాడులో టివికె ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ నేత సిటి ఆర్ నిర్మల్ వామపక్షాలకు విజ్ఞప్తి చేసింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎం. వీరపాండియన్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి. షణ్ముగంలను గురువారం కలిసి ప్రభుత్వ ఏర్పాటులో తమ మద్దతును కోరారు. ఈ సందర్భంగా ఆయన అధికారంలో భాగస్వామ్యం ఉండాలని ప్రత్యేకంగా పేర్కొన్నారు. టివికె సంయుక్త ప్రధాన కార్యదర్శి అయిన నిర్మల్ కుమార్ చెన్నైలోని వామపక్ష పార్టీల కార్యాలయాలను స్వయంగా సందర్శించి, తమ పార్టీ తరఫున మద్దతు కోరుతూ రాసిన లేఖలను వారికి అందజేశారు. విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కజగం' (టివికె) పార్టీకి, సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన సాధారణ మెజారిటీ లేదు. పాలనలోనూ, అధికారంలోనూ తప్పక భాగస్వామ్యం ఉండాలని టివికె వ్యవస్థాపకుడు విజయ్ ఇప్పటికే స్పష్టం చేశారని కుమార్ గుర్తుచేశారు. అప్పుడే ఆయా పార్టీలు తమ సిద్ధాంతాలను, విధానాలను అమలు చేయగలవు అని ఆయన పేర్కొంటూ ప్రస్తుతం టివికెపై ఎటువంటి ఒత్తిడి లేదని చెప్పారు. వామపక్ష పార్టీలు, విసికె, ఐయుఎంఎల్‌లకు టివికె ఇప్పటికే తమ అభ్యర్థనను మెయిల్ ద్వారా పంపిందని, అలాగే విజయ్ తరఫున రాసిన లేఖలను లాంఛనంగా అందజేసిందని ఆయన తెలిపారు. టివికె కచ్చితంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. తమ అభ్యర్థనకు స్పందించడానికి ఆయా పార్టీలు కొంత సమయం కోరాయని వీరపాండియన్‌తో సమావేశం ముగించుకుని బయటకు వచ్చిన కుమార్ విలేకరులతో చెప్పారు. టివికె ఎన్‌డిఎ కూటమిని సంప్రదించిందా అని విలేకరులు ప్రశ్నించగా.. తాము వారిని అడగలేదని, అడిగే ఉద్దేశం కూడా తమకు లేదని బదులిచ్చారు. చట్టం ప్రకారం, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అత్యధిక స్థానాలు గెలుచుకున్న ఏకైక అతిపెద్ద పార్టీని గవర్నర్ ఆహ్వానించాల్సి ఉంటుందని కుమార్ తెలిపారు. ప్రజలు టివికెకే ఓటు వేశారు, కాబట్టి గవర్నర్ కచ్చితంగా తమ పార్టీనే ఆహ్వానించాలన్నారు.

**కాంగ్రెస్ పోరుబాట**

విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ ఆలస్యం చేస్తుండటాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ పోరుబాట పట్టబోతోంది. గవర్నర్ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, శుక్రవారం రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టిఎన్‌సిసి) గవర్నర్ నిర్ణయాన్ని నిరసిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రేపు చెన్నైలోని గవర్నర్ అధికారిక నివాసం (లోక్ భవన్)ను ముట్టడించాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చింది. కేవలం చెన్నైలోనే కాకుండా, రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో భారీ ఎత్తున ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రజలు ఇచ్చిన తీర్పును గవర్నర్ కాలరాస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కాంగ్రెస్ ఈ నిరసనలకు శ్రీకారం చుట్టింది.

# 9న బెంగాల్‌లో కొత్త ప్రభుత్వం

**బహుళంచెల భద్రతా వలయం కిందకు బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్**



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో శుక్రవారం కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. తొలి బిజెపి ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా కోల్‌కతా నగర నడిబొడ్డున ఉన్న బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌ను సుమారు 4,000 మంది పోలీసు సిబ్బందితో బహుళ అంచెల భద్రతా వలయం కిందకు తీసుకురానున్నట్లు ఒక సీనియర్ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పలువురు సీనియర్ బిజెపి నాయకులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, జనసమూహ నియంత్రణ, భద్రతను సమర్థవంతంగా నిర్వహించడానికి 900 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ఈ మైదానాన్ని సుమారు 30 సెక్టార్లుగా విభజించినట్లు రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్ దాని పరిసర ప్రాంతాల్లో సుమారు 4,000 మంది పోలీసు సిబ్బందిని మోహరింపజేస్తామని, ఈ 30 సెక్టార్లలో ప్రతి ఒక్కటీ డిప్యూటీ కమిషనర్ లేదా అసిస్టెంట్ కమిషనర్ హోదాలో ఉన్న పోలీసు అధికారి పర్యవేక్షణలో ఉంటుందని ఆయన తెలిపారు. అవసరమైతే కేంద్ర సాయుధ పోలీసు బలగాలను కూడా మోహరించవచ్చని ఆ అధికారి చెప్పారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్న ఈ కార్యక్రమానికి సంబంధించిన భద్రతా ప్రణాళికను ఖరారు చేసేందుకు, కోల్‌కతా పోలీస్ ప్రధాన కార్యాలయమైన లాల్‌బజార్‌లో ఉన్నతాధికారులు బుధవారం ఒక ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రవేశ ద్వారాల వద్ద డోర్‌ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు, హ్యాండ్ హెల్డ్ స్కానర్లను ఏర్పాటు చేయనుండగా, కార్యక్రమ ప్రాంగణం మొత్తాన్ని సిసిటివి కెమెరాలతో పర్యవేక్షించనున్నారు. 'నిషేధిత లేదా ప్రమాదకరమైన వస్తువులను మైదానంలోకి తీసుకురాకుండా ఉండేందుకు తాము విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నామని, సమీపంలోని భవనాల పైకప్పుల నుండి కూడా నిఘా కొనసాగిస్తామని ఆ అధికారి తెలిపారు. రద్దీని నివారించడానికి శనివారం ఆ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణలు, దారి మళ్లింపులు కూడా ఉండే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

# బిహార్‌లో కేబినెట్ విస్తరణ

**• మంత్రులుగా నితీశ్ కుమారుడు నిశాంత్ సహా 32 మంది ప్రమాణం**
**• అత్యధికులు నితీశ్ హయాంలోని వారే...**



**పాట్నా :** బిహార్‌లో మంత్రివర్గాన్ని విస్తరించారు. రాష్ట్రంలో తొలిసారిగా బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పడగా, గురువారం కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించారు. మంత్రివర్గ విస్తరణలో భాగంగా, జెడియు అధినేత నితీష్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ సహా మరో 31 మంది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమిలోని అన్ని భాగస్వామ్య పక్షాల నుండి ఎంపికైన మొత్తం 32 మంది నాయకులతో గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ (విరమణ పొందిన) సయ్యద్ అతా హస్నైన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర ఆరోగ్య మంత్రి జె.పి. నడ్డా, బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కూడా హాజరయ్యారు. కొత్తగా మంత్రివర్గంలో చేరిన ప్రముఖులలో జెడియు అధ్యక్షుడు నితీష్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ ఒకరు. నితీష్ కుమార్ గత నెలలో ముఖ్యమంత్రి పదవి నుండి వైదొలిగి రాజ్యసభకు వెళ్లిన విషయం తెలిసిందే. 243 మంది సభ్యులు కలిగిన అసెంబ్లీలో 89 మంది ఎమ్మెల్యేలతో ఏకైక అతి పెద్ద పార్టీగా ఉన్న బిజెపి నుండి 15 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కొత్తగా మంత్రివర్గంలో చేరిన వారిలో అత్యధికులు, అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి ఘన విజయం సాధించి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత, గత ఏడాది నవంబర్‌లో నితీష్ కుమార్ నేతృత్వంలో ఏర్పడిన మంత్రివర్గంలో ఇప్పటికే పనిచేసిన వారే కావడం విశేషం. జెడియు నుండి మొత్తం 15 మంది మంత్రులకు ప్రాతినిధ్యం లభించగా, వీరిలో 13 మంది గురువారంనాడు గాంధీ మైదాన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్ కుమార్ చౌదరి, బిజేంద్ర ప్రసాద్ యాదవ్, గత ఏప్రిల్‌లోనే సమ్రాట్ చౌదరితో కలిసి ప్రమాణ స్వీకారం చేసి, ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్)కి చెందిన సంజయ్ కుమార్ సింగ్, సంజయ్ కుమార్ పాశ్వాన్ తిరిగి మంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. అలాగే, హిందుస్తానీ అవామ్ మోర్చాకు చెందిన కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ కుమారుడు సంతోష్ కుమార్ సుమన్, రాష్ట్రీయ లోక్ మోర్చాకు చెందిన ఉపేంద్ర కుష్వాహ కుమారుడు దీపక్ ప్రకాష్ కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

# ఢిల్లీకి కేరళ సిఎం ఎంపిక

**ఎమ్మెల్యేల అభిప్రాయాలను సేకరించిన ఎఐసిసి పరిశీలకులు**




**తిరువనంతపురం :** కేరళలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో యుడిఎఫ్ విజయం సాధించింది. అయితే ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ తర్జనభర్జన పడుతోంది. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేల అభిప్రాయాలను సేకరించేందుకు ఎఐసిసి పరిశీలకులు ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్ గురువారం పార్టీ శాసనసభ్యులతో సమావేశాలను పూర్తి చేశారు. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపిక అంశాన్ని పార్టీ అధిష్టానానికి అప్పగించారు. కాంగ్రెస్ శాసనసభ పక్షం (సిఎల్‌పి) సమావేశం అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం అద్భుతమైనదని, చారిత్రాత్మకమైనదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉల్లాసభరితమైన వాతావరణం నెలకొందని వాస్నిక్ పేర్కొన్నారు. ఈ పరిణామం ఎంతో సంతోషించదగ్గ విషయమని, ఈ ఉత్సాహభరిత వాతావరణంలోనే కాంగ్రెస్ శాసనససభ్యులతో సమావేశం జరిగిందని ఆయన చెప్పారు. తదుపరి కేరళ ముఖ్యమంత్రిని నిర్ణయించడం ఎఐసిసి పరిశీలకులకు కష్టమైన పనా లేక సులభమైన పనా అని విలేకరులు ప్రశ్నించగా, వాస్నిక్ దానికి స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. 'మేము మా సహచరులను, పార్టీ ఎమ్మెల్యేలను కలిసేందుకు ఇక్కడికి వచ్చాము. సమావేశం చాలా సాఫీగా జరిగింది. కాంగ్రెస్ శాసనసభ్యులు తీసుకున్న మొదటి నిర్ణయం తదుపరి సిఎల్‌పి నాయకుడిని నిర్ణయించే అధికారాన్ని కాంగ్రెస్ అధ్యక్షులకు అప్పగిసూ ఏకగ్రీవంగా ఒక తీర్మానాన్ని ఆమోదించడమేనని, ఈ తీర్మానాన్ని కెపిసిసి అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ ప్రతిపాదించగా, ప్రస్తుత సిఎల్‌పి నాయకుడు విడి సతీశన్ బలపరిచారు అని ఆయన వివరించారు. సిఎల్‌పి సమావేశంలో ఆ తీర్మానం ఆమోదించబడిందని మాకెన్ తెలిపారు. తరువాత ఏం జరుగుతుందో చూద్దామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 63 స్థానాలను గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి ఎంపికపై తీవ్ర చర్చలు జరుగుతున్న నేపథ్యంలో, ఇక్కడి ఇందిరా భవన్‌లో ఈ సమావేశాన్ని నిర్వహించింది. తీర్మానం ఆమోదం పొందిన వెంటనే, నాయకత్వ సమస్యపై ఎమ్మెల్యేల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఎఐసిసి పరిశీలకులు వారితో వ్యక్తిగత సమావేశాలను ప్రారంభించారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ అంతర్గత సమావేశానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు హాజరయ్యారు. అంతకుముందు రోజు, వాస్నిక్, మాకెన్... విఎం సుధీరన్, కె. సుధాకరన్, రమేష్ చెన్నితాల, విడి సతీశన్‌లతో సహా పలువురు సీనియర్ నాయకులతో చర్చలు జరిపారు. ఈ పరిశీలకులు యుడిఎఫ్ కూటమిలోని మిత్రపక్షాల నాయకులను కూడా కలవనున్నారు. ప్రస్తుతం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు విడి సతీశన్, రమేష్ చెన్నితాల, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ పేర్లను ఈ అత్యున్నత పదవి కోసం పరిశీలిస్తున్నారు.

# ఆపరేషన్ సిందూర్‌తో స్పష్టం

**పాకిస్థాన్‌లోని ఏ ఉగ్రవాద స్థావరమూ సురక్షితం కాదని...**

**లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్**



**జైపూర్ :** పాకిస్థాన్‌లోని ఏ ఉగ్రవాద స్థావరమూ సురక్షిత కాదని ఆపరేషన్ సిందూర్ సంకేతం ఇచ్చిందని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని గురువారం భారత సైన్యం పేర్కొంది. బహుళ రంగ పోరాట ప్రచారం తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భారత సైన్యం ఈ విషయాన్ని స్పష్టం చేసింది. సరిహద్దు ఉగ్రవాదానికి పాకిస్థాన్ ఇస్తున్న మద్దతును శిక్షించడానికి గత అర్ధ శతాబ్దంలో భారతదేశం చేపట్టిన అత్యంత విస్తృతమైన పోరాట మిషన్‌గా అభివర్ణించబడిన ఆపరేషన్‌కు సంబంధించిన వివిధ అంశాలను వివరిస్తూ భారత వైమానిక దళం, భారత సైనికాదళానికి చెందిన సైనిక కార్యకలాపాల సైనికాధిపతులు జైపూర్‌లో నిర్వహించిన ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఆపరేషన్ ఒక ముగింపు కాదని, ఇది ఆరంభం మాత్రమేనని ఆర్మీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డిజిఎంఓ) హోదాలో ఈ ఆపరేషన్ అమలులో కీలకపాత్ర పోషించిన లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ అన్నారు. నియంత్రణ రేఖ పాకిస్థాన్ తో ఉన్న అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉన్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడానికి, ఆపరేషన్ సిందూర్ ద్వారా భారతదేశం తన పాత పద్ధతులను చాలా సునిశితంగా అధిగమించిందని ఘాయ్ తెలిపారు. ఇది మన దేశం సంకల్పం, బాధ్యత, వ్యూహాత్మక సంయమనానికి నిదర్శనమన్నారు. దీనిని కచితత్వంతో, అనుపానంతో, లక్ష్య స్పష్టతతో అమలు చేయడం జరిగిందని, భారత దేశం తన సార్వభౌమత్వాన్ని, భద్రతను, ప్రజలను నిశ్చయంగా వృత్తిపరంగా అత్యంత బాధ్యతతో కాపాడుకుంటుందని రాజీవ్ ఘాయ్ పేర్కొన్నారు. 'మేం ఒక సంక్లిష్టమైన బహుళ–డొమైన్ ఆపరేషన్‌ను చాలా తక్కువ సమయంలో ప్రణాళికను రూపొందించుకుని, అమలు చేసి, ముగించాం' అని చెప్పారు. అప్పటి వైమానిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్ అయిన ఎయిర్ మార్షల్ ఎ.కె.భారతి ఆపరేషన్ సిందూర్, వాయుశక్తి ప్రాధాన్యతను పునరుద్ఘాటించిందని అన్నారు.గత ఏడాది ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాదుల ఉగ్రదాడిలో అధికంగా పర్యాటకులు సహా 26మంది మరణించిన ఘటనకు ప్రతిస్పందనగా భారతదేశం గత సంవత్సరం మే 7న ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై వైమానిక దాడులు నిర్వహించింది. ఈ నేపథ్యంలో ఈ చర్య ఉద్రిక్తతలు వేగంగా పెరగడానికి దారితీసింది. పాకిస్థాన్ ప్రతీకార దాడులకు దిగింది.అయితే భారత సైన్యం ఆ దాడులను చాలా వరకు తిప్పికొట్టింది. ఇరుపక్షాల ఆర్మీ అధికారుల మధ్య హాట్‌లైన్ ద్వారా జరిగిన చర్చల అనంతరం మే 10న సైనిక చర్యలను నిలిపివేసేందుకు ఒక అవగాహన కుదరడంతో ఘర్షణలు ముగిశాయి.

# యమునా నదిలో పడవ బోల్తా

**నలుగురు పిల్లలు సహా ఐదుగురు జలసమాధి, మరో బాలుడు గల్లంతు**



**హమీర్‌పూర్ :** ఉత్తరప్రదేశ్‌లోని యమునా నదిలో ఓ పడవ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురు పిల్లలతో సహా ఐదుగురు జలసమాధి అయ్యారు. అదే విధంగా 11 ఏళ్ల బాలుడు గల్లంతయినట్లు పోలీసులు గురువారం తెలిపారు. కురారా పోలీస్ స్టేషన్ భౌలి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కుతుబ్‌పూర్ పాటియా గ్రామంలో బుధవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుందని వారు పేర్కొన్నారు. పడవ నడిపే వ్యక్తి (నావికుడు) కాకుండా, మొత్తం తొమ్మిది మంది వ్యక్తులు నది మధ్యలో ఉన్న ఒక దీవి నుండి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల వివరాల ప్రకార నది మధ్యలోకి రాగానే పడవ అదుపు తప్పి, రాత్రి 7 గంటల ప్రాంతంలో బోల్తా పడింది. పడవ నడిపే వ్యక్తి ధీరు, విష్ణు, రింకు, పారుల్ అనే ముగ్గురిని రక్షించగలిగాడు. మిగిలిన ఆరుగురిలో ఐదుగురు పిల్లలు, ఒక మహిళ ఆకాంక్ష (9), రాణి (9), బ్రిజ్‌రాణి (25), లభ్యాంశ్ (5), మహేష్ (6), మరియు ఆదిత్య (11) గల్లంతయ్యారని పోలీసులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం తర్వాత, సహాయక బృందాలు ఆకాంక్ష, లభ్యాంశ్, మహేష్, రాణి, బ్రిజ్‌రాణి మృతదేహాలను వెలికితీశాయి. భారీ వర్షాల కారణంగా, సహాయక చర్యలు చేపట్టడంలో తమ బృందాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఎస్‌హెచ్‌ఒ బ్రిజేష్ కుమార్ తెలిపారు. ఆదిత్య అనే బాలుడి ఆచూకీ ఇంకా తెలియదలేదని, అతని ఆచూకీ కనిపెట్టేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఆయన చెప్పారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్) బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నాయని జిల్లా మేజిస్ట్రేట్ అభిషేక్ గోయల్ తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్, ప్రమాదానికి గల కారణాలను విచారించాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. గాలింపు చర్యలను జిల్లాలోని సీనియర్ అధికారులు స్వయంగా పర్యవేక్షించాలని, బాధితుల కుటుంబాలకు సాధ్యమైనంత సహాయం అందేలా చూడాలని కూడా ముఖ్యమంత్రి ఆదేశించారు.

**PUBLIC NOTICE**

The general public hereby informed that **KALALI DATHU S/O. KALALI RAMULU**, aged about 35 years, Occu: Business, R/o. H.No. 5-24-971/1/1A/2, Prakasham panthulu Nagar, Gajularamaram, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, has approached the Shriram Finance Ltd., Marredpally Branch, Hyderabad by put his documents by way of mortgage in respect of Schedule of Property to secure the future Liability towards Loan amount. If any person or person's having any objections. Right, claim, title, interest over the Schedule of Property shall approach the undersigned with support of their claim within seven days, failing which the loan amount shall be sanctioned to **KALALI DATHU S/O. KALALI RAMULU** and no claim or no objection of any kind thereafter will be entertained.

**SCHEDULE OF THE PROPERTY**

All that the House No. 24-971/1/A/2, PTIN No.1261906738, with a plinth area of 600.0 Sft., (RCC), land admeasuring 80.0 Sq.Yds., in Sy.Nos. 224, Situated at Prakasham panthulu Nagar, Gajularamaram, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, and bounded by: **NORTH:** House No.24-971/A/3, **SOUTH :** House No.24-971, **EAST**: 15'Wide Road, **WEST:** House No.24-978.

**R.Venkateshwar Rao.,**
**Advocate & Panal Advocate of**
**Shriram Finance Ltd.,**
**5-3-29, Ramalayam Temple,**
**Kukatpally, Hyderabad-72,**
**Cell:8519985749, 9391093566**

# అసోంలో 12న ఎన్‌డిఎ ప్రభుత్వ ప్రమాణ స్వీకారం

**గువాహటి :** అసోంలో కొత్తగా ఎన్నికైన బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈనెల 12న జరుగుతుందని ప్రధాన కార్యదర్శి రవి కోట తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, పారిశ్రామిక రంగ ప్రతినిధులు హాజరవుతారని భావిస్తున్నారు. ఖానాపారాలోని వెటర్నరీ మైదానంలో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కొత్తగా ఎన్నికైన మంత్రి మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు ప్రధానమంత్రి త్వరలో జరపనున్న పర్యటన ఏర్పాట్ల సంసిద్ధతను సమీక్షించేందుకు గురువారం అసోం డిజిపితో కలిసి ఒక సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించినట్లు కోట బుధవారం రాత్రి ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, వేదిక సంసిద్ధత, ప్రోటోకాల్, వివిధ శాఖల మధ్య సమన్వయానికి సంబంధించిన ఏర్పాట్లపై ఈ సమావేశంలో వివరంగా చర్చించినట్లు ఆయన తెలిపారు. 'కార్యక్రమ నిర్వహణలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూసుకోవడం, నిర్దేశిత ప్రోటోకాల్‌లను కచ్చితంగా పాటించడం, వివరించినట్లు కోట పేర్కొన్నారు.

# బెంగాల్‌లో సువేందు అధికారి పిఎ దారుణ హత్య

**కోల్‌కతా :** బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ మరో సంచలన ఘటన చోటుచేసుకుంది. బిజెపి కీలక నేత, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి వ్యక్తిగత సహాయకుడు చంద్రనాథ్ రత్ దారుణ హత్యకు గురయ్యారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని మధ్యమ్‌గ్రామ్ ప్రాంతంలో బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. ఆ హత్యను బిజెపి టార్గెట్ హత్యగా అభివర్ణిస్తుండగా, తృణమూల్ కాంగ్రెస్ కూడా ఘటనను తీవ్రంగా ఖండించింది. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, చంద్రనాథ్ రత్ బుధవారం రాత్రి కోల్‌కతా నుంచి తన నివాసమైన మధ్యమ్‌గ్రామ్‌కు కారులో బయలుదేరారు. రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో డోల్తాలా సమీపంలో ఆయన ప్రయాణిస్తున్న వాహనాన్ని బైక్‌పై వచ్చిన దుండగులు వెంబడించారు. అనంతరం కారును అడ్డగించి దగ్గర నుంచి కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. కాల్పుల్లో చంద్రనాథ్ రత్ ఛాతీ, పొత్తికడుపు భాగాల్లో బుల్లెట్లు తగిలాయి. తీవ్రంగా గాయపడిన ఆయనను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఆయన గుండెను ఛేదిస్తూ రెండు బుల్లెట్లు వెళ్లినట్లు వైద్యులు వెల్లడించారు. రత్‌తో పాటు ఉన్న డ్రైవర్‌కూ కాల్పుల్లో తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం కోల్‌కతాలోని ఆసుపత్రిలో ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటన అనంతరం పోలీసులు ప్రాంతాన్ని చుట్టుముట్టి దర్యాప్తు ప్రారంభించారు. కాల్పులు జరిగిన వాహనం అద్దాలు బుల్లెట్లతో ధ్వంసమైన దృశ్యాలు టెలివిజన్ ఛానళ్లలో ప్రసారమయ్యాయి. కారులో రక్తపు మరకలు కనిపించడంతో ఘటన తీవ్రత స్పష్టమైంది. దుండగులు ముందుగానే రెక్కీ నిర్వహించి పథకం ప్రకారం ఈ దాడికి పాల్పడ్డారని బిజెపి నేతలు ఆరోపిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే సువేందు అధికారి అర్ధరాత్రి ఆసుపత్రికి చేరుకున్నారు. చంద్రనాథ్ రత్ హత్య తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన అన్నారు. 'ఇది కావాలని చేసిన హత్య. దాడి తీరు చూస్తే ముందుగానే ప్రణాళిక రచించినట్లు స్పష్టంగా తెలుస్తోంది' అని వ్యాఖ్యానించారు.దర్యాప్తు కొనసాగుతున్నందున ఇప్పుడే ఎవరినీ ఆరోపించబోమని తెలిపారు.

**SHRIRAM Finance | వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|
| 1 | TS04UB 1979 | CHEVROLET TAVERA NEO-P | 2016 |
| 2 | AP25AF 2568 | ACE 12XW | 2011 |
| 3 | TS03UC 9482 | MAHINDRA BOLERO CITY PIKUP 1.4T BS6 | 2021 |
| 4 | TS07UD 1099 | TATA SUPER ACE MINT | 2016 |
| 5 | TS03UC 6271 | MAHINDRA BOLLERO CITYPIK-UP | 2020 |
| 6 | TS03UC 5755 | TATA ACE GOLD | 2019 |
| 7 | TG03T 2412 | MARUTHI SUPER CARRY BS6 CNG | 2025 |

**AUCTION DATE 09-05-2026**

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**
H.No :15-1-237, Shop No. 1, 2 & 3, 2nd Floor Warangal City Center, Beside Guarduan Hospital, Opp : L B College, Mulugu Road, Warangal. Cell : 9989313186 , 9700100937

# షిప్‌లో హంటా వైరస్ కలకలం

ముగ్గురు మృతి
మరో ముగ్గురు నెదర్లాండ్స్ తరలింపు



జెనీవా : ఒక క్రూయిజ్ షిప్‌లో హంటా వైరస్ వ్యాపించడంతో నెదర్లాండ్స్‌కు చెందిన ముగ్గురు ప్రయాణికులు మరణించారు. మరో ఇద్దరు ప్రయాణికులను హంటా వైరస్ చికిత్స నిమిత్తం నెదర్లాండ్స్‌కు తరలించారు. మరో వ్యక్తిని గగనతలమార్గంలో తరలిస్తున్నారు. డచ్‌దేశానికి చెందిన ఒక ప్రయాణికుడితోపాటు, జర్మనీకి చెందిన 70 ఏళ్ళు, 69 ఏళ్ళ వయసుగల భార్యభర్తలు ఈ వైరస్ వల్ల క్రూయిజ్ నౌకలో ప్రయాణం చేస్తుండగా మరణించారు. అనేకమంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. నౌక అధికారులు వారిని చికిత్స నిమిత్తం దక్షిణాఫ్రికాలో ఉన్న ఆసుపత్రులకు తరలించారు. వైరస్‌కు గురైన ఆరుగురిలో ముగ్గురు మరణించారు. దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్ ఆసుపత్రిలో 69 ఏళ్ళ వయసుగల ఒక బ్రిటన్ జాతీయుణ్ణి ఐసియులో ఉంచి చికిత్స చేస్తున్నారు. 56 ఏళ్ళ వయసుగల ఒక బ్రిటిష్ జాతీయుడు, మాజీ పోలీసు అధికారి మార్టిన్ ఆన్‌స్టేను కూడా చికిత్స నిమిత్తం నెదర్లాండ్స్‌కు తరలించారు. దక్షిణ అర్జెంటీనాలోని ఉషువాయిలో మార్చి 20న బయలుదేరిన ఎం.వి. హోండియస్ అనే ధ్రువయాత్రా క్రూయిజ్ నౌకను ఈ ఘటన తర్వాత కేప్ వెర్దేలో మూడు రోజులు లంగరువేసి ఉంచిన తర్వాత ఇప్పుడు స్పెయిన్‌లోని కానరీ దీవులపైవు ప్రయాణం ప్రారంభించింది. ఇదిలా ఉండగా, కెఎల్ఎం విమానానికి చెందిన పరిచారిక ఒకామె హంటా వైరస్ లక్షణాలతో ఆసుపత్రి పాలైనట్లు డచ్ మీడియా గురువారం ప్రకటించింది. ఓషన్‌వైడ్ ఎక్స్‌పెడిషన్స్ అనే యాత్రా సంస్థ ఈ క్రూయిజ్ నౌకను నడుపుతోంది. 353 అడుగుల పొడవుగల ఈ క్రూయిజ్ నౌకలో వివిధ దేశాలకు చెందిన 150 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో బ్రిటన్, ఆస్ట్రేలియా, తైవాన్, అమెరికా దేశాలకు చెందిన ప్రయాణికులు 29 మంది నౌకను వదిలి వెళ్ళి పోయారు. ఐతే వారిలో తీవ్ర ఆందోళనలు నెలకొని ఉన్నాయి. అట్లాంటిక్ మహాసముద్రంలో ప్రయాణం చేస్తున్న సమయం లో వైరస్ ప్రబలింది.ప్రయాణికులు తీవ్ర శ్వాసకోశ వ్యాధులకు గురయ్యారు. జ్వరం, తల నొప్పి,కడుపునొప్పి,డయేరియా లక్షణాలతో ఆకస్మికంగా అస్వస్థతకు గురై ఇద్దరు మరణించగా,మరోవ్యక్తి బ్రిటన్ సమీపంలో సెయింట్ హెలీనా వద్ద మరణించారు. ఎలుకల మలం, ఎలుకల లాలాజలం ద్వారా హంటా వైరస్ మానవులకు వ్యాపిస్తుంది. హంటా వైరస్ క్రూయిజ్ నౌకలో ఎలా వ్యాపించిందనే విషయం ఎవరికీ అంతుబట్టలేదు.

ఇంతటి అసాధారణమైన వాతావరణంలో ఈ హంటా వైరస్ ఎలా వ్యాపించిందనే విషయంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) ప్రశ్నార్థక ఆలోచనలు చేస్తోంది. నౌకలో పరిస్థితులు, పరిశుభ్రత విషయంపై డబ్ల్యు.హెచ్.ఓ. ఒక హెచ్చరిక జారీ చేసింది. దీనిపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

## తీస్తానదిపై చైనా జోక్యం కోరిన బంగ్లాదేశ్

బీజింగ్ : భారత్‌–బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఉన్న రెండు దేశాలకు సాగు,తాగునీటిపరంగా కీలకమైన తీస్తానదీ పునరుద్ధరణ ప్రాజెక్టు నిమిత్తం సహాయం చేయాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం చైనా జోక్యాన్ని, భాగస్వామ్యాన్ని కోరింది. చైనా కూడా అందుకు సంసిద్ధత తెలియజేసింది.దీంతో భారత్–బంగ్లాదేశ్ సంబంధాలపై ఈ అంశం పెద్ద ఆటంకంగా మారింది. పొరుగుదేశాల సంబంధాలపై నీలి నీడలు పడ్డాయి. బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాలమంత్రి ఖలీలుర్ రెహ్మాన్, చైనా విదేశీ వ్యవహారాలమంత్రి వాంగ్ యీ మధ్య బుధవారం జరిగిన సమావేశంలో తీస్తానదీ జలాల ప్రాజెక్టుపై చర్చ జరిగింది. బంగ్లాదేశ్‌కు చెందిన సంగ్‌బాద్ సంగ్స్థ (బిఎస్ఎస్) న్యూస్ ఏజెన్సీ ఈ విషయం వెల్లడించింది. తీస్తానది తూర్పు హిమాలయాల నుండి సిక్కిం, పశ్చిమ బెంగాల్ మీదుగా ప్రయాణించి తర్వాత బంగ్లాదేశ్‌లో ప్రవేశిస్తుంది. తీస్తానదీ జలాలు బంగ్లాదేశ్‌లో లక్షలమంది ప్రజలకు జీవనాధారం. వారి సాగునీటి, తాగునీటి అవసరాలు తీరేది ఈ నదీ జలాల ద్వారానే. కొత్తగా బంగ్లాదేశ్‌లో అధికారంలోకి వచ్చిన తారిఖ్ రెహ్మాన్ ప్రభుత్వం ఈ విషయంలో చైనా జోక్యాన్ని, మద్దతును కోరింది. చైనా కూడా ప్రోత్సహించింది. సంసిద్ధత వ్యక్తం చేసింది. అత్యున్నత ప్రమాణాలతో బెల్ట్ అండ్ రోడ్ కో ఆపరేషన్ కార్యక్రమాన్ని జాతీయ అభివృద్ధి వ్యూహం కింద చేపట్టేందుకు సిద్ధపడుతోంది. వాణిజ్య,ఆర్థిక,మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతోపాటు ఇరుదేశాల ప్రజలమధ్య సంబంధాలను వృద్ధి చేసుకునే విషయంపై కూడా చైనా చొరవ చూపించింది. బంగ్లాదేశ్‌తో చైనా వాణిజ్య సంస్థలను ప్రోత్సహించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఖలీలుర్ రెహ్మాన్ చెప్పారు.చైనా అధికారిక ప్రకటన ప్రకారం, బంగ్లాదేశ్‌తో చైనా అభివృద్ధి సంబంధాలు దక్షిణాసియాలో దేశాల మధ్య కొనసాగించేవిధానం, ఈ సంబంధాలవల్ల మరే ఇతర దేశానికి నష్టం కలగదు. చైనాలో బంగ్లాదేశ్ విదేశీమంత్రి మొదటిసారి పర్యటించి వాంగ్ యీ తో సమావేశమై హామీలు పొందారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో బంగ్లాదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. మే ఐదో తేదీన బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాలమంత్రి చైనా వెళ్ళారు.

## ఎప్‌స్టీన్ ఆత్మహత్య వాంగ్మూల లేఖ విడుదల

వాషింగ్టన్ : అమెరికా,యూరప్‌దేశాల్లో పెద్దమనుషుల బాగోతాలను బయటపెట్టిన ఎప్‌స్టీన్ ఫైల్స్ ఉదంతంలో ప్రధాన సూత్రధారి జెఫ్రీఎప్‌స్టీన్ మరణించడానికి ముందుగా రాసిన వాంగ్మూల లేఖను న్యాయమూర్తి విడుదల చేశారు. జెఫ్రీ ఎప్‌స్టీన్ జైలులో అనుమానాస్పదస్థితిలో మరణించారు. ఆయన వాంగ్మూలాన్ని, ఇతర పత్రాలను విడుదల చేయాలని న్యూయార్క్ టైమ్స్ గడచినవారంలో కోరిన తర్వాత అమెరికా వైట్ ప్లెయిన్స్, న్యూయార్క్ డిస్ట్రిక్ట్ జడ్జి కెన్నెత్ కారస్ ఈ మేరకు ఉత్తర్వు జారీ చేశారు.ఈ కేసులో నిందితుడుగా ఉన్న ఎప్‌స్టీన్‌తోపాటు జైలులో ఉన్న నికలస్ టార్టగ్లియోన్ దీనికి అభ్యంతరం చెప్పలేదు. ఫెడరల్ ప్రాసిక్యూటర్లు కూడా ఈ విజ్ఞప్తికి అభ్యంతరం చెప్పలేదు. 2019 జులై 23న ఎప్‌స్టీన్ మన్‌హాట్టన్ ఫెడరల్‌జైలులో నేలమీద పడి మరణించి ఉండగా కనుగొన్నారు. ఆయన మెడచుట్టూ దుప్పటి వేలాడదీసి ఉంది. దీనిని ఆత్మహత్యగా అధికారులు నిర్ధారించారు. ఆయన పుస్తకంలో ఈ వాంగ్మూలాన్ని తాను కనుగొన్నానని టార్టగ్లియోన్ చెప్పారు.

## లండన్ స్థానిక ఎన్నికలు స్టార్‌మర్‌కు అగ్నిపరీక్ష



లండన్ : లండన్‌లో గురువారం జరిగిన స్థానిక ఎన్నికలు బ్రిటన్ ప్రధానమంత్రి, లేబర్ పార్టీ నాయకుడు కీర్ స్టార్‌మర్‌కు అతిపెద్ద అగ్నిపరీక్షగా మారాయి. 2022లో జరిగిన ఈ ఎన్నికల్లో లేబర్‌పార్టీకి 1156 స్థానాలు ఉండగా, ఈసారి 600కు పైగా స్థానాలను లేబర్‌పార్టీ కోల్పోతుందని, భూకంపం వచ్చినవిధంగా అత్యంత దారుణమైన ఓటమి ఫలితాలను స్టార్‌మర్ ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ముందస్తు ఎన్నికల పరిశీలకులు చేసిన హెచ్చరికల నేపథ్యంలో గురువారం ఎన్నికలు జరిగాయి. లేబర్‌పార్టీ, కన్జర్వేటివ్‌లు, లిబరల్ డెమోక్రాట్స్ మధ్య ప్రధానంగా ఈ ఎన్నికల పోటీ జరుగుతోంది. ఎప్‌స్టీన్ ఫైల్స్‌కు సంబంధించి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్న స్టార్‌మర్, పార్లమెంటు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు ఇంతవరకూ నెరవేర్చే ప్రయత్నం చేయలేదు. ఆయనపై తీవ్ర అసంతృప్తి నెలకుంది. పైగా ఆయన అధికారంలోకి రావడానికి పార్లమెంటు ఎన్నికల్లో చాలామంది లేబర్‌పార్టీ ఎంపీలు లండన్ ప్రాంతం నుండే గెలిచారు. ఇప్పుడు ఈ ఎన్నికల్లో స్టార్‌మర్‌పార్టీ ఓటమిని మూటగట్టుకుంటే మరిన్ని సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

## ముగ్గురు యువకుల జలసమాధి

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం జరిగిన ఒక వివాహ వేడుకకు హాజరయ్యారు. అయితే పెళ్లి వేడుక ముగించుకుని తిరుగు ప్రయాణమైన ఈ యువకులు నాచారం హల్దీ వాగు చూసి ఎండ వేడిమి తట్టుకునే క్రమంలో సేదతీరాలని భావించి నీటిలో దిగారు. అయితే నీటి లోతును అంచనా వేయలేక ముగ్గురు యువకులు ఒకరిని ఒకరు కాపాడేందుకు ప్రయత్నించి ప్రవాహంలో చిక్కుకుని గల్లంతయ్యారు. స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు గజ ఈతగాళ్లను రప్పించి వారి సాయంతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో గురువారం ఉదయం ముగ్గురు యువకుల మృతదేహాలను గజ ఈతగాళ్లు వెలికితీశారు. ఒకే ప్రాంతానికి చెందిన, సమాన వయస్సున్న ముగ్గురు స్నేహితులు ఒకేసారి మృతి చెందడంతో తీవ్ర విషాదం నెలకొంది. చేతికి అంది వచ్చిన కొడుకులు విగత జీవులుగా పడి ఉండటాన్ని మృతుల కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతూ కన్నీరు మున్నీరయ్యారు. నర్సాపూర్ ప్రాంతం నుండి పెద్ద ఎత్తున తరలివచ్చిన మృతుల బంధువులు స్నేహితుల రోధనలు మిన్నంటగా, బాధితుల ఫిర్యాదు మేరకు గౌరారం పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. కాగా సంఘటన స్థలాన్ని గజ్వేల్ రూరల్ సిఐ రవిరాజు, గౌరారం ఎస్ఐ జున్ను ఆరోగ్యం అక్కడే ఉండి తగిన చర్యలు చేపట్టారు.

## రైతుల పాలిట శాపం?

(మొదటి పేజీ తరువాయి)

పట్టించుకోవడంలేదు. దీనికి తోడు గత ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాప్‌ల ద్వారా దొడ్డు బియ్యం స్థానంలో సన్నాలను సరఫరా చేస్తోంది. ఈ రెండు కారణాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 60 నుంచి 70 శాతం మేరకు ధాన్యం, బియ్యం నిల్వలు పెరుకుపోయాయి.ఎఫ్‌సిఐ గోదాములలో సైతం ఇదే పరిస్థితి నెలకొనడంతో ఈ సీజన్‌లో సేకరించిన ధాన్యం నిల్వ చేసేందుకు స్థలం లేకపోవడంతో ధాన్యంతో వచ్చిన లారీలు 4 నుంచి 5 రోజులైనా ఖాళీ కాని పరిస్థితి ఏర్పడుతోంది.

**ఐదు రోజులైనా ఖాళీ కాని లారీలు : అగు ఆనంద్, అధ్యక్షులు, రామన్నపేట మండల లారీ ఓనర్స్ అసోసియేషన్**

“ధాన్యం లోడుతో రైస్ మిల్లులకు వెళ్లిన లారీలు అన్‌లోడ్ కావడానికి 4 నుంచి 5 రోజులు పడుతోంది. జాప్యానికి కారణమేమిటని ప్రశ్నిస్తే దించుకోవడానికి స్థలం లేదంటూ రైస్ మిల్లుల ఓనర్లు సమాధానం ఇస్తున్నారు. మాకు ఇచ్చేదే తక్కువ కిరాయి. అందులో వెయిటింగ్ ఛార్జీలు ఇవ్వకపోవడంతో తీవ్ర నష్టం చవిచూడాల్సివస్తోంది. ఒక్క రోజు లారీ అన్‌లోడ్ కాకుండా నిలబడితే రోజుకు ఫైనాన్స్ ఈఎంఐ, డ్రైవర్ జీతం, బత్తా, ఇన్సురెన్స్ రూపంలో సుమారు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు నష్టం వస్తుంది. ఇదే పరిస్థితి కొనసాగితే నెలకు 6 ట్రిప్‌లు కూడా వేయలేని పరిస్థితి. దీంతో కనీస మిగులుబాటు పక్కనపెడితే లారీ ఫైనాన్స్ ఈఎంఐ కూడా కట్టలేని పరిస్థితి. దీంతో ధాన్యం లోడు అంటేనే ఓనర్లు హడలిపోతూ లోడ్ పెట్టేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు” అని ఆగు రామన్నపేట మండల లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆనంద్ చెప్పారు.

**ఇవేమి తిప్పలు : రైతు మోటే రవి**

“ధాన్యం అమ్ముకోవడానికి ఇవేమి తిప్పలో అర్థం కావడం లేదు. కష్ట నష్టాలకు ఓర్చి ధాన్యాన్ని పండించి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే ఇక్కడ మాత్రం పడిగాపులు పడే పరిస్థితి వచ్చింది. ధాన్యం తీసుకువచ్చిన వారం వరకు తేమ కారణంతో ధాన్యాన్ని కొనుగోలు చేయని అధికారులు తీరా ధాన్యం పూర్తిగా ఎండిన తర్వాత కాంట పెట్టడంలేదు. దీంతో దంచికొడుతున్న ఎండలకు ధాన్యం పూర్తిగా ఎండిపోయి కాంటా తక్కువ వచ్చే పరిస్థితి ఏర్పడుతోంది. దీనికి తోడు ఎప్పుడు కురుస్తాయో తెలియని అకాల వర్షాలతో బిక్కుబిక్కుమనే పరిస్థితి నెలకొంది. ఎందుకు కాంటా పెట్టడంలేదని అధికారులను ప్రశ్నిస్తే లారీల కొరత అంటూ సమాధానం చెబుతున్నారు” అని రైతు మోటే రవి తెలిపారు.

## విజయ్‌కి మళ్లీ తిరస్కరణ

(మొదటి పేజీ తరువాయి)

చేయడానికి టివికె పార్టీకి తగినంత మద్దతు లేదని గవర్నర్ అర్లేకర్ విజయ్‌కు వివరించినట్లు లోక్ భవన్ తెలిపింది. బుధవారం నుండి వీరిద్దరి మధ్య జరిగిన రెండవ సమావేశం కోసం గవర్నర్ గురువారం నాడు టివికె అధ్యక్షుడు సి. జోసెఫ్ విజయ్‌ను లోక్‌భవన్‌కు ఆహ్వానించారని లోక్ భవన్ పేర్కొంది. ‘ఈ సమావేశం సందర్భంగా, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అత్యంత ఆవశ్యకమైన, తమిళనాడు శాసనసభలో ఉండాల్సిన తగినంత మెజారిటీ మద్దతు ఇంకా నిరూపితం కాలేదని గవర్నర్ వివరించారు’ అని ఒక పత్రికా ప్రకటనలో లోక్ భవన్ తెలిపింది. కాగా, 24 గంటల వ్యవధిలో లోక్ భవన్‌కు చేసిన తన రెండవ పర్యటనలో విజయ్ గవర్నర్‌తో సుమారు 40 నిమిషాల పాటు గడిపి, ఆ తర్వాత అక్కడి నుండి బయటకు రావడం కనిపించింది. ఏప్రిల్ 23న జరిగిన ఎన్నికల్లో, 234 మంది సభ్యులు కలిగిన అసెంబ్లీలో టివికె 108 స్థానాలను గెలుచుకుని, ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఐదుగురు ఎమ్మెల్యేలు కలిగిన కాంగ్రెస్ పార్టీ టివికెకు మద్దతు ప్రకటించినప్పటికీ, ఈ నటుడురాజకీయ నాయకుడు నేతృత్వంలోని పార్టీకి, 200కు పైగా సభ్యులు కలిగిన సభలో మెజారిటీ మార్కు అయిన ’మ్యాజిక్ నంబర్’ 118ని చేరుకోవడానికి ఇంకా కొన్ని స్థానాల కొరత ఉంది. బుధవారం నాడు, విజయ్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మద్దతు లేఖను గవర్నర్‌కు సమర్పించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఆహ్వానించాలని కోరారు. అయితే, ఈ విషయంపై గవర్నర్ ఆర్లేకర్ ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు.

ప్రమాణ స్వీకారం, ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన ప్రశ్నలకు టివికె నాయకుడు వివిఎస్ బాబు సమాధానమిస్తూ ‘చూద్దాం, ఇది త్వరలోనే జరుగుతుంది; తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయో వేచి చూద్దాం’ అన్నారు. కేంద్రం నుండి ఏదైనా ఒత్తిడి ఉందనే ఆరోపణల గురించి ప్రశ్నించినప్పుడు, తనకు అవగాహన లేని విషయాలపై తాను వ్యాఖ్యానించనని ఆయన తెలిపారు.

**లోక్‌భవన్ వెలుపల టివికె నిరసన**

మరోవైపు, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి విజయ్‌ను అనుమతించాలని డిమాండ్ చేస్తూ, టివికె కార్యకర్తలు లోక్‌భవన్ వెలుపల ఆందోళన చేపట్టారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మెజారిటీని నిరూపించుకోవడానికి లోక్‌భవన్ సరైన వేదిక కాదని, శాసనసభ మాత్రమే సరైన స్థలమని టివికె కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో 108 మంది ఎమ్మెల్యేలను గెలుచుకొని తమ పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరించిందని వారు గుర్తు చేశారు. టివికె ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే విషయంలో, గవర్నర్ బిజెపికి పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. గురువారం విజయ్ ప్రమాణ స్వీకారం చేయలేకపోయినందున తాము నిరాశ చెందామని, అయితే, విజయ్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యేవరకు చెన్నైలోనే ఉండిపోవాలని నిర్ణయించుకున్నట్లు టివికె కార్యకర్తలు తెలిపారు.

## వేడెక్కిన రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

డి.ఎం.కె పార్టీ శాసనసభాపక్షం ఏకగ్రీవ తీర్మానం చేసింది. తమిళనాడు రాష్ట్రంలో ఒక సుస్థిరమైన ప్రభుత్వం ఏర్పాటు చేయడమే డి.ఎం.కె ప్రధాన కర్తవ్యమని, ఈ విధానానికి అనుగుణంగా తక్షణ నిర్ణయాలు తీసుకోవడానికి పార్టీ అధినేతకు అధికారాలు ఇస్తున్నట్లు సోమవారం సాయంత్రం జరిగిన సమావేశంలో శాసనసభాపక్షం తన తీర్మానంలో పేర్కొంది.

“మరోసారి ఎన్నికలకు తమిళనాడు రాష్ట్రం సిద్ధంగా లేదు,మన ప్రధాన కర్తవ్యం రాష్ట్రంలో ఒక సుస్థిరమైన ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి భరోసా ఇవ్వడం. అదే సమయంలో మత శక్తులకు అవకాశం ఇవ్వకుండా గట్టిగా కట్టుబడి ఉండాలనే విషయాన్ని మనపార్టీ పరిగణనలోకి తీసుకుంది. మతశక్తులకు అవకాశం ఇవ్వడమంటే ద్రవిడియన్ సిద్ధాంతం,ద్రవిడియన్ ఉద్యమ మౌలిక సూత్రాలను నీరుగార్చినట్లే” అని డి.ఎం.కె పేర్కొంది. అదేవిధంగా రాష్ట్రంలో రూపుదిద్దుకు రాజకీయ,పాలనాపరమైన పరిస్థితులను అధ్యయనం చేసి ఆ మేరకు వెనువెంటనే తక్షణ నిర్ణయాలు తీసుకోవడానికి ద్రవిడియన్ హీరో ఎం.కె.స్టాలిన్‌కు పార్టీ అధికారాలు ఇస్తోంది” అని పేర్కొంది. ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇవ్వాలని ఎ.ఐ.ఎ.డి.ఎం.కె చేసిన విజ్ఞప్తిపై డి.ఎం.కె చర్చిస్తున్న తరుణంలో ఈ పరిణామాలు కీలకంగా మారాయి.

పాత బుద్ధి పోనిచ్చుకోలేదు

**కాంగ్రెస్‌పై డిఎంకె నిశిత విమర్శ**

తమిళనాడులో లౌకిక కూటమితో తెగదెంపులు చేసుకున్న కాంగ్రెస్‌పార్టీని డిఎంకె శాసనసభాపక్షం నిశితంగా విమర్శించింది. కాంగ్రెస్‌పార్టీ చర్యలను తీవ్రంగా ఖండించింది. తమిళనాడులో లౌకిక ప్రగతిశీల ప్రజాస్వామ్యశక్తుల కూటమితో కాంగ్రెస్‌పార్టీ తెగదెంపులు చేసుకోవడాన్ని డిఎంకె శాసనసభాపక్షం తన తీర్మానంతో తప్పుపడుతూ, ఆ పార్టీ ఇంకా తన పాత వ్యక్తిత్వాన్ని, విధానాలను వదులుకోలేదని విమర్శించింది. డిఎంకె నాయకత్వాన గల కూటమిలో భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్‌పార్టీ గతంలో 28 అసెంబ్లీ స్థానాలను, ఒక రాజ్యసభ స్థానాన్ని గెలుచుకుందని తీర్మానం గుర్తుచేసింది. కూటమి కార్యకర్తలందరూ ఎంతో కష్టపడి శ్రమించి సాధించిన విజయాన్ని ప్రమాదంలోకి నెట్టేసి ఇప్పుడు ఎన్నికలైన తర్వాత ప్రత్యామ్నాయ రాజకీయ సంఘటనవైపు మళ్ళిందని విమర్శించింది.

## రణరంగం

(మొదటి పేజీ తరువాయి)

క్షీణించాయని ఇటీవల నగల షాపులో దోపిడి ఘటన భద్రత వైఫల్యంతోనే జరిగిందని వ్యాఖ్యానించారు. అలాగే కేంద్ర మంత్రి బండి సంజయ్ బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ల మధ్య డ్రగ్స్ టెస్ట్ ల సవాళ్లు ప్రతి సవాళ్ల నేపథ్యంలో డ్రగ్స్ టెస్ట్ కు బండి సంజయ్ వస్తే కేటీఆర్ సైతం వస్తాడని సవాల్ విసిరారు. దీంతో పాటు ccబండి సంజయ్ తంబాకు తింటాడని అందులో డ్రగ్స్ కలిపి తీసుకుంటాడంటూ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలతో భగ్గుమన్న బీజేపీ కార్యకర్తలు కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కౌశిక్ రెడ్డి ఉన్నాడనే సమాచారంతో అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. కౌశిక్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అక్కడే ఉన్న ఆయన కారుపై కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో కారు అద్దాలు పూర్తిగా పగిలిపోయాయి. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పరిస్థితి తీవ్రతను గమనించిన పోలీసులు అదనపు బలగాలను రంగంలోకి దించి ఇరువర్గాలను చెదరగొట్టారు. పోలీసులు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని క్యాంప్ ఆఫీసు నుంచి తరలించారు.

**ప్రశ్నిస్తే..దాడులు చేస్తారా..**

పాడి కౌశిక్ రెడ్డి, హుజురాబాద్ ఎమ్మెల్యే దాడి తర్వాత కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక శాసనసభ్యునికి రక్షణ లేనప్పుడు సామాన్యుని పరిస్థితి ఏంటని నిలదీశారు. ముఖ్యమంత్రి హోమ్ మంత్రి గా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో శాంతి భద్రతల, ఇంటెలిజెన్స్ వైఫల్యం కాదా అని ప్రశ్నిస్తున్నానన్నారు. బయట తిరిగితే చంపేస్తారా, గన్ కల్చర్ పరిస్థితి ఏంటి అని, వారు కెసిఆర్‌ను కెటిఆర్ ను హరీష్ రావును ఎన్ని మాటలు అన్నా మేము దాన్ని ప్రశ్నిస్తే మాపై దాడులా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి, బండి సంజయ్ లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనను హత్య చేసేందుకు కుట్ర జరుగుతందని హుజురాబాద్ ఎమ్మెల్యే ఆరోపించారు.

**కౌశిక్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకో..**

బిజెపి పార్లమెంట్ కన్వీనర్ బోయిన్ పల్లి ప్రవీణ్ రావు హెచ్చరిక.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బిజెపి పార్లమెంట్ కన్వీనర్ బోయిన్ పల్లి ప్రవీణ్ రావు ఫైర్ అయ్యారు . కౌశిక్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఘాటుగా హెచ్చరించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ కు ఇచ్చిన 48 గంటల వ్యవధి దగ్గర పడిందని , డ్రగ్ ట్రస్టులకు కేటీఆర్ భయపడుతున్నారనే విషయం కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలతో స్పష్టంగా అర్థమవుతుందన్నారు. కేటీఆర్ కు , బిఆర్ఎస్ నేతలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన సవాల్ ను స్వీకరించే దమ్ము లేక, కౌశిక్ రెడ్డి తో అనవసర వ్యాఖ్యలు, రాద్ధాంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకుని జాగ్రత్తగా మాట్లాడాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. రేపు బంద్ పిలుపునిచ్చిన బీఆర్ ఎస్ కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై బిజెపి గూండాలు చేసిన దాడిని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ ప్రత్యర్థులపై ఇలాంటి దాడులు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈ ఘటనతో కరీంనగర్ పట్టణంలో శాంతి భద్రతల పరిస్థితి పూర్తిగా దిగజారిందని స్పష్టమవుతోందన్నారు. దాడికి నిరసనగా భారత రాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ పట్టణ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజకీయాల్లో దాడుల సంసృతి మంచిది కాదు. రాజకీయాల్లో బౌతిక దాడుల సంసృతి మంచిది కాదని పలువురు రాజకీయ నాయకులు అన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి స్పందిస్తూ బౌతిక దాడుల సంసృతి మంచిది కాదన్నారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు దిగజారిన రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఈ ఘటనను పూర్తిగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## నేడు నిర్ణయం తీసుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

డి.ఎం.కె కూటమిలో మిత్రపార్టీలుగా ఉన్నాయి. చెన్నైలోని అళ్వార్‌పేట్‌లో స్టాలిన్ నివాసంలో ఆయనతో సమావేశం అనంతరం వి.సి.కె నాయకుడు థోల్ థిరుమవలవన్ మాట్లాడుతూ, శుక్రవారంనాడు తమ పార్టీలు మూడూ విడివిడిగా సమావేశాలు నిర్వహించి టి.వి.కె (తమిళగ వెట్రి కళగం)పార్టీ చేసిన విజ్ఞప్తిపై నిర్ణయాలు తీసుకుంటాయని చెప్పారు. స్టాలిన్‌తో సమావేశానికి ముందుగా, థిరుమవలవన్‌తోపాటు సి.పి.ఐ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి ఎం.వీరపాండియన్, సి.పి.ఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.షన్ముగమ్ ముగ్గురూ ఒక సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 23వ తేదీన తమిళనాడు అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఈ మూడు పార్టీలూ రెండేసి స్థానాలు వంతున గెలుచుకున్నాయి. “ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావాల్సిన మెజార్టీ నిర్ణయాన్ని మేం చేయలేం, వి.సి.కె. ఉన్నతస్థాయీ కమిటీ శుక్రవారం సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటుంది, అదేవిధంగా సి.పి.ఐ., సి.పి.ఐ(ఎం) పార్టీలు కూడా వేరు వేరుగా వారి కార్యాలయాలలో సమావేశమై నిర్ణయాలు తీసుకుంటాయి” అని థిరుమవలవన్ పాత్రికేయులకు చెప్పారు.

తమిళనాడులో డి.ఎం.కెపార్టీకి దీర్ఘకాలంగా మిత్రపార్టీగా ఉన్న కాంగ్రెస్ మొన్నటి ఎన్నికల్లో ఐదు స్థానాలు గెలుచుకుంది. 108 స్థానాలు గెలుచుకుని తమిళనాట ఏకైకపెద్దపార్టీగా ఆవిర్భవించిన టివికెతో ఎన్నికల అనంతరం పొత్తుకు కాంగ్రెస్‌పార్టీ ఇప్పటికే సంసిద్ధత వ్యక్తం చేసింది. తమిళనాడు అసెంబ్లీలో మొత్తం 234 స్థానాలు ఉండగా, టివికె 108 స్థానాలు గెలిచింది. ఈపార్టీకి ఇంకా ఐదుగురు ఎంఎల్‌ఎల మద్దతు అవసరం ఉంది. ఏ పార్టీ అయినా ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే అసెంబ్లీలో 118 మంది సభ్యుల సంఖ్యా బలం ఉండాలి.

## అభ్యంతరం

(మొదటి పేజీ తరువాయి)

మెజార్టీ ఉందా లేదా అన్నది అసెంబ్లీలో తేలుతుందన్నారు. గవర్నర్ ముందుగానే 118 మంది ఎమ్మెల్యేల మద్దతు చూపాలని అడగడం సరైంది కాదని తిరుమావళవన్ వ్యాఖ్యానించారు. విజయ్ మద్దతు కోరుతూ తమ పార్టీకి లేఖ రాశారని, దీనిపై నిర్ణయం త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

**ప్రభుత్వం ఏర్పాటు చేయాలని సిపిఐ డిమాండ్**

సిపిఐ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది. గవర్నర్ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా వ్యవహరించాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ కోరింది. ‘అతిపెద్ద పార్టీగా నిలిచిన టివికెకు ముందుగా అవకాశం ఇవ్వాలి. ప్రమాణ స్వీకారం కంటే ముందే మెజార్టీ నిరూపించాలని అడగడం తగదు’ అని సిపిఐ పేర్కొంది. సుప్రీంకోర్టు ఎస్ఆర్ బొమ్మై కేసులో ఇచ్చిన తీర్పును సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వీరపాండియన్ ప్రస్తావించారు. మెజార్టీ నిరూపణ రాజ్ భవన్‌లో కాకుండా అసెంబ్లీలో జరగాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని గుర్తుచేశారు. అందువల్ల గవర్నర్ వెంటనే టివికెను ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఆహ్వానించాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఎం కూడా ఈ అంశంపై స్పందించింది. టివికె అధినేత విజయ్ తమ పార్టీకి మద్దతు కోరుతూ లేఖ పంపినట్లు సిపిఎం నేత పి. షణ్ముగం తెలిపారు. శుక్రవారం జరగనున్న పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఇక సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత కమల్ హాసన్ కూడా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తమిళనాడు ప్రజలు ఏ ఒక్క పార్టీకి పూర్తి మెజార్టీ ఇవ్వలేదని, కానీ టివికెను అతిపెద్ద పార్టీగా నిలబెట్టారని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితిలో విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఆహ్వానించకపోవడం ప్రజా తీర్పును అవమానించడమే అవుతుందని వ్యాఖ్యానించారు.

**ప్రజలు ఎన్నుకొన్న టివికెని అడ్డుకోవడం నేరం: మాణికం ఠాగూర్**

తమిళనాడులో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్న టివికె అధినేత విజయ్‌కు కాంగ్రెస్ ఎంపి మాణికం ఠాగూర్ పూర్తి మద్దతు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోసం ఎంతో ఆశగా ఓటు వేసినప్పటికీ, నటుడిగా రాజకీయాల్లోకి వచ్చిన విజయ్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఏఎన్ఐ వార్తాసంస్థతో ఆయన మాట్లాడుతూ, తమిళనాడులో వచ్చిన తీర్పు విజయ్ నాయకత్వానికి ప్రజల మద్దతును స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఠాగూర్ పేర్కొన్నారు. గవర్నర్ వెంటనే టివికెను ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాలని, సభలో తన మెజారిటీని నిరూపించుకోవడానికి అనుమతించాలని ఆయన డిమాండ్ చేశారు. ‘గవర్నర్ బిజెపికి చెందిన వ్యక్తి.. ఆయన గతంలో బిజెపిలో పనిచేశారు. ఆయనకు కాషాయ మనస్తత్వం ఉందని మనందరికీ తెలుసు. విజయ్‌ను ముఖ్యమంత్రిని చేయకూడదన్నదే ‘ఢిల్లీ’ (కేంద్ర నాయకత్వం) ఆలోచన’ అని ఆయన ఆరోపించారు. గవర్నర్‌పై బిజెపి నాయకత్వం నుంచి ఒత్తిడి ఉందని ఠాగూర్ అన్నారు.

రాష్ట్ర అసెంబ్లీలో కేవలం ఒక్క ఎమ్మెల్యే మాత్రమే ఉన్నప్పటికీ, బిజెపి ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియను ఆలస్యం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు.

**కాంగ్రెస్ పోరుబాట**

విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ ఆలస్యం చేస్తుండటాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ పోరుబాట పట్టబోతోంది. గవర్నర్ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, శుక్రవారం రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టిఎన్‌సిసి) గవర్నర్ నిర్ణయాన్ని నిరసిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రేపు చెన్నైలోని గవర్నర్ అధికారిక నివాసం (లోక్ భవన్)ను ముట్టడించాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చింది. కేవలం చెన్నైలోనే కాకుండా, రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో భారీ ఎత్తున ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రజలు ఇచ్చిన తీర్పును గవర్నర్ కాలరాస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కాంగ్రెస్ ఈ నిరసనలకు శ్రీకారం చుట్టింది.

## టివికెకు అవకాశమివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

మరింత పెంచుతుందని డి.రాజా హెచ్చరించారు. గవర్నర్ కార్యాలయాన్ని దుర్వినియోగం చేయడం ద్వారా తమిళనాడులో విస్తరించేందుకు బీజేపీని అవకాశం లభించకూడదని ఆయన నొక్కిచెప్పారు. రాజ్యాంగ అధికారులు నిష్పాక్షికంగా ఉండాలని, ప్రజాస్వామ్యబద్ధంగా తమిళనాడు ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని ఆదేశాలను గౌరవించాలని డి.రాజా అన్నారు.

**ప్రజాస్వామిక సమగ్రత అవశ్యం : సిపిఎం**

తమిళనాడులో ప్రస్తుతం రాజకీయంగా నెలకొన్న ప్రతిష్ఠంభన దృష్ట్యా ప్రజాస్వామ్య నిబంధనలకు కట్టుబడాలని ఆ రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌కు సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంబి బేబి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా నిలిచిన టివికెకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని సూచించారు. 1996లో ఇదే తరహా పరిస్థితి ఎదురైనట్లు గుర్తుచేశారు. మెజారిటీ నిరూపించుకోవాలంటూ టీవీకేను ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అనుమతించకుండా గవర్నర్ తాత్సారం చేస్తుండటం ఆమోదయోగ్యం కాదని బేబీ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య సమగ్రత పాటించాలని గవర్నర్ కార్యాలయానికి పిలుపునిచ్చారు. అనుమానాలకు తావివ్వొద్దని సూచించారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఎం ఓటమిని అంగీకరించారు. గవర్నర్ తీరు నిరాశపరిచిందని అన్నారు. అసెంబ్లీ బలం నిరూపించుకునేందుకు టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు సముచిత సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రస్తుత అసాధారణ పరిస్థితుల దృష్ట్యా భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయించేందుకు తమ పార్టీ నాయకత్వం త్వరలో చెన్నైలో భేటీ కాబోతోందని ఎంఏ బేబీ చెప్పారు. కాగా, ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు విజయ్ రెండు సార్లు గవర్నర్‌ను కలిసి భంగపడటం విదితమే.

# చరిత్ర సృష్టించిన స్వింగ్ కింగ్..

## అత్యధిక మ్యాచ్‌లతో ఆల్‌టైమ్ రికార్డు సృష్టించిన భువనేశ్వర్



భారత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన తొలి పేసర్‌గా అతడు రికార్డు నెలకొల్పాడు. పంతొమ్మిదో సీజన్‌లో స్వింగ్తో బ్యాటర్లను బెంబేలెత్తిస్తున్న భువికి.. గురువారం లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్ రెండొందలది. ఈ ఘనత సాధించిన తొలి పేసర్‌గా ఈ వెటరన్ బౌలర్ రికార్డు పుస్తకాల్లోకి ఎక్కాడు.

వయసు పైబడుతున్నా కొద్దీ రాటుదేలుతున్న భువనేశ్వర్ ఐపీఎల్‌లో రెండొందల మ్యాచ్ ఆడుతున్నాడు. తద్వారా మరే పేసర్‌కు సాధ్యమవ్వని రికార్డు పట్టేశాడీ లెజెండ్. భారత జట్టులో చోటు కోల్పోయినా దిగులు చెందకుండా.. ఫ్రాంచైజీ క్రికెట్లో సత్తా చాటుతూ ఆర్సీబీ విజయాల్లో కీలకం అవుతున్నాడు భువి. స్వింగ్ కింగ్‌గా ప్రశంసలు అందుకుంటున్న అతడు 19వ సీజన్లో 17 వికెట్లు తీశాడు. ఇదివరకూ సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్‌కు ఆడిన భువనేశ్వర్ ప్రస్తుతం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

**రెండుసార్లు పర్పుల్ క్యాప్..** రెండు ఐపీఎల్ ట్రోఫీలో గెలుపొందిన భువి.. అత్యధిక మ్యాచ్ల రికార్డు సాధించడం పట్ల అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఐపీఎల్లో భువనేశ్వర్ తర్వాత అత్యధిక మ్యాచ్లు ఆడిన పేసర్లు, పేస్ ఆల్‌రౌండర్ల జాబితాలో కీరన్ పొలార్డ్, డ్వేన్ బ్రావో, హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా.. తదితరులు ఉన్నారు.

1. కీరన్ పొలార్డ్ 189 మ్యాచ్‌లు
2. డ్వేన్ బ్రావో 161 మ్యాచ్‌లు
3. హార్దిక్ పాండ్యా 160 మ్యాచ్‌లు
4. జస్ప్రీత్ బుమ్రా 155 మ్యాచ్‌లు

## ఫైనల్ అహ్మదాబాద్‌లోనే..

### బెంగళూరుకు నిరాశ... చండీగఢ్‌లో క్వాలిఫయర్ మ్యాచ్‌లు



**ఢిల్లీ:** క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగిస్తున్న ఐపిఎల్ 19 ప్లేఆఫ్స్ షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు బిసిసిఐ బుధవారం ఇందుకు సంబంధించిన వేదికలను వెల్లడించింది. గత సీజన్ మాదిరిగానే ఈ ఏడాది సైతం అహ్మదాబాద్‌లోనే ఫైనల్‌ను నిర్వహించాలని బోర్డు ఖరారుచేసింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియానికి ఫైనల్ ఆతిథ్య హక్కులు దక్కుతాయని ఆశించినా బోర్డు నిర్దేశించిన నిబంధనల పరిమితికి లోబడి స్థానిక అసోసియేషన్‌లో పరిస్థితులు లేకపోవడంతో వేదికను మార్చినట్టు బిసిసిఐ ఒక ప్రకటనలో తెలిపింది. క్వాలిఫయర్ 1కు ధర్మశాల నిర్వహించనుండగా, ముల్లాన్పూర్ (చండీగఢ్)లో ఎలిమినేటర్, క్వాలిఫయర్2లకు ఆతిథ్యమివ్వనుంది. మే 24 దాకా లీగ్ మ్యాచ్‌లు జరుగాల్సి ఉండగా 26 నుంచి ప్లేఆఫ్స్ మొదలవుతాయి. 26న క్వాలిఫయర్1, 27న ఎలిమినేటర్, 29న క్వాలిఫయర్2 మ్యాచ్‌లు జరుగనుండగా ఈనెల 31న ఫైనల్‌ను నిర్వహించనున్నారు. ఇదిలాఉండగా బిసిసిఐ నిర్ణయంపై కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్సీఏ) అసంతృప్తి వ్యక్తం చేసింది.

## మూడో స్థానంలో గుకేశ్




**వార్సా (పోలండ్) :** ఇటీవలి కాలంలో వరుస పరాభవాలతో సతమతమవుతున్న వరల్డ్ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ స్వల్ప విరామం తర్వాత తన పునరాగమనాన్ని ఘనంగా చాటాడు. వార్సా వేదికగా గ్రాండ్ చెస్ టూర్లో భాగంగా జరుగుతున్న సూపర్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టోర్నీలో రెండు విజయాలతో సత్తాచాటాడు. ర్యాపిడ్ విభాగం ఐదో రౌండ్‌లో అతడు.. ఉజ్బెకిస్థాన్ సంచలనం జవోఖిర్ సిందరోవ్ను ఓడించాడు.
**నల్లపావులతో ఆడిన గుకేశ్..** 52 ఎత్తుల్లో ప్రత్యర్థిని చిత్తుచేశాడు. అంతకుముందు అతడు.. మూడో రౌండ్‌లో పోలండ్‌కు చెందిన జాన్ క్రిస్టోఫ్తో గేమ్‌ను గెలుచుకోగా అలిరెజా (ఫ్రాన్స్), వెస్లీ (అమెరికా)తో జరిగిన మ్యాచ్‌లను డ్రా చేసుకున్నాడు. పది మంది ప్లేయర్లు తలపడుతున్న ఈ టోర్నీలో ఆరు రౌండ్లు ముగిసేసరికి 6 పాయింట్లతో గుకేశ్ మూడో స్థానంలో ఉన్నాడు.

## పోటీ కోసం జీకే

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

## రెండు రాష్ట్రాల మధ్య వచ్చే వివాదాలను విచారించే అధికారం ఎవరికి ఉంటుంది?

☞ రాష్ట్రంలోని మొత్తం జాతీయ రహదారుల పొడవు ఎంత?
2,592 కి.మీ.
☞ పార్లమెంటుకు ఎంతమంది సభ్యులను నామినేట్ చేస్తారు?
14
☞ బ్రిటన్‌కు చెందిన ప్రతిష్ఠాత్మక ఎంకోర్ సాహిత్య అవార్డును గెలుచుకున్న 'ది లైవ్స్ ఆఫ్ అదర్స్ ' పుస్తకాన్ని ఎవరు రచించారు?
నీల్ ముఖర్జీ
☞ ఏ మంటలను నీటితో ఆర్పలేం?
చమురు మంటలు
☞ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా, ప్రధానమంత్రి సురక్ష బీమా, అటల్ పింఛను యోజన అనే మూడు కేంద్ర ప్రభుత్వ పథకాలు 2015లో ఏ రోజు నుంచి అమల్లోకి వచ్చాయి?
జూన్ 1
☞ డిజాస్టర్' అనే పదం ఏ భాషనుంచి వచ్చింది?
ఫ్రెంచి
☞ 'గో బ్యాక్ టు ది వేదాస్' నినాదం ఎవరిది?
దయానంద సరస్వతి
☞ నలంద విశ్వవిద్యాలయ స్థాపకులు ఎవరు?
కుమారగుప్తుడు
☞ కిందివాటిలో ఏ కటకాన్ని దీర్ఘదృష్టిని నివారించేందుకు ఉపయోగిస్తారు?
ద్వికుంభాకార
☞ వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూటీవో) ప్రకారం ప్రపంచ వ్యవసాయ ఎగుమతుల్లో భారత వాటా ఎంత?
2.69%
☞ కుతుబ్ షాహీ సుల్తానుల వైభవాన్ని చాటేది?
గోల్కొండ కోట
☞ మొట్టమొదటి సార్క్ (SAARC) సమావేశం జరిగిన సంవత్సరం
1985
☞ వేప శాస్త్రీయ నామం
అజాడిరక్ట ఇండికా
☞ నూలు వస్త్రములు మరియు కలప ఏ పదార్థంతో ఏర్పడినవి
సెల్యులోజ్
☞ 'షూ మేకర్ లేవీ'తో ఢీకొన్న గ్రహం.
బృహస్పతి
☞ యూకలిప్టస్ అరణ్యాలు గల ఖండం
ఆస్ట్రేలియా
☞ ఆడ ఈగ ఒక్కొక్కసారికి పెట్టే గుడ్ల సంఖ్య
120160
☞ మొట్టమొదటగా సింహాసనాన్ని పరిత్యజించిన భారతదేశ రాజు?
చంద్రగుప్త మౌర్యుడు
☞ విటమిన్ ఎ లోపంతో కలిగే కంటివ్యాధులేవి?
రేచీకటి, గ్జీరాప్తాల్మియా, కార్నియా మెత్తబడటం
☞ నిర్భయ చట్టం ప్రకారం ఎన్ని సంవత్సరాల లోపు వారిని బాలలుగా పరిగణిస్తారు?
15
☞ రాష్ట్రంలో ప్రభుత్వ విధానాలను నిర్ణయించడానికి అధికారం ఉన్నవారు?
ముఖ్యమంత్రి
☞ పంచాయతీరాజ్ సంస్థల నిర్మాణమును సూచించిన నిబంధన?
243A
☞ హైదరాబాద్ తెలంగాణ పీఠభూమిపై ఎంత ఎత్తులో ఉంది?
600 మీ.
☞ రాజీవ్ గాంధీ ఖేల్ రత్న పురస్కారం 2015 గ్రహీత ఎవరు?
సానియా మీర్జా
☞ రెండు రాష్ట్రాల మధ్య వచ్చే వివాదాలను విచారించే అధికారం ఎవరికి ఉంటుంది?
సుప్రీంకోర్టు




☞ ఈ క్రింది వానిలో సరికాని జత?
పోలాండ్ అప్లో
☞ మూడో పానిపట్టు యుద్ధంలో మరాఠాల ఓటమికి ప్రధాన కారకుడిగా ఎవరిని పేర్కొంటారు?
సదాశివరావు భావే
☞ 'ట్వీడ లోయ' ఏ ప్రదేశంలో ఉంది?
స్కాట్లాండ్
☞ యూరప్ క్రీడా మైదానం?
స్విట్జర్లాండ్
☞ సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ వ్యవస్థాపకులు ఎవరు?
గోపాలకృష్ణ గోఖలే
☞ విద్యుత్ వలయంలో కెపాసిటర్‌ను దేనికి ఉపయోగిస్తారు?
విద్యుత్‌ను నిల్వ చేయడానికి
☞ ఏ నది భారతదేశంలో జన్మించదు?




సట్లెజ్
☞ 'విటమిన్ కె' వేటినుంచి లభిస్తుంది?
పిక్కలు, గుడ్లు, కాలేయం
☞ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రస్తుత జీతం ఎంత?
రూ. లక్ష
☞ కంప్యూటర్లలోని సమాకలన వలయాల్లో ఉపయోగించే మూలకం
సిలికాన్
☞ హిమాలయాల పొడవు సుమారు?
2400 కిలో మీటర్లు
☞ హ్రస్వదృష్టిని నివారించేందుకు వాడే కటకం
ద్విపుటాకార
☞ అడవులు మరీ తక్కువగా ఉన్న రాష్ట్రం?
హర్యానా
☞ మొదటి ఆంగ్లో మరాఠా యుద్ధం ఏ సంధితో ముగిసింది?
సల్బాయ్
☞ అంధత్వానికి మూలకారణం?
విటమిన్ 'ఎ' లోపం
☞ ఆస్ట్రేలియన్ ఓపెన్ 2015 విజేత ఎవరు?
నోవాక్ — జకోవిచ్
☞ 2015 క్రికెట్ ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇచ్చిన దేశం?
ఆస్ట్రేలియా, న్యూజిలాండ్
☞ కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి రాష్ట్రాలకు ఇచ్చే పన్ను ఏది?
రైలు ఛార్జీలపై విధించే పన్ను
☞ సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకాన్ని ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
1980
☞ కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'హడ్కో అవార్డు' దేనికి లభించింది?
జలహారం
☞ మాతృభాషలో పత్రికారంగం / సమాచార చట్టం ఎవరి కాలంలో ఆమోదం పొందింది?
లిట్టన్
☞ తాజా గణాంకాల ప్రకారం ముస్లింల జనాభా పెరుగుదల రేటు ఎంత?
0.8%

# మొక్కజొన్న కొనుగోళ్లలో సంక్షోభం

రైతుల బాధలు పట్టని ప్రభుత్వం
తక్షణమే కొనుగోళ్లు చేపట్టాలి
సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు
ఎం.బాల నరసింహ్మా డిమాండ్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలులో తీవ్రమైన సంక్షోభం కొనసాగుతుందని, వాటిని తక్షణమే నివారించి రైతులను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ్మా, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ ఎండి ఫయాజ్ డిమాండ్ చేశారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 40 రోజులుగా పడిగాపులు కాస్తున్న రైతుల బాధలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ రాష్ట్ర బృందం మార్కెట్ యార్డ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా బాల నరసింహ్మా మాట్లాడుతూ మార్కెట్ యార్డ్‌లో ఎటు చూసిన కుప్పలు కుప్పలుగా మొక్కజొన్న రాసులు పడి ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కొనుగోలు లేక వారాల తరబడి రైతులు ఎదురుచూపులు చూస్తున్నారని, సమయానికి తిండి, నీరు లేక తీవ్రమైన ఎండలో అవస్థలు పడుతున్నారన్నారు. మార్కెట్ యార్డ్‌లో ఉన్న కొనుగోలు ఏజెన్సీ అధికారులతో ప్రభుత్వ అధికారులు మాట్లాడి నాగర్ కర్నూల్ పరిసర ప్రాంతాల్లోనే ఫంక్షన్ హాళ్లను అద్దెకు తీసుకొని ధాన్యాన్ని అక్కడకు తరలించాలని కోరారు. అలా చేయడం ద్వారా మార్కెట్లో ఉన్న చాలా మేరకు ధాన్యం తరలించినట్టు అవుతుందని, తద్వారా అకాల వర్షాలతో రైతులకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. ధాన్యాన్ని నిల్వ చేసేందుకు సంచులు కూడా ప్రభుత్వం అందించలేకపోవడం దారుణమైన విషయమన్నారు. రసీదు ఇచ్చినా రైతుల ధాన్యానికి బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని, రైతులు తెచ్చిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని, ధాన్యం రాసులకు గన్నిసంచులు ఉచితంగా ప్రభుత్వమే సరఫరా చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. అలా లేనిపక్షంలో పెద్దఎత్తున కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు హెచ్ ఆనంద్ జి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.కేశవులుగౌడ్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు, రైతు సంఘ సీనియర్ నాయకులు కృష్ణాజి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య శంకర్ గౌడ్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్, మధు గౌడ్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర సమితి సభ్యులు వంకేశ్వరం శ్రీనివాస్, సిపిఐ నాయకులు హుస్సేన్, సంగం కృష్ణ, జి..వెంకటస్వామి, రామకృష్ణ, సత్యం, సత్యనారాయణ, శివకృష్ణ, మధు పాల్గొన్నారు.

# రైల్వే ఉద్యోగాల్లో కోత అన్యాయం

యువజన వ్యతిరేక విధానాలు
అవలంభిస్తున్న కేంద్రం
ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో
పోస్ట్‌కార్డ్ ఉద్యమం




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కేంద్ర ప్రభుత్వం యువజన వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ నిరుద్యోగులకు తీరని అన్యాయం చేస్తుందని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ విమర్శించారు. ఎఐవైఎఫ్ జాతీయ సమితి పిలుపులో భాగంగా రైల్వే శాఖలో ఖాళీలను భర్తీ చేయాలని, ఆర్ఆర్‌బి ఫలితాలను వెంటనే విడుదల చేసి నియమకాలు చేపట్టాలని రైల్వే ఉద్యోగాలలో రెండు శాతం కోతను వ్యతిరేకిస్తూ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఖమ్మం శ్రీనివాస థియేటర్ ఎదురుగా గల పోస్టాఫీస్ వద్ద పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకుగా మాత్రమే యువతను ఉపయోగించుకుని తర్వాత ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. రైల్వేలో రెండు శాతం ఉద్యోగాల కోత (సుమారు ఏడువేల పోస్టులు) విధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైల్వే శాఖలో ఇప్పటికే ఉన్న మూడు లక్షల ఉగ్యోగ ఖాళీలు భర్తీ చేయాలని, ఆర్ఆర్‌బి పరీక్షా ఫలితాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త నిరసన కార్యక్రమాల్లో భాగంగా దేశ ప్రధాని, రైల్వే మంత్రికి పోస్టుకార్డు ద్వారా ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్నామన్నారు. భారత రైల్వేలలో మొత్తం 14,80,455 పోస్టులు ఉండగా, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది 10 లక్షల మంది మాత్రమే ఉన్నారన్నారు. సుమారు నాలుగు లక్షల వరకు రైల్వే శాఖలో ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అటువంటి పరిస్థితుల్లో రైల్వే బోర్డు రెండు శాతం ఉద్యోగాల కోత (29608 పోస్టులు) నిర్ణయం పూర్తిగా అన్యాయమన్నారు. దీంతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోతాయన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైల్వేలో ఉన్న అన్ని ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, రెండు శాతం ఉద్యోగాల కోత నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని, ఆర్ఆర్‌బి పరీక్షా ఫలితాలను వెంటనే విడుదల చేయాలని, యువతకు శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో యువతను సమీకరించి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్, రెడ్ స్టార్ మధు, మాలోత్ శివ, శ్రీనివాస్, విజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టుల ఐక్యతతో ప్రజా ఉద్యమాలు




సిపిఐ జనగాం జిల్లా కార్యదర్శి
సిహెచ్.రాజారెడ్డి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అమరవీరుల ఆశయాలతో కమ్యూనిస్టులం ఐక్యంగా ప్రజా ఉద్యమాలు ముందుకు తీసుకెళ్దామని సిపిఐ జనగాం జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పాలకుర్తి మండలంలోని దర్దేపల్లి గ్రామంలో అమరవీరుల స్థూపం నిర్మాణానికి సిపిఐ, సిపిఎం నాయకులు ఉమ్మడిగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటి నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర పాలకుర్తి ప్రాంతానికి ఉందని, భూస్వాములకు వ్యతిరేకంగా, వెట్టి చాకిరి విముక్తి కోసం ఎర్ర జెండా నాయకత్వంలో ఎందరో అమరవీరులు పోరాటం చేసిన చరిత్ర ఎర్రజెండాకు దక్కిందన్నారు. నెలరోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నాయకులు శేఖర్, గోపి, రమేష్, సోమన్న, సారయ్య, సోమసత్యం, నాగయ్య, మదార్, ఇంద్రారెడ్డి, అశోక్‌బాబు, తిరుపతిరెడ్డి, నరేష్, సర్పంచ్ రేణుక సురేష్, సోమయ్య, సోమయ్య, దండయ్య, నర్స య్య, యాకలక్ష్మి , ఈశ్వర్, కనుకచారి, రమేష్, కొమురయ్య, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విఒఎలకు కనీస వేతనం రూ.20వేలు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి
బోగే ఉపేందర్ డిమాండ్

**ప్రజాపక్షం/రెబ్బెన :** విఒఎలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, వారికి కనీస వేతనం 20,000 రూపాయలు అమలు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం రెబ్బెన మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 18 నుంచి రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు చేపట్టనున్న నిరవధిక సమ్మెను జిల్లా వ్యాప్తంగా ఉన్న విఒఎలు, మహిళా సంఘాలు, కార్మికులు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. గత 20 ఏళ్లుగా సెర్ప్ పరిధిలో వెట్టిచాకిరి చేస్తున్న 18 వేల మంది విఒఎలకు కేవలం 5,000 రూపాయల వేతనం ఇవ్వడం ప్రభుత్వానికి తగదని విమర్శించారు. నిత్యావసర ధరలు పెరిగి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విఒఎల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వెంటనే 58 జిఒను రద్దు చేయాలని, ఎంఎసిసిసి లేదా సెర్ప్ హెచ్ఆర్ పాలసీని వర్తింపజేయాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలతో పాటు అర్హులైన విఒఎలకు సిసిలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం ఆగదని, 18వ తేదీ నుండి గ్రామాల్లో పొదుపు సంఘాల కార్యకలాపాలను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర విఒఎ జెఎసి కోశాధికారి గజేల్లి భీమేష్, నాయకులు తిరుపతి, శ్రీనివాస్, కృష్ణ, రవి, రజిత, సులోచన తదితరులు పాల్గొన్నారు.



## బిజెపికి ఓట్లేస్తే..ప్రజల జేబుకు తూట్లు




సిపిఐ ఆధ్వర్యంలో
కమర్షియల్ సిలిండర్లతో రాస్తారోకో

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** బిజెపికి ఓట్లు వేస్తే ప్రజల జేబుకు తూట్లు ఖాయమని పెంచిన గ్యాస్ ధరలు చెపుతున్నాయని సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో కమర్షియల్ గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని కోరుతూ గ్యాస్ సిలిండర్‌లతో జిల్లా కేంద్రంలోని శ్రీనివాస థియేటర్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర 993 రూపాయలు పెంచి చిరు వ్యాపారులపై భారం వేస్తున్న నరేంద్ర మోదీ చర్యలను ఖండించాలన్నారు. కమర్షియల్ గ్యాస్ ధర పెంచడం వల్ల చిన్నచిన్న హోటల్స్, టిఫిన్ సెంటర్లు, చాయ్ సెంటర్లు, హోటల్స్‌తో పాటు అన్ని వర్గాల చిరు వ్యాపారస్తులతో పాటు అన్నివర్గాల ప్రజలపై ఆ భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఓట్లు దండుకున్న బిజెపి ఇప్పుడు ప్రజలపై గ్యాస్ ధరలు పెంచి భారం వేస్తుంది ఆయన విమర్శించారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ ప్రజాసంఘాల నాయకులు పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి , వెలుగు శ్రావణ్, కేదాసు రమేష్, వంకాయలపాటి చిరంజీవి, పురం భాగ్యలక్ష్మి , ఎర్రోజు పద్మ, మంద శంకర్, నీలం వెంకటేశ్వర్లు, తండా శ్రీనాథ్, చిర్రా లక్ష్మీనరసమ్మ, ఐలయ్య, మంద శ్రీను, రాజు, రమేష్ ,రాజు ,వెంకటమ్మ, వీరమ్మ, శ్రీకాంత్, బీదర్, బండి వెంకటరాం, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## సాధారణ ట్రాఫిక్‌లోనే ప్రయాణించిన సిఎం కాన్వాయ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కాన్వాయ్' సాధారణ ట్రాఫిక్‌లోనే ప్రయాణించింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి జూబ్లీహిల్స్‌లోని తన నివాసం వరకు సిఎం రేవంత్ రెడ్డి కాన్వాయ్ గురువారం సాధారణ ట్రాఫిక్ లోనే వెళ్లింది. తన కాన్వాయ్ కోసం సాధారణ ప్రజలకు ఆటంకం కలిగించొద్దని సిఎం రేవంత్ రెడ్డి డిజిపిని ఆదేశించిన విషయం తెలిసిందే. రోడ్లపైన ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యలను పూర్తిగా నివారించాలని అధికారులకు సిఎం సూచించారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు 'సిఎం కాన్వాయ్' సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయకుండా, ఒకే లైన్‌లో వాహనాలను ప్రయాణించే విధంగా అనుమతి ఇచ్చారు. దీంతో ట్రాఫిక్‌కు ఎటువంటి ఆటంకం లేకుండా సిఎం రేవంత్ రెడ్డి కాన్వాయ్ వెళ్లడం విశేషం.

## తమిళనాడు గవర్నర్ తీరు గర్హనీయం

టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తమిళనాడు ప్రజలు టివికెకు ఇచ్చిన తీర్పును తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అగౌరవపరుస్తూ రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారని, గవర్నర్ తీరు గర్హనీయమని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. రాష్ట్రంలో 108 స్థానాలు గెలిచి అది పెద్ద పార్టీగా నిలిచిన టివికెను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించకపోవడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గవర్నర్ ప్రజాతీర్పును అగౌరవపర్చడం రాజ్యాంగ స్ఫూర్తిని సమాధి చేసినట్లుగా ఉందన్నారు. గవర్నర్ తీసుకుంటున్న నిర్ణయాలు ఢిల్లీలో బిజెపి హైకమాండ్ నుంచి వస్తున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. తమిళనాడులో గవర్నర్ ద్వారా పాలించాలని బిజెపి చూస్తోందని, 59 ఏళ్ల ద్రవిడ పార్టీల పాలనకు ప్రజలు చెక్ పెట్టిన మార్పును అడ్డుకోవడానికి గవర్నర్‌ను ఆయుధంగా వాడుకుంటోందని విమర్శించారు. గవర్నర్ కేరళ పర్యటన పేరుతో మరింత జాప్యం చేయడం యాదృచ్ఛికం కాదని, కుట్ర రాజకీయాల్లో భాగమేనని మహేశ్ కుమార్ పేర్కొన్నారు. విజయ్ రెండుసార్లు లోక్‌భవన్‌కు వెళ్ళినా ఒట్టిచేతులతో తిరిగిరావడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా తమిళనాడు గవర్నర్ ప్రజా తీర్పును గౌరవించి టివికెకు ప్రభుత్వం ఏర్పాటుకు అహ్వానించాలని ఆయన డిమాండ్ చేశారు.

## రిటైర్డ్ డిజిపి శివధర్‌రెడ్డి నియామకంపై స్టే నిరాకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర భద్రతా సలహాదారుగా రిటైర్డు డిజిపి బి. శివధర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అమలుపై స్టే ఇవ్వడానికి తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. ప్రభుత్వ నియామకాల విషయంలో మధ్యంతర జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. హైదరాబాద్‌కు చెందిన ధన్‌గోపాల్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి విచారణ నిర్వహించారు. ప్రకాశ్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలకు విరుద్ధంగా శివధర్‌రెడ్డిని గతంలో డిజిపిగా నియమించారని ప్రధాన పిటిషన్‌లో పేర్కొన్న పిటిషనర్, అనంతరం ఆయనను రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒ నెం.1339ను కూడా సవాలు చేస్తూ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ప్రధాన వ్యాజ్యంపై తుది తీర్పు వెలువడే వరకు శివధర్‌రెడ్డి నియామకానికి సంబంధించిన జిఒ అమలును నిలిపివేయాలని కోర్టును అభ్యర్థించారు. అయితే ఈ అభ్యర్థనను న్యాయమూర్తి తిరస్కరించారు. ప్రభుత్వ పరిపాలనా నిర్ణయాల్లో కోర్టులు అనవసరంగా జోక్యం చేసుకోవని స్పష్టం చేశారు. ఈ కేసు తదుపరి విచారణను జూన్ 26కు వాయిదా వేస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

## అషు రెడ్డి కేసులో స్టేకు తిరస్కృతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెళ్లి పేరుతో లండన్‌లో ఉండే ఎన్‌ఆర్‌ఐ వ్యాపారవేత్త కుటుంబాన్ని మోసం చేశారన్న ఆరోపణలతో నమోదైన కేసులో నటి అషు రెడ్డి, ఆమె తల్లి యశోదరెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించలేదు. తమపై నమోదైన క్రిమినల్ కేసు దర్యాప్తును నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి నిరాకరించింది. ఎపిలోని విశాఖపట్టణానికి చెందిన వెంకట ఆశ్వినిరెడ్డి కొయ్య అలియాస్ అషు రెడ్డి, ఆమె తల్లి కె.యశోదరెడ్డిలపై నగరానికి చెందిన సత్యనారాయణమూర్తి సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. లండన్‌లో నివసిస్తున్న తన కుమారుడు వి. ధర్మేంద్రను పెళ్లి చేసుకుంటానని నమ్మించి రూ.10 కోట్లకు పైగా నగదు తీసుకుని మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ అషు రెడ్డి, యశోద వేసిన పిటిషన్లను జస్టిస్ జె. శ్రీనివాసరావు గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరపు న్యాయవాది, తప్పుడు ఆరోపణలతో కేసు నమోదు చేశారని వాదించారు. విచారణ పూర్తయ్యే వరకు దర్యాప్తును నిలిపివేయాలని, పోలీసులు కఠిన చర్యలు తీసుకోకుండా రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై పోలీసుల తరపు న్యాయవాది వాదిస్తూ, పిటిషనర్లపై వచ్చిన ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఫిర్యాదుదారుడి కుమారుడి నుంచి రూ.10.5 కోట్ల వరకు ఆన్‌లైన్ ద్వారా బదిలీ అయినట్లు ఆధారాలు ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో దర్యాప్తు కొనసాగాల్సిన అవసరం ఉందని, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వవద్దని కోరారు. పోలీసులకు నోటీసులు ఇచ్చిన న్యాయమూర్తి తదుపరి విచారణను జూన్ రెండో వారానికి వాయిదా వేశారు.

## పేద కుటుంబాలకు అండగా ఎన్ఎఫ్‌బిఎస్ పథకం

ప్రజా ప్రభుత్వ ప్రత్యేక దృష్టితో భారీగా పెరిగిన లబ్ధిదారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేద కుటుంబాల్లో ఆర్థిక ఆధారమైన వ్యక్తి మరణించినప్పుడు ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడకుండా ఆదుకోవడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ (ఎన్ఎఫ్‌బిఎస్)కు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. ఈ పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారించడంతో రాష్ట్రంలో భారీ సంఖ్యలో లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందుతోంది. ఈ పథకం కింద కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలో అర్హులైన కుటుంబాలకు ఒకేసారి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. కుటుంబంలో గృహిణిని కూడా బ్రెడ్ విన్నర్‌గా పరిగణించడం ఈ పథకంలోని ముఖ్య ప్రత్యేకతగా నిలుస్తోంది. సహజ మరణం అయినా, ప్రమాద మరణం అయినా బిపిఎల్ కుటుంబాలకు ఈ సాయం వర్తిస్తుంది. గత కొన్నేళ్లలో ఈ పథకం అమలు నిర్లక్ష్యానికి గురైనట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో కేవలం 603 మందికి మాత్రమే సాయం అందగా, 2023–24లో 577 మంది మాత్రమే లబ్ధి పొందారు. అయితే ప్రజా ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తరువాత పరిస్థితి పూర్తిగా మారింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలోనే ఏకంగా 15,420 మంది లబ్ధిదారులకు రూ.30.84 కోట్ల ఆర్థిక సహాయం అందించారు. 2014–15 నుంచి 2024–25 వరకు మొత్తం 20,663 మందికి సాయం అందగా, ఒక్క 2025–26లోనే 15,420 కుటుంబాలకు ప్రయోజనం కలిగింది. తెల్ల రేషన్ కార్డు కలిగిన బిపిఎల్ కుటుంబాలు ఈ పథకానికి అర్హులు. 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఈ సాయం అందుతుంది. మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించారు. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకంలో చేరాలని కోరారు. పేద కుటుంబాలకు కష్టసమయంలో భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి అర్హ కుటుంబానికి ఈ పథకం చేరేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# మరో 10 ఏళ్లలో గ్లోబల్ సిటీగా హైదరాబాద్

'నాస్కామ్ జీసీసీ సమ్మిట్ 2026'లో మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా ఆకర్షించేలా 10 ఏళ్లలో హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పారిశ్రామికాభివృద్ధికి అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. హైదరాబాద్‌లో ఉన్న 'సిలికాన్ డెన్సిటీ (విభిన్న రంగాల నిపుణుల లభ్యత)'ని అందిపుచ్చుకుని 'మేడిన్ తెలంగాణ' బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం ముంబైలో నిర్వహించిన 'నాస్కామ్ జిసిసి సమ్మిట్ 2026'లో 'బియాండ్ పాలసీ డిజైన్డ్ టు విన్ ది గ్లోబల్ జిసిసి రేస్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మహా నగరాల అభివృద్ధిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తోందని వివరించారు. 2047 నాటికి దేశ జిడిపిలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047'కు శ్రీకారం చుట్టామని వివరించారు. ప్రపంచంలోని అనేక నగరాలు అస్తవ్యస్త పట్టణీకరణ వల్ల ' పట్టణం వినాశకర' కోరల్లో చిక్కుకున్నాయని, అలాంటి చారిత్రక తప్పిదాన్ని హైదరాబాద్ విషయంలో తాము చేయాలనుకోవడం లేదన్నారు. అందుకే... భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించే బాధ్యతను తీసుకున్నామన్నారు. ఆ దిశగానే భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, మెట్రో విస్తరణ, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, ఆర్ఆర్ఆర్, మూసీ ప్రక్షాళన, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఐకం ఇన్నోవేషన్ హబ్ తదితర కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామన్నారు. కేవలం టెక్ కంపెనీలే కాకుండా... బ్యాంకింగ్, లైఫ్ సైన్సెస్, సెమీ కండక్టర్లు, రక్షణ రంగం, ఎఫ్ఎంసిజి, స్పేస్ టెక్, ఆతిథ్యం తదితర బహుళ రంగాలకు చెందిన దిగ్గజ సంస్థలు జిసిసిల ఏర్పాటుకు హైదరాబాద్ ను తమ మొదటి ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయన్నారు. గతేడాది 70కి పైగా జిసిసిలు ప్రారంభంకాగా ఈ ఏడాది మరో 100 జిసిసిలను ప్రారంభించి. వాటిల్లో కొత్తగా లక్ష మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాస్కాం ఛైర్మన్ శ్రీకాంత్, ప్రెసిడెంట్ రాజేష్ నంబియార్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు మరో ప్రతిష్టాత్మక కేంద్రంగా నేషనల్ సైన్స్ సెంటర్

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/ఉప్పల్ :** హైదరాబాద్ నగరం ఇప్పటికే రక్షణ, శాస్త్ర సాంకేతిక, ఐటీ, విద్యా రంగాల్లో దేశంలోనే కీలక కేంద్రంగా ఎదిగిందని, ఇప్పటికే అనేక ప్రతిష్టాత్మక కేంద్ర ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా సంస్థలు ఇక్కడ పనిచేస్తున్నాయని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. వాటి సరసన ఇప్పుడు నేషనల్ సైన్స్ సెంటర్ కూడా హైదరాబాద్‌కు రాబోతుందని అన్నారు. హబ్సిగూడలోని సిఎస్ఐఆర్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ) ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న సైన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ పనులను ఎంపీ ఈటల రాజేందర్ తో కలిసి కేంద్ర మంత్రి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నేషనల్ సైన్స్ సెంటర్ హైదరాబాద్‌కు ఒక ల్యాండ్‌మార్క్ కేంద్ర ప్రభుత్వ సంస్థగా నిలవనుందని పేర్కొన్నారు.విద్యార్థులు, యువత, పరిశోధకులు, సైన్స్ అభిరుచి కలిగిన వారికి ఇది ఎంతో ఉపయోగకరంగా మారుతుందని తెలిపారు. శాస్త్రీయ దృక్పథం పెంపొందించడంతో పాటు సైన్స్, టెక్నాలజీ రంగాల్లో ఆవిష్కరణలకు ఈ కేంద్రం వేదికగా నిలుస్తుందని చెప్పారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సహకారంతో హైదరాబాద్‌కు ఈ సెంటర్ మంజూరైందని తెలిపారు. తాను కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తో కలిసి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తుచేశారు. వచ్చే ఏడాది చివరి నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసి హైదరాబాద్ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. అదే విధంగా ఈ నెల 10న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హైదరాబాద్‌కు రానున్నారని, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారని తెలిపారు. భవిష్యత్తులో వరంగల్ ఎయిర్‌పోర్ట్, ములుగు గిరిజన విశ్వవిద్యాలయానికి సంబంధించిన భూమిపూజ కార్యక్రమాలను కూడా ప్రధానమంత్రి చేతుల మీదుగా నిర్వహించే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జనార్దన్ రెడ్డి, సీఎస్ఐఆర్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బేతి సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## చేనేత, హస్తకళల పరిరక్షణ మన అందరి బాధ్యత: మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇందిరా పార్క్ సమీపంలోని ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన 'కాటన్ అండ్ సిల్క్ ఎక్స్‌పో'ను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం, ఆమె వివిధ స్టాళ్లను సందర్శించి చేనేత వస్త్రాలను, గ్రామీణ ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను, గ్రామీణ ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని మంత్రి పిలుపునిచ్చారు. హస్తకళలు, చేతివృత్తులు ఈ దేశ అస్తిత్వానికి, సంస్కృతికి నిలువుటద్దాలని ఆమె అభినందించారు. మన చేతి వృత్తులను కాపాడుకోవడం మనందరి కనీస కర్తవ్యమని గుర్తుచేశారు. చేతివృత్తుల వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని మంత్రి స్పష్టం చేశారు. గ్రామీణ ఉత్పత్తుల విక్రయాల కోసం ఇప్పటికే హైటెక్ సిటీలో 'ఇందిరా మహిళా శక్తి బజార్'ను ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో అన్ని జిల్లాల్లోనూ ఇలాంటి బజార్లను ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. తమ వంతు బాధ్యతగా ప్రతి పౌరుడు స్వదేశీ వస్తువులను, చేతివృత్తుల కళాఖండాలను ప్రోత్సహించాలని కోరారు.



## లెనిన్ విగ్రహ ధ్వంసం ప్రజాస్వామ్యంపై దాడి: వి.ఎస్.బోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ముర్షిదాబాద్‌లో మహా విప్లవ నాయకుడు వ్లాదిమిర్ లెనిన్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ తీవ్రంగా ఖండించారు. బిజెపిదాని అనుబంధ శక్తులు, ఈ దాడికి పాల్పడటం దేశ ప్రజాస్వామ్య చరిత్రపై మరొక మచ్చగా నిలిచిందన్నారు. లెనిన్ విగ్రహంపై దాడి కాదని, ఇది కార్మికకర్షక ప్రజల హక్కుల కోసం సాగిన ప్రపంచ విప్లవ చరిత్రపై దాడి అని ఆయన పేర్కొన్నారు. అ ప్రపంచవ్యాప్తంగా అణగారిన ప్రజలకు, శ్రమజీవులకు ఆశాజ్యోతి అయిన లెనిన్ భావజాలాన్ని విగ్రహాలు కూల్చడం ద్వారా ఎవరూ చెరిపేయలేరన్నారు. దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల, కార్పొరేట్ దోపిడీ, ప్రజాస్వామ్య హక్కుల హరించడం వంటి అసలు సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే మతవాదఫాసిస్టు శక్తులు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నాయన్నారు . విగ్రహాలను ధ్వంసం చేసిన ప్రతిసారి ప్రజల్లో మరింత ప్రతిఘటన, మరింత చైతన్యం పుట్టుకొచ్చిందని ఇది చరిత్ర చెబుతున్న సత్యమని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి,బాధ్యులపై కఠిన చర్య లు తీసుకోవాలనిఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య భారతదేశంలో రాజకీయ భిన్నాభిప్రాయాలను హింసతో అణగదొక్కే ప్రయత్నాలను ప్రజలు ఎప్పటి కీ సహించరన్నారు.ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, సామాజిక న్యాయాన్ని కాపాడే ప్రతి ప్రజాస్వామ్యవాది ఈ ఘటనను ఖండించాలని కోరారు. కార్మిక, యువజన, విద్యార్థి,రైతు శక్తులు ఐక్యంగా నిలబడి ఫాసిస్టు దాడులను తిప్పికొట్టాలన్నారు. విగ్రహాలను కూల్చవచ్చుగాని విప్లవ ఆలోచనలను ఎవరూ ఎప్పటికీ చెరపలేరని బోస్ పేర్కొన్నారు.

## గురుకులాల్లో బోధనకే ప్రాధాన్యం

టీచింగ్ స్టాఫ్ డిప్యూటేషన్లు రద్దు : మంత్రి లక్ష్మ ణ్ కుమార్ ఆదేశాలు



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థ (టిజిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్)లో బోధన వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థుల ప్రయోజనాలను ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ బోధన సిబ్బంది తిరిగి పాఠశాలల్లోనే విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రధాన కార్యాలయంతో పాటు ఇతర విభాగాల్లో ఒడి (డిప్యూటేషన్)పై సుదీర్ఘ కాలం గా విధులు నిర్వహిస్తున్న టీచింగ్ స్టాఫ్ డిప్యూటేషన్లను రద్దు చేస్తూ టిజిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్ కార్యదర్శి శారద గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.ఈ మేరకు వివిధ టీచింగ్ హోదాల్లో పనిచేస్తున్న సుమారు 16 మంది సిబ్బందిని తిరిగి వారి పూర్వ స్థానానికి పంపిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి .గత కొంతకాలంగా గురుకుల విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉండగా, మరోవైపు కొందరు టీచింగ్ సిబ్బంది దీర్ఘకాలంగా ప్రధాన కార్యాలయంలోనే కొనసాగుతున్నారనే అంశంపై ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, పలువురు టీచింగ్ సిబ్బంది మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తక్షణమే మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ తాజా పరిస్థితిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. వెంటనే టీచింగ్ స్టాఫ్ డిప్యూటేషన్ రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ తీసుకున్న నిర్ణయం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థులు తల్లిదండ్రులు యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కీలక నిర్ణయంతో గురుకుల విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల ఫలితాల మెరుగుదల, బోధన వ్యవస్థలో జవాబుదారీతనం పెంచనుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## 'ఆపరేషన్ సింధూర్' భారత శౌర్యానికి నిదర్శనం

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'ఆపరేషన్ సింధూర్' భారత శౌర్యానికి నిదర్శనమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేస్తూ భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఘనంగా సంబురాలు నిర్వహించారు. బిజెపి రిటైర్డ్ ఆర్మీ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాంచందర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఆయన ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు ఘన నివాళులర్పించి, అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ పహల్గాం దాడిలో 26 మంది అమాయక భారతీయ పర్యాటకులను మతం అడిగి చంపిన ఉగ్రవాదులకు బుద్ధి చెప్పేందుకే ఈ ఆపరేషన్ చేపట్టారన్నారు. కేవలం 22 నిమిషాల్లో లష్కర్‌ఎతొయిబా, జైష్‌ఎమహమ్మద్ వంటి ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం విరుచుకుపడి, ఎటువంటి ప్రాణనష్టం లేకుండా ఆపరేషన్‌ను విజయవంతం చేసిందన్నారు. ఉగ్రవాదానికి ఆశ్రయం ఇచ్చే శక్తులకు ఇది గట్టి హెచ్చరిక అన్నారు.

### కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించిన రాంచందర్ రావు..

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌పై బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యక్తిగత దూషణలను బిజెపి తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజం, కానీ బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు హుందాగా మాట్లాడాలన్నారు.

బిజెపి నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తే పార్టీ చూస్తూ ఊరుకోదు అని రాంచందర్ రావు హెచ్చరించారు. వ్యక్తిగత పరువు నష్టం కలిగించేలా ప్రవర్తిస్తే కార్యకర్తలు స్వతహాగా స్పందించే పరిస్థితులు వస్తాయని, హింసను పార్టీ ప్రోత్సహించకపోయినా, ఇలాంటి దాడులను ఎదుర్కోవడానికి వెనకాడబోమన్నారు.

# నార్ముల్ కథ.. కన్నీటి వ్యథ!



**ప్రజాపక్షం/యాదాద్రి :** సరిగ్గా పదేళ్ల క్రితం.. నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పల్లెల్లో తెల్లవారుజామున వినిపించే పాల వ్యాన్ల హారన్ శబ్దం ఒక భరోసా. అప్పట్లో నార్ముల్ అంటే కేవలం ఒక డెయిరీ కాదు, వేలాది మంది పాడి రైతుల ఇంటి మహాలక్ష్మి. కానీ, నేడు అదే డెయిరీ అప్పుల కుప్పగా మారి, మనుగడ కోసం రాష్ట్ర ప్రభుత్వం వైపు దీనంగా చూస్తోంది. మే 4న రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం నార్ముల్ చరిత్రలో ఒక మైలురాయి. జాతీయ డెయిరీ అభివృద్ధి బోర్డుకి 20 ఏళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు అప్పగించడం ద్వారా ఈ సహకార సంస్థకు 'సంజీవని' వేయాలని సర్కార్ నిర్ణయించింది.

### విడిపోయిన నాడే పతనం ప్రారంభం!

నార్ముల్ పతనానికి బీజం 2015లో పడింది. అప్పటి వరకు ఢిల్లీ మదర్ డెయిరీ (ఎన్‌డిడిబి) గొడుగు కింద సురక్షితంగా ఉన్న నార్ముల్, స్వయం ప్రతిపత్తి పేరుతో విడిపోయిన తర్వాత అదుపుతప్పింది. నష్టాల రికార్డు మొదలైంది. వడ్డీల ఉచ్చు బిగించుకుంది. పాల సేకరణ తగ్గిం ది. 2015లో కేవలం రూ.8 కోట్లుగా ఉన్న నష్టాలు, ఏటా పెరుగుతూ 2024–25 నాటికి రూ. 46 కోట్లకు చేరాయి. అప్పు తెచ్చిన ప్రతి పైసాకు నెలకు రూ.40 లక్ష ల వడ్డీ కట్టడమే భారంగా మారింది. దీని ప్రభావం పాడి బిల్లుల చెల్లింపులపై పడటంతో ఒకప్పుడు రోజుకు 1.35 లక్షల లీటర్ల పాలను సేకరించిన నార్ముల్, ప్రస్తుతం 20 వేల లీటర్ల వద్ద ఆగిపోయింది. అంటే దాదాపు 85 శాతం సామర్థ్యం కోల్పోయింది. సంస్థ ఆర్థిక పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, పాడి రైతులకు చెల్లించాల్సిన 15 పాల బిల్లులు (సుమారు ఏడున్నర నెలల సొమ్ము) పెండింగ్‌లో ఉన్నాయి. 'పాలు పోస్తే పైసలు వస్తాయో లేదో తెలీదు.. ప్రైవేటు వాళ్లైతే టైముకు ఇస్తున్నారు' ఇది సగటు పాడి రైతు వేదన. దీని ప్రభావంతో 45,000 మంది రైతులు ఉండగా, ప్రస్తుతం 18,000 మంది మాత్రమే మిగిలారు. చురుగ్గా ఉన్న సంఘాల సంఖ్య 458 నుంచి 278కి పడిపోయింది.

### ఎన్‌డిడిబి ఎంఒయులో కఠిన నిర్ణయాలు

నార్ముల్‌ను తిరిగి గాడిలో పెట్టేందుకు ఎన్‌డిడిబి కఠినమైన నిబంధనలను విధించింది చిట్యాలలోని 29 ఎకరాల భూమిని (మార్కెట్ విలువ రూ.50 కోట్లు) రూ.42 కోట్లకే ఎన్‌డిడిబికి విక్రయించాలని కోరింది. 433 మంది ఉద్యోగుల వేతనాల్లో 30 శాతం కోత విధించనున్నారు. ప్రైవేటు డెయిరీ ల్లో లీటరుకు మెయింటెనెన్స్ ఖర్చు రూ. 56 ఉంటే, నార్ముల్లో రూ.12 ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. ప్లాంట్ వాడుకున్నందుకు ఎన్‌డిడిబి ఏటా రూ.5 కోట్లు చెల్లిస్తుంది. మొదటి రెండేళ్లకు కలిపి రూ. 10 కోట్లు తక్షణమే ఇచ్చేందుకు అంగీకరించింది. పాల సేకరణపై లీటర్‌కు రూ.6.50 పైసలు ఇవ్వడానికి సుముఖంగా ఉన్నది.

### పునర్వైభవం సాధ్యమేనా?

ప్రభుత్వం ఎన్డీడీబీకి బాధ్యతలు అప్పగించడం ద్వారా



రైతుల బకాయిలు తీర్చే అవకాశం ఉంది. కానీ, లీటరుకు రూ.12 అవుతున్న నిర్వహణ ఖర్చును తగ్గించడం, ప్రైవేటు డెయిరీ ల పోటీని తట్టుకోవడం అంత సులభం కాదు. పాడి రైతుల్లో మళ్ళీ నమ్మకాన్ని నింపి, సేకరణను లక్ష లీటర్ల మార్కుకు చేర్చడమే ఎన్‌డిడిబి ముందున్న అతిపెద్ద సవాలు. నల్లగొండరంగారెడ్డి రైతుల ఆశాదీపం నార్ముల్ మళ్ళీ ఎన్‌డిడిబి 'సంజీవని'తో చిగురిస్తుందా? లేదా ప్రభుత్వ ఆధీనంలో ఉన్నా నిర్వహణ లోపాలతో కాలగర్భంలో కలిసిపోతుందా? అనేది వేచి చూడాలి.

**అప్పుల చిట్టా (సుమారు అంచనా)**

| వివరం బకాయి మొత్తం | (రూ. కోట్లలో) |
| --- | --- |
| పాడి రైతులకు బకాయిలు | 31.00 |
| బ్యాంకుల రుణాలు | 26.00 |
| ఉద్యోగుల జీతాలు | 5.00 |
| కొనుగోలు సంస్థల బకాయిలు | 5.50 |
| ప్రగతి డెయిరీ అడ్వాన్స్ | 4.00 |
| ఎన్డీడీబీ పాత అప్పు | 1.00 |
| మొత్తం | 72.50 |



## రైతులు సోలార్ విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో సోలార్ విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేసుకుని విద్యుత్ వాడకాన్ని తగ్గించుకోవాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం శామీర్‌పేట మండలం అలియాబాద్ రైతు వేదికలో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా పిఎం కుసుమ్ ప్రాజెక్ట్‌లో పథకంద్వారా సౌర విద్యుత్ కేంద్రాన్ని ప్రారంభించారు. సౌర విద్యుత్ కేంద్రాల వలన కలిగే లాభాలను వివరించారు. సౌర విద్యుత్‌పై డెమో రూపంలో చూపించారు. అనంతరం ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ రైతులు కరెంట్ వాడకాన్ని తగ్గించి సౌర విద్యుత్ వాడకంతో వ్యవసాయ పొలాల్లో పంటలు పండించాలని సూచించారు. కాలుష్య నివారణకు సౌర విద్యుత్ కేంద్రాలు దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి, జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఐలయ్య, ఎంపిటి డైరెక్టర్ బిక్షపతి, కౌన్సిలర్లు జశ్వంత్‌రెడ్డి,జి వెంకటేష్, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, ట్రాన్స్‌కో ఎస్ఇ కరుణాకర్, డిఇ రాజు జాన్, ఎడిఇ అశోక్ రావు, విద్యుత్ ఏఇ వెంకటనారాయణ,మండల వ్యవసాయాధికారి రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు,తదితరులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్

**ప్రజాపక్షం/దుండిగల్ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా దుండిగల్ సర్కిల్ పరిధిలో చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎన్.వెంకట మణి కరణ్ పరిశీలించారు. ఈ రోజు కార్యక్రమంలో భాగంగా దుండిగల్ సర్కిల్‌లో ఉన్న ట్రీ పార్క్‌ల వద్ద కంపోస్ట్ పిట్‌లను ఏర్పాటు చేశారు. అనంతరం దుండిగల్ తండాలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను ఆయన పరిశీలించారు. తడి చెత్తను కంపోస్టింగ్ విధానంలో నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా కమర్షియల్ షాపులు, హోటళ్ల వద్ద తప్పనిసరిగా డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ నిబంధనలు పాటించని వారికి నో బిన్ నో లైసెన్స్ విధానం అమలు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్రతి ఇంటి నుండి వచ్చే చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, రోడ్ల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని, చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అలాగే రోడ్ల పక్కన ఉన్న వ్యర్థాలను వెంటనే తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ ఇంజినీర్ అన్వేష్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్ అశోక్ కుమార్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ పి. సాత్విక్, సిబ్బంది పాల్గొన్నారు.

## మైనారిటీ విద్యార్థులకు సివిల్స్ పరీక్షల ఉచిత కోచింగ్, వసతి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ 2027 పోటీ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీ విద్యార్థులకు హైదరాబాద్ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సిలింగ్ ద్వారా ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నామని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి కాంతమ్మ తెలిపారు. అధునిక సౌకర్యాలతో కూడిన తరగతి గదులు, అనుభవజ్ఞులైన శిక్షకులు, గ్రంథాలయం, ఇంటర్నెట్, వైఫై లాంటి పలు సదుపాయాలతో పాటు అభ్యర్థులకు ఉచిత వసతి సౌకర్యం కల్పించనున్నారు. తమ ధరఖాస్తులను https://cet.cgg. gov.in/tmreis ద్వారా డౌన్‌లోడ్ చేసి పూర్తిచేసి తమ కార్యాలయం లో ఈ నెల 31లోగా జిల్లా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తులను జూన్ 14 (ఆదివారం) స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి ఆ ఫలితాల మెరిట్ ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. క్రైస్తవ, ముస్లిం, సిక్కు, జైన్, బౌద్ధ, పార్శీ మైనారిటీ కమ్యూనిటీలకు చెందిన అభ్యర్థులు జనరల్ లేదా ప్రొఫెషనల్ డిగ్రీ చేసిన వారు అర్హులని, మిగతా వివరాలకు తమ కార్యాలయంలో 040 23236112 ద్వారా పనిదినాల్లో ప్రతి రోజు ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల లోపు తెల్సుకోవచ్చన్నారు.



## సౌరవిద్యుత్‌పై అవగాహన సదస్సు

**ప్రజాపక్ష/పూడూర్:** పరిగి నియోజకవర్గంలోని పూడూర్ మండలంలోని రైతు వేదికల్లో వ్యవసాయ యాంత్రీకరణ, సౌరవిద్యుత్ అంశాలమీద అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పరిగి ఎడిఎ శంకర్‌రాథోడ్ మాట్లాడుతూ వ్యవసాయశాఖలోని యాంత్రీకరణ పథకం గురించి వివిధ రకాల పనిముట్లు, డ్రోన్ గురించి వివరించడం జరిగింది. విద్యుత్‌శాఖ తరుపున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా తీసుకు వస్తున్న పిఎం కుసుమ్ పథకంపై విద్యుత్ ఏఇఇ రాజు నాయక్, ఎడిఇ వెంకట్ నాయుడు వివరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పూడూర్ సర్పంచ్ ఖైజర్ పాషా, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చందు మహారాజ్‌కు ఘన నివాళులు

**ప్రజాపక్షం/తాండూరు:** చందు మహారాజ్ వర్ధంతిని పురస్కరించుకుని విలేమూర్ చౌరస్తాలో చందు మహారాజ్ విగ్రహం వద్ద పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాతుల నాగరాజు ఆధ్వర్యాన నిర్వహించిన వర్ధంతి వేడుకలకు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజాబాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# రెసోనెన్స్ కళాశాలల అక్రమాలపై ఎఐవైఎఫ్ ఆందోళన

**ప్రజాపక్షం/ఉప్పల్:**హబ్సిగూడలోని రిసోనెన్స్ జూనియర్ కళాశాల ఎదుట ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇంటర్ బోర్డు బంధనలకు విరుద్ధంగా వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ కార్యకర్తలు ధర్నా చేపట్టి అక్రమ తరగతులను బహిష్కరించి విద్యార్థులను బయటకు పంపించారు. కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటర్ బోర్డు నిబంధనలను ఉల్లంఘిస్తూ రిసోనెన్స్ జూనియర్ కళాశాలలు అక్రమంగా తరగతులు నిర్వహిస్తున్నాయని ఆరోపిస్తూ ఎఐవైఎఫ్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర



మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి విద్యా వ్యవస్థను వ్యాపారంగా మార్చుతున్నారని మండిపడ్డారు. బోర్డు అనుమతి లేకుండా అడ్మిషన్లు చేపట్టడం, వేసవి సెలవుల్లో క్లాసులు నిర్వహించడం, విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి తీసుకురావడం, ఫీజుల దోపిడీ, భద్రత, మౌలిక వసతుల లోపాలు వంటి అంశాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు మార్గదర్శకాలు, తెలంగాణ విద్యాశాఖ నిబంధనలను కళాశాల యాజమాన్యం ఉల్లంఘిస్తోందని ఆరోపించారు.

రిసోనెన్స్ జూనియర్ కళాశాలలపై తక్షణ మే సమగ్ర తనిఖీలు నిర్వహించి, అక్రమంగా నడుస్తున్న బ్రాంచ్‌లను సీజ్ చేయాలని, బాధ్యులపై క్రిమినల్ కేసు లు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఫీజు ల దోపిడీపై విచారణ జరిపి బాధిత విద్యార్థుల కు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సల్మాన్ బేగ్, కార్యదర్శి టి.సత్య ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, ప్రదీప్, అజీమ్, కిరణ్, భరత్, నదీమ్, ముస్తఫా,తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం

### మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నా రు. గురువారం శామీర్‌పేట మండల కేంద్రం సొసైటీలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి ప్రారంభించారు. అలాగే అలియాబాద్, జగ్గంగూడ, కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాల్లో మల్లారెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అమలుపరుస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గన్నీ బ్యాగులను అందజేయాలని, టోకెన్లను వెంటనే ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి, మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి, సోసైటి వైస్ చైర్మన్ ఐలయ్య, డైరక్టర్లు, మాజి ఎంపిపి ఎల్లుబాయిబాబు, కౌన్సిలర్లు, కట్టమైసమ్మ చైర్మన్ భూమిరెడ్డి, మాజి సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసి పారుపల్లి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



**ఎమ్మెల్యేని కలువనివ్వారా..? :** కాగా ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించడానికి లక్ష్మాపూర్‌కు వచ్చిన మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని స్థానిక నాయకులు కలువనివ్వడంలేదని మూడు చింతలపల్లి మండల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మా బాధలను ఎమ్మెల్యేకు చెప్పుకుందామంటే చుట్టుముట్టు ఎప్పుడు నాయకులే ఉంటున్నారని కనీసం మా నాయకుడిని కలిసి సమస్యలు చెప్పుకునే అవకాశం లేకుండా స్థానిక నాయకులు చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. ఇట్టి విషయమై బిఆర్‌ఎస్ నాయకులకు, రైతులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మల్లారెడ్డి కల్పించుకుని రైతులతో మాట్లాడారు. ఏ గ్రామానికి వెళ్తే ఆ ప్రజ లు, నాయకులతోనే మాట్లాడుతానని చెప్పారు. దీంతో రైతులు శాంతించి ఎమ్మెల్యేతో మాట్లాడారు.

# 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో రైతు వారోత్సవ సభ

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం నవాబుపేట మండల కేంద్రంలో రైతు వేదికలో రైతు వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి జ్యోతి మాట్లాడుతూ, రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపిక, నీటి వినియోగంలో జాగ్రత్తలు, సేంద్రీయ ఎరువుల వినియోగం, పురుగుమందుల సమతుల్య వాడకం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. రైతు భరోసా, పంట బీమా, వ్యవసాయ యంత్రాల సబ్సిడీలు, నాణ్యమైన విత్తనాల పంపిణీ వంటి పథకాలను



సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా 2019 వరకు భూమి పట్ట చేసుకున్నవారికి మాత్రమే పిఎం కిసాన్ వస్తుంది. అలాంటి వారు ఇంకా ఎవరైనా ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని అన్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ శాస్త్రీయ విధానాలను పాటిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జి. నర్సింహారెడ్డి, అత్తాపూర్ గ్రామ సర్పంచ్ సంతోష్ రెడ్డి, తిమ్మారెడ్డి పల్లి సర్పంచ్ ప్రభాకర్,గుబ్బడి ఫత్తేపూర్ గ్రామ సర్పంచ్ సామయ్య, విద్యుత్ అధికారులు, వ్యవసాయ అధికారులు, నాయకులు వివిధగ్రామాల ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, రైతు సమితి సభ్యులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# రైతులను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### తాండూరు ఎఎంసి చైర్మన్ పట్లోళ్ల నర్సిములు

**ప్రజాపక్షం/తాండూరు:** రైతులను అన్ని విధాలుగా ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సిములు అన్నారు. స్థానిక ఎంఎల్‌ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రమైన యాలాలలో ఐకెపి ఆధ్వర్యాన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎఎంసి చైర్మన్ పట్లోళ్ల నర్సిములు, స్థానిక సర్పంచ్ సిహెచ్ శివయ్య స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజి కోఆప్షన్ మెంబర్ అక్బర్‌బాబ, ఉపసర్పంచ్ మల్కిరెడ్డి సోభరాజురెడ్డి, యాలాల మండల పార్టీ అధ్యక్షులు మహిపాల్, తదితరులు, పాల్గొన్నారు.

# జాబితాలో ప్రతి ఒక్కరి ఓటు ఉండేలా నాయకులు అప్రమత్తతతో పనిచేయాలి

### బిఆర్‌ఎస్ ఎల్‌పి విప్ కెపి వివేకానంద



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** ఓటరు జాబితాలో ప్రతిఒక్కరి ఓటు ఉండేలా నాయకులు, బిఎల్‌ఎలు అప్రమత్తతతో పనిచేయాలని బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద సూచించారు. కుత్బుల్లాపూర్ డివిజన్ మాణిక్య నగర్ కమిటీ హాల్‌లో, జీడిమెట్ల డివిజన్ ఎంఎన్ రెడ్డి నగర్ కమిటీ హాల్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద పాల్గొని మాట్లాడుతూ ఎస్‌ఐఆర్ కార్యక్రమం నిర్వహణ, ప్రాముఖ్యత పాటించాల్సిన నియమ, నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల పై నాయకులకు దిశానిర్దేశం చేశారు. పారదర్శకత, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందేలా ప్రతి నాయకుడు, బిఎల్‌ఎలు పనిచేయాలని, 2002 జనాభా ప్రాతిపదికన ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఎస్‌ఐఆర్ కార్యక్రమంలో నిజమైన ఓటర్లను గుర్తించడంతో పాటు డూప్లికేట్ ఓట్లు, పర్మినెంట్ మైగ్రేటెడ్ ఓట్లు, అసలు మనుషులులేని పేర్లతో ఉన్న ఓట్లను గుర్తించడం, కుటుంబ సభ్యుల ఓట్లను మ్యాపింగ్ చేయడం, కొత్త ఓటర్లను చేర్చడం, ఇంకా ఏమైనా చేర్పులు, మార్పులు ఉంటే వాటిని సరిదిద్దేలా నాయకులు, బిఎల్‌ఎలు, సంక్షేమ సంఘాల నాయకులు, సీనియర్ సిటిజన్స్, యువత ఒక బాధ్యతగా తీసుకుని ప్రజలను చైతన్య పరుస్తూ అధికారులను సమన్వయ పరుచుకుంటూ ఎస్‌ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగ పరుచుకునేలా పనిచేయాలని సూచించారు. రానున్న రోజుల్లో బిఆర్‌ఎస్ అధినేత కేసిఆర్ నాయకత్వంలో పార్టీ బలోపేతం కోసం చేపట్టనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం, నూతన కమిటీల నియామకంతో పాటు పార్టీ పటిష్టతకు మరింతగా ప్రజల్లోకి ఎలా దూసుకువెళ్లాలి అనే, తీసుకోవాల్సిన కార్యాచరణను వివరించారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఘనంగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వార్షికోత్సవ వేడుకలు...**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జీడిమెట్ల గ్రామంలోని శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, మాతా గోవిందమాంబ, శ్రీ విరాట్ విశ్వకర్మ గాయత్రి కాశీ విశ్వేశ్వర స్వామి విశాలాక్షి దేవాలయ చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వివేక్ మాట్లాడుతూ ఆ బ్రహ్మంగారి బోధనలు, సూచనలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని, ఆయన ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.





# వైన్ షాపుల ముందు వాహనాల జాతర

- నరక యాతన పడుతున్న బాటసారులు
- చర్యలు తీసుకోవాలని సిపిఐ డిమాండ్

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** జవహర్ నగర్ పరిధిలోని బాలాజీ వైన్స్ లిక్కర్ మార్ట్ ఎదుట ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సి.పి.ఐ.) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం నాడు మేడ్చల్ జిల్లా సిపిఐ ఇంచార్జి తోటపెల్లి శంకర్ ఆధ్వర్యంలో జవహర్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సి.ఐ.శివ శంకర్ కు పార్టీ ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. వైన్ షాపులకు వచ్చే వారు తమ వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపైనే నిలుపుతుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రోడ్డుపై వాహనాలు నిలపడం వల్ల అటుగా వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు నిలిచిపోతున్నాయి. ముఖ్యంగా పాదచారులు నడవడానికి కూడా వీలు లేకుండా ఇబ్బందులు పడుతున్నారని నేతలు వివరించారు. జవహర్ నగర్ పోలీసులు ట్రాఫిక్



నిర్వహణ బాగానే చేస్తున్నప్పటికీ, ఈ నిర్దిష్ట ప్రాంతాల్లో వైన్ షాపుల యాజమాన్యాల నిర్లక్ష్యం వల్ల ప్రజలు అవస్థలు పడుతున్నారని వారు దృష్టికి తీసుకెళ్లారు. వైన్ షాపుల యాజమాన్యాలు పార్కింగ్ సౌకర్యం కల్పించకుండా రోడ్లను ఆక్రమించడం చట్టవిరుద్ధం. తక్షణమే పోలీసులు స్పందించి సదరు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, మేడ్చల్ జిల్లా సీపీఐ ఇంచార్జి తోటపల్లి శంకర్ విన్నపం చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూప నాయక్, గిరి ప్రసాద్ నగర్ శాఖ కార్యదర్శి కొండా సత్యం సాగర్, ఏఐటియుసి నాయకులు అంబాల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## డయాబెటిస్‌తో అల్జీమర్స్‌పై పరిశోధనకు డాక్టరేట్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో పోచారం డివిజన్ వెంకటాపూర్‌లో ఉన్న అనురాగ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మసీకి చెందిన పరిశోధక విద్యార్థిని సయ్యద్ జబీన్ ఫాతిమా డాక్టరేట్ పట్టా సాధించారు. ఫార్మకాలజీ విభాగంలో డాక్టర్ దేవరకొండ కృష్ణ ప్రసాద్ మార్గదర్శకత్వంలో ఆమె డయాబెటిస్‌తో అనుబంధమైన అల్జీమర్స్ వ్యాధిలో టార్గెట్ బేస్డ్ అప్రోచ్ ద్వారా ఫైటోకానిస్టిట్యువెంట్స్ యొక్క న్యూరోప్రొటెక్టివ్ క్రియాశీలత అనే అంశంపై పరిశోధన నిర్వహించారు. ఈ పరిశోధనకు గాను ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు. 2026 మే 7న నిర్వహించిన వైవా వో సే కార్యక్రమంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ సాయి బాలాజీ అడుగులపాటి పాల్గొన్నారు. స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ వసుధా బక్షి, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎగ్జామినేషన్స్ ముత్తారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సికిందర్ బాబా, కళాశాల అధ్యాపకులు హాజరై జబీన్ ఫాతిమాను అభినందించారు.

## రోడ్డు ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం : సిఐ శివశంకర్

**ప్రజాపక్షం/జవహర్ నగర్:** ట్రాఫిక్ నియమాలు పాటించి సురక్షిత ప్రయాణం సాగించాలని, ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరి ధరించాలని జవహర్ నగర్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ పిలుపునిచ్చారు. జవహర్ నగర్ ట్రాఫిక్ పోలీస్టేషన్ పరిధిలోని కీసర మహాత్మ జ్యోతిరావుపూలే పాఠశాలలో ఎన్‌సిసి క్యాడెట్లతో ట్రాఫిక్ నియమాలు, రహదారి భద్రతపై గురువారం మల్కాజిగిరి భద్రతా మండలి సిబ్బంది, ఆర్మీ అధికారుల సమన్వయంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ట్రాఫిక్ సిఐ శివశంకర్ హాజరై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నిత్యం పెరిగిపోతున్నాయని, అవగాహనతోనే నివారణ చేయవచ్చని, రోడ్డు ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఎన్‌సిసి క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తుందని, ఉన్నతమైన భవిష్యత్తుకు మార్గం చూపిస్తుందని అన్నారు. ట్రాఫిక్ జంక్షన్ వద్ద అప్రమత్తతతో ప్రయాణం చేయాలని, తొందరపడి వెళితే ప్రమాదాలు పొంచే ఉంటాయని పేర్కొన్నారు. కుటుంబానికి రక్షణగా నిలవాల్సినవారే, ప్రమాదంలో చనిపోతే కుటుంబం రోడ్డున పడుతుందని, ప్రమాదాల నివారణే శ్రీరామ రక్ష అని తెలిపారు. రోడ్డు భద్రతా అంశాలపై ఎన్‌సిసి క్యాడెట్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు సిబ్బంది, ఎన్‌సిసి క్యాడెట్లు, తదితరులు పాల్గొన్నారు.

# నివాస అనుమతులు... వాణిజ్య నిర్మాణాలు

- చోద్యం చూస్తున్న ఎంఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు
- నోటీసులతో మమా
- మామూళ్ల మత్తులో గాలికి వదిలేస్తున్న ఫిర్యాదులు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** నివాస గృహాల కు తీసుకొన్న అనుమతులు భిన్నంగా నిబంధనలను కాలరాస్తూ ఆరంభం నుండి వాణిజ్య అవసరాలకు అనుగుణంగా కళ్లెదుటే నిర్మాణాలు కొనసాగుతున్నా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇలాంటి అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా చేపడుతున్నాయంటూ స్థానికులు ఇస్తున్న ఫిర్యాదులను ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్మాణాలు చేస్తున్న వారితో కుమ్మక్కైన సంబంధిత సర్కిల్ కార్యాలయాలకు చెందిన టౌన్ ప్లానింగ్ అధికారులతో పాటు ఉన్నతాధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నోటీసులిస్తాం, చర్యలు తీసుకొంటామంటూ చెబుతుండటంపట్ల పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. మౌలాలి, కాప్రా, మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయ పరిధుల్లో ఇటీవలి కాలంగా పలుచోట్ల రెసిడెన్షియల్ పేరిట అనుమతులు తీసుకొంటూ విద్యాసంస్థలు, బ్యాంకులు, సూపర్‌బజార్లు, జిమ్‌ల్లాంటి వాణిజ్యాలు చేసే వారితో భూయజమానులు ముందుగానే అద్దెకిస్తామంటూ ఒప్పందాలు చేసుకొని వారి అవసరాలకు అనుగుణంగా వాణిజ్యపరంగా నిర్మాణాలు చేస్తున్నారు. ఎంఎంసి కార్యాలయ టౌన్‌ప్లానింగ్ అధికారులు జారీ చేసిన అనుమతి పత్రాల్లో మాత్రం వీటికి రెసిడెన్షియల్ అని ఉంటుండగా వాస్తవానికి మాత్రం దానికి విరుద్దంగా నిర్మాణ పనులు మాత్రం ఆరంభం నుండి కొనసాగిస్తుండటం, నిత్యం ఆ ప్రాంతం మీదుగా పర్యవేక్షించే టౌన్ ప్లానింగ్ అధికారులు నిబంధనలను కాలరా




స్తున్నారన్న విషయం కళ్లెదుటే కనపడుతున్నా చేతికందినంతగా మామూళ్లు తీసుకొంటూ చూడనట్లే ఉంటూ నిర్మాణాలు పూర్తయ్యే వరకు సహకారం అందిస్తున్నారు. ఈ మధ్య కాలంలో అలాంటి నిర్మాణాలపై ఎవరైనా ఫిర్యాదులు చేస్తే తమకు ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, తనిఖీలు చేసి నోటీసులిచ్చి చర్యలు తీసుకొంటామని చెప్పి ఆ యజమానుల వద్దకు వెళ్లి మరింత దండుకొంటున్నారే తప్ప చర్యలు మాత్రం తీసుకోవటం లేదన్న విషయం బహిరంగ రహస్యం. మౌలాలి సర్కిల్ పరిధిలోని మూడుగుళ్ల ప్రాంత సమీపంలోని 100 అడుగుల రహదారిపై పక్కన నివాస గృహానికి తీసుకొన్న అనుమతులతో సదరు యజమాని ఓ విద్యాసంస్థకు అద్దెకివ్వటానికి ఒప్పందం చేసుకొని వారికి అనుగుణంగా తీసుకొన్న అనుమతులను తుంగలోకి తొక్కి వాణిజ్య పరంగా నిర్మాణం కొనసాగిస్తున్నారు. ఈ ప్రాంత సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, సెక్షన్ అధికారి సంగీత సదరు యజమానికి పూర్తి మద్దతిస్తున్నట్లు స్థానికులు చెప్పుకొంటున్నారు. ఈ విషయమై టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా సదరు నిర్మాణానికి నివాస గృహానికి మాత్రమే అనుమతులున్నాయని, సెట్‌బ్యాక్‌లు లేవన్న విషయాన్ని ఇప్పుడే గుర్తించామని, వాణిజ్య పరంగా నిర్మాణం జరిగితే చర్యలు తీసుకొంటామని చెప్పారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
శుక్రవారం
08-05-2026
www.prajapaksham.in

“వెర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, దర్శకుడు శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో, కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న చిత్రం 'సెయాన్'. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన అమరన్ తర్వాత శివకార్తికేయన్ మరోసారి రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్‌తో కొలాబరేట్ కావడం విశేషం.”

రీల్



## 'సెయాన్'లో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే

వెర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, దర్శకుడు శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో, కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న చిత్రం 'సెయాన్'. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన అమరన్ తర్వాత శివకార్తికేయన్ మరోసారి రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్‌తో కొలాబరేట్ కావడం విశేషం. రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్.. ట్రెడిషన్, డివైన్ వైబ్ మేళవింపుగా ఆకట్టుకుంటోంది. గాజుల షాప్ బ్యాక్‌డ్రాప్‌లో ఆమె కనిపించిన తీరు పాత్రలోని ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. మురుగన్ స్వామి ప్రతీకను గుర్తు చేస్తూ ఆమె కూర్చున్న తీరు మరింత ఆసక్తిని పెంచింది. రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, శివకార్తికేయన్, ప్రముఖ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ కలిసి పనిచేస్తున్న తొలి సినిమా కావడం ఈ ప్రాజెక్టుకు మరో ప్రత్యేకగా నిలిచింది. తన ప్రత్యేకమైన మ్యూజికల్ స్టైల్‌తో, చార్ట్‌బస్టర్ ఆల్బమ్స్‌తో పేరుగాంచిన సంతోష్ నారాయణన్ సంగీతం ఈ చిత్రానికి స్పెషల్ ఎట్రాక్షన్ కానుంది.

## 'ఆపరేషన్ అరుణారెడ్డి' సినిమాకు రాజకీయాలతో సంబంధం లేదు

పోసాని కృష్ణమురళి



ప్రముఖ రచయిత, నటుడు పోసాని కృష్ణమురళి నిర్మిస్తూ, దర్శకత్వం వహిస్తూ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'ఆపరేషన్ అరుణారెడ్డి'. ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, మాటలు, పాటలు, ఎడిటింగ్ బాధ్యతలు కూడా పోసాని కృష్ణమురళి వహిస్తుండటం విశేషం. హిందోళ చక్రవర్తి, కాజల్ శర్మ, ఆయేషా ఖాన్, బిజెపి నేత రఘునందన్ రావు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈరోజు హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో 'ఆపరేషన్ అరుణారెడ్డి' చిత్ర విశేషాలు తెలిపారు దర్శక నిర్మాత నటుడు పోసాని కృష్ణమురళి. ఈ కార్యక్రమంలో నటుడు, దర్శక, నిర్మాత పోసాని కృష్ణమురళి మాట్లాడుతూ ఇది నిజాయితీపరులైన జర్నలిస్టుల కథ. జర్నలిస్టులు నిజాయితీగా ఉంటే సొసైటీ బాగుపడుతుంది అనేది ఈ చిత్ర కథాంశం. హిందోళ చక్రవర్తి అరుణారెడ్డి అనే జర్నలిస్ట్ క్యారెక్టర్‌లో నటిస్తోంది. ఆమెది లీడ్ రోల్. రాజకీయాల్లోకి ప్రజాసేవ కోసం ఎవరు వచ్చారో, వ్యాపారం కోసం ఎవరు వచ్చారో ఆమె పాత్ర ప్రజల్ని హెచ్చరిస్తుంది. ఆ జర్నలిస్టు చేసిన హెచ్చరికలతో ప్రజలు ఎలా అప్రమత్తమయ్యారు, రాజకీయ నాయకుల ఎంపికలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు అనేది ఈ చిత్రంలో ఆసక్తికరంగా తెరకెక్కించాం. ఉన్నది ఉన్నట్లు మాట్లాడేవారు సమాజంలో ఉండకూడదు అనుకుంటారు చాలామంది. ఇలాంటి మంచి జర్నలిస్టు కొందరు చేసిన రాజకీయాలకు రోడ్డున పడే పరిస్థితి వస్తే ఒక మంచి ముఖ్యమంత్రి ఆమెకు హెల్ప్ చేస్తాడు. ఇలాంటి అమ్మాయి జర్నలిజంలో ఉండాలని అండగా నిలబడతాడు. ఆ సీఎం పాత్రలో ఎంపి రఘునందన్ రావు గారు నటించారు. ఆయనకు థ్యాంక్స్ చెబుతున్నా. ఈ సినిమాకు పాలిటిక్స్‌కు ఎలాంటి సంబంధం లేదు. వందశాతం సిన్సియర్‌గా చేసిన సినిమా ఇది. ఆపరేషన్ అరుణారెడ్డి మూవీ స్క్రీన్ ప్లే..ఇండియాలోనే ఒక బెస్ట్ స్క్రీన్ ప్లే అవుతుందని గర్వంగా చెప్పగలను. నా కెరీర్‌లో కూడా ఇది బెస్ట్ స్క్రీన్ ప్లేగా పేరు తెచ్చుకుంటుంది. సినిమా ప్రారంభం నుంచి చివరి దాకా ఏం జరుగుతుందో ఊహించలేరు. ఈ సినిమా ప్రజలకు బాగా నచ్చుతుందని నమ్ముతున్నా. అన్ని వర్గాల ప్రేక్షకులు భయం లేకుండా ఈ సినిమాను చూడొచ్చు. తెలుగుదేశం, వైసిపి, కాంగ్రెస్, జనసేన, బిజెపి, కమ్యూనిస్ట్ పార్టీలు..ఇలా అందరూ ఈ చిత్రాన్ని చూడొచ్చు. వాళ్లందరికీ నచ్చే చిత్రమిది. వంద చిత్రాలకు కథా స్క్రీన్ ప్లే రాసిన అనుభవం నాకుంది. అలాగే ఎడిటింగ్ అంటే ఇష్టం. నేను ఏం చేయగలనో అదే ఈ చిత్రంలో చేశాను. రఘునందన్ రావు అంటే నాకు ఇష్టం. నేనంటే ఆయనకు అభిమానం. ఈ చిత్రంలో సీఎం పాత్ర ఆయన చేస్తే బాగుంటుందని అనిపించింది. రఘునందన్ రావు గారు కూడా కథ విని బాగుంది మురళి నేను చేస్తా అన్నారు. ఈ సినిమాతో ఆయనకు ఇంతే సంబంధం. ఈ సినిమాలో ఒక్క బూతు గానీ, ఒక్క అసభ్యమైన సన్నివేశం గానీ ఉండదు. తమిళనాట విజయ్ లాంటి మంచి వ్యక్తి గెలవడం సంతోషంగా ఉంది. అతన్ని డిఎంకె, ఎన్నాడిఎంకె లాంటి పార్టీలు అనవసరంగా టార్గెట్ చేస్తున్నాయి. రాజకీయంగా బెటర్ అనుకున్న వారికి సపోర్ట్ చేశానని చెప్పారు.

## అడ్వెంచర్ చేస్తున్న




'శంబాల' బ్లాక్ బస్టర్ తరువాత దర్శకుడు యుగంధర్ ముని సందీప్ కిషన్‌తో ఓ ప్రాజెక్ట్ చేయబోతోన్న సంగతి తెలిసిందే. ఈ మూవీని షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్ అందరిలోనూ ఇంట్రెస్ట్ క్రియేట్ చేసింది. అడివికి రాజైన సింహం, తోడేలు మధ్య జరిగే పోటీలా ఈ సినిమాలో అడ్వంచర్స్ ఉంటుంది. ఇప్పుడు సందీప్ కిషన్ బర్త్ డే సందర్భంగా మరో పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లోని ఓ బిడ్డ, ఖడ్గం, సింహం ఇవన్నీ చూస్తుంటే ఇదొక ఫారెస్ట్ అడ్వంచర్ చిత్రం అని అర్థం అవుతోంది. ఇక ఇందులో సింహంలాంటి యోధుడిగా సందీప్ కిషన్ కనిపిస్తాడని తెలుస్తోంది. ఏ లెజెండ్ ఈజ్ బార్న్ అంటూ వదిలిన ఈ పోస్టర్ ఆడియెన్స్‌లో ఒక్కసారిగా అంచాలను రెట్టింపు చేసింది. ఈ ఫాంటసీ అడ్వంచర్‌ను తెలుగు, హిందీ, తమిళ భాషల్లో రిలీజ్ చేయనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆగస్ట్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అవుతుంది



## 'దేత్తడి' సెకండ్ షూటింగ్ షెడ్యూల్ షురూ

రాడీ బాయ్స్, లవ్ మీ సినిమాలతో పాపులరైన యంగ్ ట్యాలెంటెడ్ ఆశిష్ హీరోగా, నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'దేత్తడి'. ఈ సినిమాతో దర్శకుడిగా ఆదిత్య రావు గంగసాని పరిచయం అవుతున్నారు. హైదరాబాద్ కల్చర్ బ్యాక్‌డ్రాప్‌లో కొత్త స్టోరీని ప్రజెంట్ చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్, గ్లింప్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా సెకండ షూటింగ్ షెడ్యూల్ ప్రారంభించారు. ఆశిష్‌తో పాటు కీలక నటీనటులు ఈ షెడ్యూల్ లో పాల్గొంటున్నారు. దేత్తడి సినిమాలో హై ఎమోషన్‌తో పాటు కొత్తగా చూపించే కల్చరర్ బ్యాక్‌డ్రాప్ స్టోరీ ఉండబోతోంది. ఆశిష్ పూర్తిగా మాస్ లుక్‌లో కనిపించడమే కాకుండా, ఒరిజినల్ హైదరాబాద్ స్లాంగ్‌లో డైలాగ్స్ చెప్పబోతున్నారు. ఈ సినిమాకు మ్యూజిక్ జునైద్ కుమార్ అందిస్తున్నారు. ప్రసన్న కుమార్ బెజవాడ స్క్రీన్‌ప్లే, డైలాగ్స్‌తో పాటు క్రియేటివ్ హెడ్‌గా కూడా పని చేస్తున్నారు.

## 'అగధ' టీజర్ విడుదల



ఎం. ఎస్. రాజు రచన, దర్శకత్వంలో శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు 'అగధ' చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో ఏకకాలంలో భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్, సిజ్జు, రోషన్, శ్రేయ రాణి రెడ్డి తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. తాజాగా గురువారం నాడు ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ఎం. ఎస్. రాజు మాట్లాడుతూ 'ఫిల్మ్ మేకర్స్‌గా మాకెన్నో కలలుంటాయి. నా కలలకు తగ్గట్టుగా నేను ఎన్నో చిత్రాలను తీశాను. మా టీజర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను. నేను నమ్ముకున్న అమ్మవారి ఆశీస్సులతో ఈ చిత్రం పెద్ద విజయం సాధిస్తుందని అనుకుంటున్నాను. టెక్నీషియన్‌ల పనితనం, ఆర్టిస్టుల వర్క్ ఎలా ఉండబోతోందో టీజర్ చూస్తేనే అర్థమై ఉంటుంది అని అన్నారు. నిర్మాత కాశీ విశాలాక్షి బలుసు మాట్లాడుతూ 'అగధ' టీజర్ లాంచ్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా అన్న ఎం.ఎస్. రాజు వల్లే సినిమా నిర్మాణంలోకి వచ్చాను అని చెప్పారు. కామాక్షి భాస్కర్ల మాట్లాడుతూ అగధ' లాంటి ఓ అద్భుతమైన చిత్రంలో నాకు అవకాశం ఇచ్చిన ఎం.ఎస్. రాజుకి థాంక్స్. 'పొలిమేర' పోస్టర్ బాగుందని రాజు నాతో చెప్పారు. ఈ ప్రాజెక్ట్ కోసం ఆయన నన్ను పిలిచినప్పుడు ఎంతో సంతోషించాను అని అన్నారు. శ్రవణ్ రెడ్డి , ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్ , వనితా విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## వడ్డీ లేని రుణ పరిమితి రూ.10 లక్షలకు పెంపు

ప్రకటించిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

మహిళా సంఘాలకు తీపి కబురు




ప్రజాపక్షం/హైదరాబాద్ : మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు అర్హత గల మహిళా సంఘాలకు అందిస్తున్న రూ.5 లక్షల వడ్డీ లేని రుణ పరిమితిని ఇకపై రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. మహిళా సంఘాలు తీసుకునే రూ.10 లక్షల వరకు బ్యాంకు రుణాలపై వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని ఆమె స్పష్టం చేశారు. హైదరాబాద్ జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన మహిళా స్వయం సహాయక బృందాల వార్షిక రుణ ప్రణాళిక 202627 ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల కోసం రూపొందించిన వార్షిక బ్యాంకు రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 202627 ఆర్థిక సంవత్సరానికి మహిళా సంఘాలకు రూ.26,621.47 కోట్ల రుణ సదుపాయం కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలకు రూ.25,228.89 కోట్ల బ్యాంకు రుణాలు అందించినట్లు తెలిపారు. గత రెండేళ్లలో రూ.40 వేల కోట్ల రుణాల లక్ష్యాన్ని అధిగమించి రూ.60 వేల కోట్ల రుణాలు మహిళా సంఘాలకు అందించినట్లు చెప్పారు. మహిళా ఉన్నతే తెలంగాణ ప్రగతి అన్న నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం యజ్ఞంలా కృషి చేస్తోందని తెలిపారు. మహిళలు పేదరికం నుంచి బయటపడినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పంట కొనుగోలు కేంద్రాల్లో 40 శాతం కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించినట్లు చెప్పారు. మహిళా సంఘాలు రుణాల రీపేమెంట్లో అద్భుతమైన క్రమశిక్షణ చూపుతున్నాయని, ఎస్‌హెచ్‌జిల ఎన్‌పిఏ కేవలం 1.40 శాతంగా ఉండటం వారి ఆర్థిక బాధ్యతకు నిదర్శనమన్నారు. నిర్మల్ జిల్లా జీరో ఎన్‌పిఏ సాధించడం గర్వకారణమన్నారు. జిల్లా డిఆర్‌ఓ విజయ లక్ష్మి , జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు గంగవ్వను మంత్రి అభినందించారు. అన్ని జిల్లాలు నిర్మల్ తరహాలో 100 శాతం రీపేమెంట్ సాధించాలని పిలుపునిచ్చారు. మహిళా సంఘాల రుణాలపై వడ్డీ భారం తగ్గించేందుకు ఈ ఏడాది ప్రభుత్వం రూ.2,500 కోట్లు ఖర్చు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. బ్యాంకులకు ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తోందని, మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వడంలో ఎలాంటి భయం అవసరం లేదని బ్యాంకర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, సేర్ప్ సిఇఓ దివ్వ దేవరాజ్, స్త్రీనిధి ఎం.డి.శ్రీనాథ్, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అవసరం

డార్క్ వెబ్, క్రిప్టోకరెన్సీ లావాదేవీలపై నిరంతర నిఘా

పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు: డిజిపి సివి.ఆనంద్



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో పెరుగుతున్న డ్రగ్స్ వ్యాపారాన్ని పూర్తిగా అరికట్టాలంటే పోలీసులతో పాటు ప్రజలందరూ భాగస్వాములవ్వాలని తెలంగాణ డిజిపి సివి.ఆనంద్ పిలుపునిచ్చారు. 'ఈగిల్ ఫోర్స్' (ఇలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్‌లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ) ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన తొలి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఇతర విభాగాల సమీక్షకు ముందుగా డ్రగ్స్ నియంత్రణ కోసం ఏర్పాటైన ఈగిల్ ఫోర్స్ పనితీరును పరిశీలించడం ప్రాధాన్యంగా తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతున్నదని, యువత భవిష్యత్తును కాపాడటానికి సమాజం మొత్తం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఇప్పటికే డ్రగ్స్ సరఫరాను పూర్తిగా నిర్మూలించాలంటూ పోలీసులకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు గుర్తు చేశారు. కేవలం ఒక ప్రత్యేక విభాగం ఏర్పాటు సరిపోదని, మొత్తం పోలీస్ యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. గతంలో మావోయిస్టుల నిర్మూలనలో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్‌ఐబి), గ్రేహౌండ్స్ ఎలా కీలక పాత్ర పోషించాయో, అదే విధంగా డ్రగ్స్ నిర్మూలనలో కూడా అన్ని విభాగాలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈగిల్ ఫోర్స్ పనితీరు, గత కార్యకలాపాలపై సమగ్ర సమీక్ష నిర్వహించిన డిజిపి, ఆధునిక సాంకేతికత వినియోగం, మనీ ట్రయిల్స్ గుర్తించడం, విదేశీ సిండికేట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, వరంగల్ కమిషనరేట్లలోని నాలుగు నార్కోటిక్ పోలీస్ స్టేషన్లు, ఏడు రీజినల్ సెల్స్, 20 ఎన్‌ఫోర్స్‌మెంట్ యూనిట్ల మధ్య సమన్వయం పెంపుపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో డ్రగ్స్ కేసుల నమోదులో గణనీయమైన పెరుగుదల నమోదైందని తెలిపారు. డ్రగ్స్ ద్వారా సంపాదించిన అక్రమ ఆస్తులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, నైజీరియా డ్రగ్ కార్టెల్స్, హవాలా నెట్‌వర్క్‌లను ఛేదించినట్లు తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తరించాలని, ఇప్పటికే ఏర్పాటైన 4,500 యాంటీ డ్రగ్ కమిటీల పనితీరును మెరుగుపరచాలని సూచించారు. డ్రగ్స్‌తో పాటు ర్యాగింగ్, సైబర్ నేరాలు, మహిళల భద్రత అంశాలను కూడా పరిగణలోకి తీసుకునే సమగ్ర కమిటీల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. డ్రగ్స్ సమస్యపై విద్యాసంస్థలు నిర్లక్ష్యం వహించకూడదని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని డిజిపి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఎస్‌పిలు పద్మజ, సీతారాం, రఘువీర్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## భూమిని రక్షించుకోవాలి (మొదటి పేజీ తరువాయి)

మెగా రైతు మేళా చివరి రోజున గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్య అతిథులుగా హాజరై వివిధ స్టాళ్లను సందర్శించారు. వారి వెంట వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, రాష్ట్ర హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు చాహాత్ బాజ్‌పాయి, డాక్టర్ సత్య శారద,కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఇనగాల వెంకట్రామి రెడ్డి, సంబంధిత శాఖల జిల్లా ఆఅధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతు ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మెగా రైతు మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ వ్యవసాయానికి కొత్త దిశ చూపిన రైతు మేళా అని అన్నారు. మారుతున్న వ్యవసాయ విధానాలకు అనుగుణంగా యాంత్రీకరణ,పురుగుమందులు, ఎరువులు, విత్తనాలు, మార్కెటింగ్ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. దేశంలోనే మొక్కజొన్న కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేస్తున్నామని చెప్పారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సిద్దిపేటలో ఆయిల్ పామ్ మిల్లును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాతావరణ ప్రభావం తక్కువగా ఉండే, అధిక లాభాలు ఇచ్చే ఆయిల్ పామ్ పంటను రైతులు విస్తృతంగా సాగు చేయాలని సూచించారు. పంట మార్పిడి ద్వారా రైతులు స్థిరమైన ఆదాయం పొందాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ రైతులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకునే విధంగా స్ఫూర్తిదాయక ప్రసంగాలు విన్నామని తెలిపారు. వివిధ పంటలను సాగు చేస్తున్న అనుభవజ్ఞులైన రైతులు తమ అనుభవాలను పంచుకోవడం ఎంతో ప్రేరణనిచ్చిందన్నారు. సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారించి ఆరోగ్యకరమైన పంటలను ఉత్పత్తి చేయాలని కోరారు. ఆయిల్ పామ్ పంట లాభసాటిగా ఉన్నందున రైతులు దీని సాగును విస్తృతంగా చేపట్టాలని మంత్రి సూచించారు.వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. రైతులకు చెందాల్సిన అన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందిస్తున్నదని తెలిపారు. స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం మరింత చేరువగా కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. పంటల మార్పిడి ద్వారా రైతులకు లాభాలు పెరుగుతాయని, రైతు మేళాల ద్వారా అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా, పంట కొనుగోళ్లు, రుణమాఫీ వంటి పథకాల ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు మాట్లాడుతూ రైతు సంక్షేమ పథకాలు, విద్యుత్ సరఫరా, సన్న బియ్యానికి బోనస్ వంటి కార్యక్రమాలు రైతులకు ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ మాట్లాడుతూ రుణమాఫీ, పంట విస్తీర్ణం పెరుగుదల, ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంపై వివరించారు.ఆలేరు రైతు గోపిరెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుతో స్థిరమైన ఆదాయం లభిస్తోందని తెలిపారు. మహిళా రైతు లావణ్య రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం, అంతర పంటల సాగు ద్వారా లాభాలు సాధిస్తున్నామని తెలిపారు. మహిళా రైతు భాగ్యలక్ష్మి మిర్చి పంట సాగు, విలువ ఆధారిత ఉత్పత్తుల విక్రయాల గురించి వివరించారు.ఈ సందర్భంగా ఆదర్శ రైతులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఘనంగా సన్మానించారు.ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం కోర్టులో తేల్చుకోండి (మొదటి పేజీ తరువాయి)

చెప్పింది. పిటిషనర్‌కు ఇంకా అభ్యంతరాలు ఉంటే సుప్రీం కోర్టుకు వెళ్లవచ్చునని జస్టిస్ నగేశ్ భీమపాక గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 26న జీవో నెం.71 ద్వారా కోదండరాం, అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా నియమించింది. ఈ నియామకాలను సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ హైదర్ హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎమ్మెల్సీ నియామకాల అంశంపై వివాదం ఇప్పటికే సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉందని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో తాజా నియామకాలు చేపట్టడం సముచితం కాదన్నారు. అలాగే జీవోలో సంబంధిత స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) వివరాలను ప్రస్తావించలేదని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కోర్టు, జీవోలోనే ఈ నియామకాలు సుప్రీం కోర్టు తుది తీర్పుకు లోబడి ఉంటాయని స్పష్టంగా పేర్కొన్నారని తెలిపింది. సుప్రీం కోర్టు విచారణలో ఉన్న అంశంపై హైకోర్టు జోక్యం చేసుకోదని పేర్కొంటూ పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్లు చెప్పింది.

## యుద్ధానికి తెర (మొదటి పేజీ తరువాయి)

తెలియజేస్తామని ఇరాన్ విదేశీ మంత్రిత్వశాఖ ప్రకటించింది. ఈ విధంగా అమెరికా–ఇరాన్ మధ్య దౌత్య చర్చలు ముందుకు వెళుతూ ఉండటంతో చమురు ధర గణనీయంగా తగ్గింది. అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్‌లు కూడా జోరుగా పరుగులు తీశాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారల్ ధర 100 డాలర్ల వద్ద స్థిరంగా ఉన్నప్పటికి ఇది రెండు నెలల క్రితం ఉన్న ధర కంటే ఎక్కువే. ''రెండు నెలల యుద్ధం త్వరలో ముగుస్తుంది, చమురు కష్టాలు తీరిపోతాయి, చమురు,సహజ వాయువు రవాణాలో ఉన్న ఆటంకాలు తొలగిపోతాయి,ఐతే ఇదంతా ఇప్పుడు ఇరాన్ మీదే ఆధార పడి ఉంది,వారు ఒప్పందానికి రాకపోతే మళ్ళీ బాంబు దాడులు ప్రారంభమవుతాయి'' అని సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ప్రకటన చేశారు. ఇరాన్ సీనియర్ ఎంపీ సమాచారం ప్రకారం ట్రంప్ మొదటి నుండీ చెబుతున్నవిధంగా యురేనియం అంశంతోపాటు పాత విషయాలనే ప్రధానంగా ముందుకు తెచ్చారని భావిస్తుండగా, ట్రంప్ ఎందుకు హోర్ముజ్ జలసంధిలో ''ప్రాజెక్టు ఫ్రీడమ్''ను ప్రకటించిన కొద్ది గంటలకే ఎందుకు స్తంభింపజేశారనే విషయంపై అంతర్జాతీయ మీడియాలో మరోవైపు ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఇరాన్‌తో దాదాపు ఒక సమగ్ర ఒప్పందం కుదిరినందువల్ల, ట్రంప్ కోరిన విధంగా కొన్ని రాయితీలు పొందినందువల్ల ఇరాన్ నుండి అధికారిక ప్రకటన కోసం 50 గంటలపాటు 'పారజెక్టు ఫ్రీడమ్'ను ట్రంప్ వాయిదా వేశారన్న విషయం చక్కెర్లు కొడుతోంది. పశ్చిమాసియాలో ఇరాన్‌పై గడచిన ఫిబ్రవరి 28న ప్రాంభించిన ''ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' (ఇరాన్‌పై యుద్ధం) ముగిసిందని అమెరికా విదేశీ వ్యవహారాలమంత్రి మార్కో రుబియో బుధవారం ప్రకటించారు.దౌత్య చర్చలు,శాంతి మార్గానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.కానీ ట్రంప్ మాత్రం తనదైన శైలిలో యథాప్రకారమే ఇరాన్‌కు హెచ్చరిక జారీ చేశారు. సంప్రదింపులలో మంచి పురోగతి ఒప్పందం కుదిరినందువల్ల ఒక అవగాహన ఒప్పందంపై (ఎంఓయు) సంతకాలకోసం వేచిచూస్తామని, అందుకోసం ''ప్రాజెక్టు ఫ్రీడమ్''కు 50 గంటలు విరామం ఇచ్చామని సోషల్ మీడియా వేదికగా ట్రంప్ చెప్పారు. ఒప్పందానికి వస్తే, ఇరాన్‌తోసహా అన్ని దేశాలకూ హోర్ముజ్ జలసంధి తెరచుకుంటుందని, ఇరాన్ ఓడరేవులపై అమెరికా సెంట్‌కామ్ బలగాలు అమలు చేస్తున్న దిగ్బధనం ముగుస్తుందని లేకపోతే బలప్రయోగంతో అణచివేత దాడులు ప్రారంభిస్తామని హెచ్చరించారు.
ఉన్న వాస్తవిక పరిస్థితులను గుర్తించి చర్చల బల్ల వద్దకు వచ్చి షరతులను ఇరాన్ అంగీకరించాలి,లేకపోతే ఇరాన్ ఒంటరితనం, ఆర్థికపతనంతోపాటు అంతిమంగా సంపూర్ణ ఓటమివైపు వెళుతుందని మార్కో రుబియో ఇంతకుముందు వ్యాఖ్యానించారు. రెండు దేశాలమధ్యా ఇస్లామాబాద్‌లో మొదటి దశ ముఖాముఖీ చర్చలు విఫలమైన తర్వాత అమెరికా–ఇరాన్ మధ్య ఏప్రిల్ 8వ తేదీ నుండి కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉంది. ఏప్రిల్ 13 నుండి ట్రంప్ హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవుల నుండి నౌకలు రాకపోకలు చేయకుండా దిగ్బంధనం అమలు చేయడం ప్రారంభించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com